ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 24.04.2026 | సంపుటి : 12 సంచిక : 275 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## రేషన్ కార్డులకు 'ఈ-కేవైసీ' తప్పనిసరి

**అనర్హుల తొలగింపునకు ప్రభుత్వం కీలక నిర్ణయం**

హైదరాబాద్(జనంసాక్షి): రేషన్ కార్డు వినియోగ దారులందరికీ 'ఈ-కేవైసీ' ప్రక్రియను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. చాలా మంది లబ్ధిదారులు తమ కార్డులలో వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వల్ల రేషన్ నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే లక్షలాది కార్డులు నిబంధనలు పాటించని కారణంగా రద్దు చేశారు. ప్రతి కార్డుదారుడు తమ ఆధార్ వివరాలను రేషన్ కార్డుతో

మిగతా 2లో..

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి

2లో..

# కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తాం

- కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం
- కాదని.. నివేదిక కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టంగా చెప్పింది
- బీఆర్ఎస్ నేతలు సంబరాలు ఎందుకో అర్థం కావడం లేదు
- అభిషేక్ సింఘ్వీని కలిసి తదుపరి కార్యాచరణ చేపడతాం
- ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు
- కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దు
మంత్రుల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు
- వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు
- సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం
- తెలంగాణ కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి

**త్వరలో దర్యాప్తు సంస్థ డైరెక్టర్‌ను కలుస్తాం**

**కేసీఆర్,హరీశ్‌లు నిర్దోషులని హైకోర్టు ఎక్కడా చెప్పలేదు**




హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం అంశంపై ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంత్రుల సబ్‌కమిటీ వేసుకుని.. చర్చించుకుని ఎలా ముందుకెళ్లాలో నిర్ణయిస్తామని చెప్పారు. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐకి లేఖ రాసి 9 నెలలు గడిచినా ఎందుకు ముందుకెళ్లట్లేదో మీరే అర్థం చేసుకోవచ్చన్నారు. తాను, సీఎం రేవంత్ త్వరలో సీబీఐ డైరెక్టర్‌ను కలవబోతున్నట్లు వెల్లడించారు. "కాళేశ్వరం అవకతవకలపై వేసిన కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని కేసీఆర్,

మిగతా 2లో..

## కాళేశ్వరంపై సుప్రీంకు..

- హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం
- కాళేశ్వరం పేరుతో సొమ్మును వృధా చేశారు
- హైకోర్టు తీర్పుపై సంబరాలు ఎందుకు?
- త్వరలోనే కారకుల అరెస్టు ఖాయం
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

2లో..



## ఉధృతమవుతున్న ఆర్టీసీ సమ్మె

**రెండోరోజూ కొనసాగిన నిరసనలు**

**నర్సంపేటలో కార్మికుడి ఆత్మహత్యాయత్నం**

**పరిస్థితి విషమం.. ఎంజీఎంకు తరలింపు**



ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శంకర్ గౌడ్

### ఆర్టీసీ కార్మికుల తొందరపాటు నిర్ణయాలు వద్దు

- ప్రాణాలు తీసుకోవడం పరిష్కారం కాదు
- సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉన్నాం
- అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది
- కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సూచించాం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఆర్టీసీ కార్మికులతో చర్చలకు డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన సబ్‌కమిటీ
- సభ్యులుగా మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం జూపల్లి
- అనాలోచిత చర్యలకు పాల్పడవద్దు
- కార్మికులు ప్రేరేపిత శక్తులకు బలికావొద్దు: శ్రీధర్‌బాబు

2లో..

- ఎక్కడికక్కడే నిలిచిపోయిన బస్సులు
- బలవంతంగా నడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికుల అరెస్టు
- నేడు ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన
- రేపు అన్ని డిపోల్లో వంటవార్పు
- కార్యాచరణ ప్రకటించిన జేఏసీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని

మిగతా 2లో..



## బెంగాల్, తమిళనాడులో వెల్లువెత్తిన ఓటరుచైతన్యం


**ఇరు రాష్ట్రాలో భారీగా పోలింగ్ నమోదు**

- తమిళనాడులో 82.24%.. పశ్చిమ బెంగాల్‌లో 89.93శాతం నమోదు
- ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు



న్యూఢిల్లీ(జనంసాక్షి): తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ సాయంత్రం 5గంటల వరకు తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదు కాగా, పశ్చిమ బెంగాల్ (తొలి విడత ఎన్నికలు)లో 89.93శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. చెన్నైలో 81.34శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పూర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. ఇప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి

మిగతా 2లో..



**భారత్, చైనాలు మహోన్నత నాగరికతలకు**

# పుట్టినిళ్లు

**ట్రంప్‌నకు ఇరాన్ గట్టి కౌంటర్**



టెహ్రాన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఇరాన్ గట్టి కౌంటర్ ఇచ్చింది. భారత్, చైనా సహా ఇతర దేశాలను నరకాలతో పోలుస్తూ అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే భారత్ నాగరికతకు పుట్టినిల్లు అంటూ హైదరాబాద్‌లోని ఇరాన్ ఎంబసీ పోస్టు పెట్టింది."ఆసియా దేశాల నుంచి మహిళలు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి బిడ్డకు జన్మనిస్తారు. ఇక్కడ ఉన్న చట్టాలేమో ఆ బిడ్డకు వెంటనే అమెరికా సిటిజన్‌షిప్ ఇస్తాయి. ఆ తర్వాత వారు తమ కుటుంబసభ్యులందరినీ చైనా, భారత్ లేదా మరేదైనా నరకం నుంచి ఇక్కడికి తీసుకొస్తారు" అంటూ జన్మతః పౌరసత్వంపై మైఖెల్ షేర్ చేసిన ఒక లేఖను ట్రంప్ రీపోస్టు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ఇరాన్ కౌంటర్ ఇస్తూ.. "భారత్, చైనాలు మహోన్నత నాగరికతలకు పుట్టినిళ్లు. ఇరాన్ నాగరికతను నాశనం చేస్తామని ఒక యుద్ధ నేరస్థుడైన అధ్యక్షుడు చెప్పడమే అసలైన నరకం" అని విమర్శించింది. ఇరాన్ నాగరికత మొత్తం అంతమైపోతుందని గతంలో ట్రంప్ హెచ్చరికలు చేసిన తెలిసిందే. ఆ బెదిరింపులను ఉద్దేశించే తాజా స్పందన వచ్చింది. భారత, చైనా నాగరికతలు ప్రపంచంలోనే పురాతన, సజీవ నాగరికతలు. 4వేల ఏళ్లనాటి చరిత్ర, సంస్కృతి ఈ దేశాల సొంతం. ఈజిప్ట్, మెసొపొటేమియా వంటి నాగరికతలు అంతమైనా భారత్, చైనా నాగరికతలు సింధు, హ్వాయాంగ్ హో నది (యల్లో రివర్) ఒడ్డున విస్తరించాయి. ఈ రెండూ వేర్వేరు భౌగోళిక పరిస్థితుల్లో విలసిల్లినా.. ఆసియా

మిగతా 2లో..

### ఆ కథనాలను అక్కడితో వదిలేస్తున్నాం

**ట్రంప్ 'నరకం' వ్యాఖ్యలపై స్పందించిన భారత్**

2లో..

## ట్రంప్ మరోసారి అనుచిత వైఖరి

- భారత్‌ను నరకంతో పోల్చిన లెటర్‌ను షేర్ చేసిన అమెరికా అధ్యక్షుడు
- ఇరాన్‌తో చర్చల గురించి ఒత్తిడేమీ లేదు
- హర్మూజ్ జలసంధిలో మందుపాతరలు పెట్టే ఇరాన్ నౌకలను కాల్చేయండి
- అమెరికా నౌకాదళాన్ని ఆదేశించిన ట్రంప్
- మీ డొల్ల మాటలను ప్రపంచం గమనిస్తోంది
- ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజష్కియాన్ తీవ్ర విమర్శలు

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను ఉద్దేశించి మరోసారి అనుచిత వైఖరి ప్రదర్శించారు. భారత్, చైనా సహా ఇతర దేశాలను నరకాలతో పోలుస్తూ అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్ట్ చేశారు. జన్మతః పౌరసత్వం అంశాన్ని ప్రస్తావిస్తూ మైఖెల్ జాత్యహంకార వ్యాఖ్యలు చేశారు. "ఆసియా దేశాల నుంచి మహిళలు తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి బిడ్డకు జన్మనిస్తారు. ఇక్కడ ఉన్న చట్టాలేమో ఆ బిడ్డకు వెంటనే అమెరికా సిటిజన్‌షిప్ ఇస్తాయి. ఆ తర్వాత వారు తమ కుటుంబసభ్యులందరినీ చైనా, భారత్ లేదా మరేదైనా నరకం నుంచి ఇక్కడికి తీసుకొస్తారు" అంటూ అనుచితంగా ఆ లేఖలో రాసుకొచ్చారు. ఇలా అమెరికా పౌరసత్వం లేనివారికి జన్మించిన పిల్లలకు ఆటోమేటిక్‌గా సిటిజన్‌షిప్ రావడాన్ని మైఖెల్ వ్యతిరేకించారు. ఈ అంశాన్ని కోర్టులకు వదిలేయకుండా ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని

మిగతా 2లో..



## బెంగాల్‌లో అధికారం మాదే

- కొన్ని జిల్లాలో తృణముల్ ఖాతా తెరవదు
- ప్రధాని మోదీ జోస్యం

కోల్‌కతా(జనంసాక్షి): బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తప్పకుండా విజయం సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నదియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గతంలో మనం చూసుకుంటే భారీగా ఓటింగ్ జరిగిన ప్రాంతాల్లో భాజపా ఘన విజయం సాధించింది. బెంగాల్‌లో కూడా మే 4న భాజపా చరిత్ర సృష్టించనుంది. ఆ తర్వాత రాష్ట్రమంతా మిఠాయిలు పంచి వేడుక చేసుకుందాం. దాంతో పాటు ఝాల్‌ముఢీ కూడా పంచుతాం. ఈ మధ్యే నేను విన్నాను. ఝాల్‌ముఢీ కొందరికి షాక్ కొట్టించింది. అది నేను తింటే మంట మాత్రం టీఎంసీకి తగిలిందని వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. అయిదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఈ ఎన్నికల్లో మాత్రమే హింస తక్కువగా జరిగిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఇంత ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగడం కీలకమైన పరిణామం అన్నారు. పశ్చిబెంగాల్ లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ కి ఝుల్మురి భయంకరమైన షాక్ ఇచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. టిఎంసి చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించడం, మహా జంగల్ రాజ్‌ను పోత్సహిస్తోందని మోడీ ఆరోపించారు. బెంగాల్ లో బిజెపి అధికారంలోకి వస్తే మతువా, నమశూద్ర వర్గాలకు ఆశ్రయం కల్పిస్తామని మోడీ కృష్ణానగర్లో జరిగిన ఎన్నికల ర్యాలీలో హామీనిచ్చారు.. ఈ ర్యాలీలో మోడీ ప్రసంగించారు. 'మీరు బిజెపి- ఎన్డిఎ విజయ పతాకాన్ని ఎగురవేయాలి. మే 4న బెంగాల్లో బిజెపి విజయోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తారు. ఝుల్మురిని కూడా అందజేస్తారు. ఝుల్మురి కొంతమందికి పిడుగులాంటి షాక్ ఇచ్చింది. నేను ఝుల్మురి తిన్నాను.

మిగతా 9లో..



**రచయితలు, మేధావుల అభిప్రాయాలను**

## గౌరవిస్తాం

**కానీ 'వాట్సప్ యూనివర్సిటీ' సమాచారం తీసుకోం**

**ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష' కేసులో గురువారం మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రముఖ రచయితలు, మేధావుల అభిప్రాయాలను గౌరవిస్తామని.. వాట్సప్ యూనివర్సిటీ ప్రచారాన్ని మాత్రం అంగీకరించలేమని పేర్కొంది."జ్ఞానంతో కూడిన వివరణ ఎక్కడి నుంచి వచ్చినా దానిని స్వాగతించాలి" అని సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ ఒక కథనాన్ని చూపిస్తూ వాదించారు. "మేం ఆ అభిప్రాయాలను

మిగతా9లో..

**ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు**

## డబుల్ డెక్కర్ కారిడార్

- తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ
- ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు

మిగతా 2లో..

## రాహుల్‌తో టీపీసీసీ చీఫ్ భేటీ

**తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై చర్చ**



న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాహుల్‌కు టీపీసీసీ చీఫ్ వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలో తాజా రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. కాంగ్రెస్

మిగతా 9లో..

## లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ ముఠాలను పాక్ అణిచివేయాలి

**అమెరికా కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్‌షెర్మన్**

9లో..

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

- తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం
- ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

## భారత్, చైనాలు మహోన్నత నాగరికతలకు పుట్టినిళ్లు

చరిత్రపై బలమైన ప్రభావాన్ని చూపించాయి. ఇప్పుడు ఈ రెండు దేశాలు బలమైన ఆర్థిక శక్తులుగా ఎదుగుతున్నాయి. అలాగే ఇరాన్ నాగరికత (పర్షియా) కూడా పురాతనమైనదే. అదే అమెరికా విషయానికొస్తే.. 1776లో ఏర్పడింది. అంటే దాని చరిత్ర పట్టుమని 250 ఏళ్లే.

## ట్రంప్ మరోసారి అనుచిత వైఖరి

డిమాండ్ చేశారు. ఆ లేఖనే ట్రంప్ రీపోస్టు చేశారు. ప్రపంచంలో ఏ దేశమూ అమెరికా దేశంలా జన్మతః పౌరసత్వాన్ని కల్పించడం లేదని ఇప్పటికే ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. అయితే అందులో వాస్తవం లేదు. 30కి పైగా దేశాలు ఈ హక్కును కల్పిస్తున్నాయి. కెనడా, మెక్సికో సహా పలు దక్షిణ అమెరికా దేశాలు ఈ పౌరసత్వాన్ని అందిస్తున్నాయి.

ఇరాన్‌తో చర్చల గురించి ఒత్తిడేమీ లేదు

అమెరికా- ఇరాన్ మధ్య రెండోవిడత జరగాల్సిన చర్చలపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలను పునఃప్రారంభించడానికి తనపై ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ పొడిగింపు స్వల్పకాలమే అంటూ వస్తోన్న వార్తలను ట్రంప్ తోసిపుచ్చారు. మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఈ సంఘర్షణను తాను తొందరగా ముగించాలనుకుంటున్నానని ప్రజలు భావిస్తున్నారని, కానీ.. వాటిలో నిజం లేదని అధ్యక్షుడు స్పష్టం చేశారు. అమెరికా ప్రజల కోసం ఒక మంచి ఒప్పందం కుదుర్చుకోవడం పైనే తమ ప్రభుత్వం దృష్టిసారించిందని తెలిపారు. ఇరాన్ (ఎతీజీని) శాంతి ప్రతిపాదన సమర్పించడానికి ఎలాంటి గడువు నిర్దేశించలేదన్నారు. సీజ్‌ఫైర్ కొనసాగుతుండగా.. హర్మూజ్ (ాబితీజీతిబి నీట ఊనీతీఎబీళి)లో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తిన సంగతి తెలిసిందే. బుధవారం ఇరాన్ పలు నౌకలపై కాల్పులు జరిపి, కొన్నింటిని స్వాధీనం చేసుకొన్న విషయంపై ట్రంప్ స్పందించారు. ఆ నౌకలు అమెరికావి కావన్నారు. అదే సమయంలో జలసంధిలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇరాన్ నాయకత్వాన్ని బాంబు దాడుల కంటే.. దిగ్బంధనమే ఎక్కువగా భయపెడుతోందని ట్రంప్ అన్నారు. దిగ్బంధనంతో.. ఇరాన్ ఇంధన మౌలిక సదుపాయాలకు ఎక్కువ నష్టం కలుగుతుందని హెచ్చరించారు. వారి చమురు బావులు శాశ్వతంగా మూతపడాల్సిన పరిస్థితి కూడా రావచ్చన్నారు.

మీ డొల్ల మాటలను ప్రపంచం గమనిస్తోంది: పెజెష్కియాన్

అమెరికాపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తీవ్ర విమర్శలు చేశారు. చర్చలు, ఒప్పందాలను ఇరాన్ స్వాగతిస్తుందని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. మాట తప్పడం, దిగ్బంధనం, బెదిరింపులు వంటివి ఇరుదేశాల మధ్య జరగాల్సిన చర్చలకు అసలైన అడ్డంకులుగా పేర్కొన్నారు. అమెరికా మాటలు, చేష్టలకు మధ్య తేడాని ప్రపంచం గమనిస్తోందన్నారు. ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ అమలులో ఉన్న వేళ డొనాల్డ్ ట్రంప్ తమ సైన్యానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిలో మందుపాతరలను అమర్చేలా కనిపించే ఇరాన్‌కు చెందిన నౌకలేవైనా.. అవి ఎంతచిన్నవైనా సరే కాల్చేయాలని, అందులోని సిబ్బందిని మట్టుబెట్టాలని అమెరికా నౌకాదళాన్ని ఆదేశించారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ప్రకటిస్తూ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. "హర్మూజ్ జలసంధిలో మైన్లను పెడుతున్న ఏ చిన్న పడవైనా సరే కాల్చి ధ్వంసం చేయాలని నేవీని ఆదేశించాను. ఈ విషయంలో ఏమాత్రం సంకోచించొద్దని చెప్పా. అమెరికా మైన్ స్వీపర్లు ప్రస్తుతం జలసంధిని క్లియర్ చేస్తున్నాయి. ఈ కార్యాచరణను మూడు రెట్లు అధిక వేగంతో కొనసాగించాలని ఆదేశిస్తున్నాను" అని పేర్కొన్నా రు.ఇరాన్ ప్రస్తుతం తమ నాయకుడు ఎవరో తేల్చుకొనేందుకు తీవ్ర ఇబ్బంది పడుతోందన్న ట్రంప్.. హర్మూజ్‌పై తాము పూర్తి నియంత్రణ సాధించినట్లు తెలిపారు. అమెరికా నేవీ అనుమతి లేకుండా ఏదైనా నౌక ప్రవేశించడం గానీ, బయటకు వెళ్లడం గానీ జరగదన్నారు. ఇరాన్ ఒప్పందానికి వచ్చేంతవరకు మూసివేసి ఉంటుందని తెలిపారు.

## ఆ కథనాలను అక్కడితో వదిలేస్తున్నాం

న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌ను నరకంతో పోల్చడంపై.. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస ్వాల్ స్పందించారు. "ఆ కథనాలను మేం చూశాం. వాటిని అక్కడితో వదిలేస్తున్నాం" అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. అమెరికాలో అమల్లో ఉన్న జన్మతః పౌరసత్వ చట్టాన్ని ట్రంప్ ఎప్పటినుంచో వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సావేజ్ షేర్ చేసిన లేఖను రీపోస్టు చేశారు..

## బతుకులు బుగ్గి

- ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు
- మంటలు చెలరేగి 11మంది సజీవ దహనం

లక్నో(జనంసాక్షి):ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపుతప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టారు.

# కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తాం

ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు.హరీశ్‌రావు పిటిషన్ వేశారు. అయితే, కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. కేసీఆర్, హరీశ్‌రా వుల ప్రధాన విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. కమిషన్‌ను చట్టవిరుద్ధం కాదని.. నివేదిక కొన సాగుతుందని హైకోర్టు స్పష్టంగా చెప్పింది. సాంకే తిక అంశాల కారణంగానే కేసీఆర్, హరీశ్‌రావు లపై చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. వారిద్ద రూ నిర్దోషులని, కాళేశ్వరం అవకతవకలకు బాధ్యులు కారని ఉన్నత న్యాయస్థానం ఎక్కడా చెప్పలేదు. బీఆర్‌ఎస్ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదు. అభిషేక్ సింఘ్వీని కలిసి తదుపరి కార్యాచరణ చేపడతాం" అని మంత్రి ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు జరుపనుంది. కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దని కేబినేట్ విజ్ఞప్తి చేసింది. కాళేశ్వరం తీర్పు పరిశీలించాక



తదుపరిచర్యలు తీసుకోవాలని, న్యాయనిపుణులతో సంప్రదించాలని, సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపునకు ఉపయోగించాలని నిర్ణయించారు. వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు చేయనున్నారు. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.

తెలంగాణ కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాల వివరాలు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి శ్రీహరిలు వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలకంగా చర్చ జరిగింది. సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేసిన ఆయన.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రుల కమిటీతో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు పిలుపు నిచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల బృందం కార్మిక సంఘాలతో భేటీ కానుంది

## కాళేశ్వరంపై సుప్రీంకు..





హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్‌కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

**కాళేశ్వరం పేరుతో తెలంగాణ సొమ్ము నాశనం**

కాళేశ్వరం అంశంలో హైకోర్టు తీర్పుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. త్వరలోనే సంబరాల రాంబాబులను లోపలేస్తామని హెచ్చరించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... కేటీఆర్, హరీశ్.. ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు తీర్పుపై బీఆర్‌ఎస్ నాయకులు అబద్దాలు చెబుతున్నారన్నారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని ఎంపీ తెలిపారు. కాళేశ్వరంలో దోపిడీ చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. తన సొంత బ్రాండ్ కోసమే కేసీఆర్ కాళేశ్వరం కట్టారని.. తెలంగాణ సొమ్మును నాశనం చేశారని ఆరోపించారు. బ్రాండ్ కోసమే కేసీఆర్ తట్టెడు అబద్దాలు, పిట్ట కథలు చెప్పారని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకే కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని ఎంపీ ప్రశ్నించారు. '24 గంటల్లో సినిమా చూపిస్తామన్న బీజేపీ ఎక్కడికి పోయిందన్నారు. సీబీఐ విచారణ ఎందుకు ఆలస్యం అవుతోందన్నారు. బీజేపీ నాయకులు వెంటనే సీబీఐతో విచారణ చేయించండని డిమాండ్ చేశారు. మానిపోయిన గాయానికి మళ్లీ మందు పెట్టేందుకు కేసీఆర్ బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు. సెంటిమెంట్ డైలాగులతో ప్రజలను మళ్లీ మోసం చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మేడిగడ్డ గుండెకాయ అన్నారని.. మేడిగడ్డ కుంగిపోయాక కాళేశ్వరం కూలిపోయినట్టే కదా అని ఎంపీ అడిగారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే ప్రమాదమని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే కాళేశ్వరం కూలిపోయిందన్నారు. నాణ్యత పాటించకుండా ప్రాజెక్ట్ కట్టి.. కూలిపోగానే కాంగ్రెస్‌పై కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పు పట్టలేదని తెలిపారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విచారణకు రమ్మన్న అంశంపై మాత్రమే కోర్టు అభ్యంతరం తెలిపిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అప్పు పుట్టకపోతే కార్పొరేషన్ ఏర్పాటు చేసి అప్పు తెచ్చారని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## రేషన్ కార్డులకు 'ఈ-కేవైసీ' తప్పనిసరి

అనుసంధానించి.. వేలిముద్రల ద్వారా ధృవీకరణ పూర్తి చేసుకోవడం అత్యవసరం.రేషన్ కార్డులో పేరున్న ప్రతి వ్యక్తి బ్రతికే ఉన్నారా లేదా? ఒకే వ్యక్తికి రెండు చోట్ల కార్డులు ఉన్నాయా? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి ఈ పక్రియ ఉపయోగపడుతుంది. ఇది పారదర్శకతను పెంచుతుంది. కార్డుదారులు తమ సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి, అక్కడి డీలర్ వద్ద ఉన్న ఈ-పోస్ యంత్రం ద్వారా తమ వేలిముద్రలను వేయాలి. దీనినే బయోమెట్రిక్ అథెంటికేషన్ అంటారు. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ఈ పక్రియ పూర్తి చేయని వారి పేర్లను కార్డు నుంచి తొలగించే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మొత్తం కార్డునే రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇప్పటికే క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ-కేవైసీ అప్‌డేట్ చేయని కారణంతో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బోగస్ కార్డులను అధికారులు గుర్తించి తొలగించారు. మీరు ప్రస్తుతం మీ ఊరిలో లేకపోయినా, 'వన్ నేషన్ ? వన్ రేషన్ కార్డ్' పథకం ద్వారా మీరు ఉన్న చోటే దగ్గరలోని రేషన్ షాపులో కేవైసీ పూర్తి చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పటికీ చాలా మంది రేషన్ కార్డుదారులు తమ ఈ కేవైసీ పక్రియను పూర్తి చేయలేదని.. వారు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం కోరుతోంది. దీంతో పాటు.. వరుసగా మూడు నెలల కంటే ఎక్కువ నెలలు ఆ రేషన్ కార్డు ద్వారా ఎలాంటి రేషన్ తీసుకోకపోతే.. ఆ కార్డులు కూడా రద్దయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా ర్దదైన కార్డులు కూడా దేశ వ్యాప్తంగా చాలా ఉన్నాయి.

## ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు డబుల్ డెక్కర్ కారిడార్

పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ - విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాట వచ్చు అని,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ పక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల తొందరపాటు నిర్ణయాలు వద్దు

హైదరాబాద్(జనంసాక్షి):ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని.. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. శుక్రవారం కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సీఎం సూచించారు. నర్సంపేటలో ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన నేపథ్యంలో సిఎం ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇదిలావుంటే ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించి... సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు జరుపుతుందని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. కార్మికులు ఆత్మనిబ్బరంతో ఉండాలని... ప్రభుత్వం తో చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మరోవైపు.. ఈయూ ఆఫీసులో ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తదుపరి కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 24న అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన, 25న అన్ని డిపోల్లో వంటవార్పు, 26న జిల్లా ల్లో ఆర్టీసీ సంఘాల కార్మిక కవాతు, 27న ప్రజాప్ర తినిధులకు వినతిపత్రాల అందజేత, అన్ని డిపోల్లో బతుక టమ్మ టలతో మహిళా ఉద్యోగుల నిరసన, 29న డిపోల ముందు కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ఆర్టీసీ కార్మికులతో చర్చలకు సబ్‌కమిటీ..

ఆర్టీసీ కార్మికులతో శుక్రవారం చర్చలు జరిపేందుకు సబ్‌కమిటీ ఏర్పాటయ్యింది. ఉపముఖ్యమంత్రి భట్టి , మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు ఇందులో సభ్యులు గా ఉన్నారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యాయత్నం ఘటనల గురించి తెలిసి సీఎం రేవంత్‌రెడ్డి చలించిపోయారని, అందుకే.. కేబినెట్ మీటింగ్ మధ్యలోనే మీడియా సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్మికులు క్షణికావేశానికి లోనుకావాల్సిన అవసరం లేదన్నారు. వారి విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు."గత ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలు రూ.వేల కోట్లు పెండింగ్‌లో పెట్టింది. ఇంకా రూ.6 వేల కోట్ల మొత్తం ప్రయోజనాలు ఇవ్వాల్సి ఉంది. ఈ బెనిఫిట్స్ ఇచ్చేందుకు మంత్రుల వేతనాల్లో సగం కేటాయిస్తున్నాం. బెనిఫిట్స్ పూర్తిగా ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. పీఏసీఎస్ ఛైర్మన్లను రాబోయే రోజుల్లో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు టాటా సంస్థ అంగీకరించింది.

# ఉధృతమవుతున్న ఆర్టీసీ సమ్మె

చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామారెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగు తుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కార్యాచరణ ప్రకటించిన జేఏసీ

మరోవైపు.. ఈయూ ఆఫీసులో ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తదుపరి కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 24న అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన, 25న అన్ని డిపోల్లో వంటవార్పు, 26న జిల్లాల్లో ఆర్టీసీ సంఘాల కార్మిక కవాతు, 27న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేత, అన్ని డిపోల్లో బతుకమ్మలతో మహిళా ఉద్యోగుల నిరసన, 29న డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలు ఉంటాయన్నారు.

నర్సంపేటలో కార్మికుడి ఆత్మహత్యాయత్నం

నర్సంపేట(జనంసాక్షి):తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ నర్సంపేట బస్టాండ్ ఎదుట గురువారం పెట్రోల్ పోసుకుని ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గురువారం రెండో రోజు నర్సంపేట డిపోలో ఉదయం నుంచి సమ్మె చేస్తున్న కార్మికులు ఆందోళన ఒకవైపు చేస్తుండగా మరొకవైపు కోల శంకర్ గౌడ్ తన శరీరంపై పెట్రోల్ పోసుకొని నిప్పు అట్లుందించుకోవడంతో మంటలు ఒకేసారి ఉవేత్ర లేవడంతో కార్మికుల మధ్యలో ఉన్న శంకర్ గౌడ్ ఆర్తనాదాలు ఉద్రిక్త పరిస్థితులకు దారి తీశాయి. ఒక్కసారిగా నర్సంపేట బస్టాండ్ సెంటర్లో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలియడంతో పట్టణవాసులు కార్మికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పరిస్థితిని చక్కదిద్దడానికి స్థానిక పోలీసులు విచ్చేసి ఉద్రిక్తతను తగ్గించేందుకు ప్రయత్నం చేశారు. నర్సంపేట పట్టణానికి చెందిన కోల శంకర్ గౌడ్ నర్సంపేట డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్నారు. మృదుస్వభావిగా ఉండే శంకర్ గౌడ్ తన విధి నిర్వహణను సక్రమంగా చూస్తూ ఉండేవాడని తోటి ప్రయాణికులు చెప్పారు. బాధిత శంకర్ గౌడ్ 80శాతం గాయాలతో వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, నర్సంపేట నుండి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. వైద్య సేవలను అందించడానికి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలను అందిస్తున్నారు. స్థానిక కార్మికులు వెంటనేపరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు.తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన నిరసన ప్రదర్శన ఒక్కసారిగా హింసాత్మకంగా మారింది. అధికారుల మొండి వైఖరిని నిరసిస్తూ డ్రైవర్ అందరూ చూస్తుండగానే ఒంటికి నీ పండించుకోవడంతో శరీరంపై 70 నుండి 80 శాతం వరకు గాయాలయ్యాయి. గత రెండు రోజులుగా సమ్మె కొనసాగుతుండగా శంకర్ గౌడ్ మనస్తాపానికి గురైన తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. క్షణాల్లో మంటలు చెలరేగడంతో తోటి కార్మికులు హతాశులయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పివేసి, బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ఆగ్రహించిన కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి నిరసనకారులను నిలువరిస్తున్నారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసులు మోహరించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డ్రైవర్ పరిస్థితి ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తోంది. అధికారుల వేధింపులు మరియు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ అఘాయిత్యం జరిగిందని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. బాధిత శంకర్ గౌడ్ కు భార్య హైమావతి, ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు. బాధిత కార్మికుడు శంకర్ గౌడ్ ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పరిశీలించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని న్యాయమైన కార్మికుల కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## బెంగాల్, తమిళనాడులో వెల్లువెత్తిన ఓటరుచైతన్యం

ఓటు వేసేందుకు అనుమతించారు.తమిళనాట మొత్తం 234 స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉదయం 7గంటలకే ప్రారంభమైన పోలింగ్ ప్రారంభం కాగా.. ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు**

అంతకుముందు తమిళనాడు అసెంబ్లీ పోలింగ్ గురువారం ఉదయం ప్రారంభం అయ్యింది. ఓటర్లు ఓటేసేందుకు బారులు తీరారు. పలువురు ప్రముఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్‌ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'ఓటు వేయడం అనేది భారత పౌరుల హక్కు. దయచేసి ఆ ఓటుహక్కును వినియోగించుకోండి' అని ఈ సందర్భంగా హీరో ప్రభు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

తమిళనాట పోటెత్తిన ఓటరు

తమిళనాడు ఓటర్లు చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు.. తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఐదు గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియగా.. క్యూలైన్లలో నిల్చున్న వారికి మాత్రమే ఓటు వేయడానికి అనుమతి ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్ర చరిత్రలోనే ఇదే అత్యధిక పోలింగ్ శాతంగా నిలిచింది. తమిళనాడులో మొత్తం 4,71,60,321 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో రాష్ట్ర చరిత్రలో అత్యధిక పోలింగ్ 2011 ఎన్నికల్లో 78 శాతంగా నమోదైంది. 2021 ఎన్నికల్లో 73.63 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. అయితే, ఈసారి ఆ రికార్డులన్నింటినీ అధిగమిస్తూ ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ పోటీ చేస్తున్న కొలత్తూరు నియోజకవర్గంలో 83.58 శాతం పోలింగ్ నమోదైంది. మాజీ సీఎం పళనిస్వామి పోటీ చేస్తున్న ఎడప్పాడి నియోజకవర్గంలో 89.09 శాతం పోలింగ్ నమోదవడం విశేషం.

# ఇంధన భద్రతపై భారత్ దృష్టి

- గ్రీన్ ఉనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్23 (జనంసాక్షి) :** ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైంది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్యయ పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకు దూరంగా పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి. ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారుచేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్ పెరిగేలా మార్కెట్‌ను ఉనికిలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాయి. ర్గి÷నైరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సంస్థల నుండి హామీలకు సబ్సిడీలను ముడిపెడుతూ ప్రైవేటు పెట్టుబడులను భారత్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. భారత్‌లో హైడ్రోజన్‌ను ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఖనిజవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో నేచురల్ గ్యాస్ సరఫరా ఇబ్బందుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగంలోని దిగ్గజాలను లేదా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రాజెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో తన ఆధిపత్యాన్ని పరిరక్షించుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

## తెలంగాణ భవిష్యత్ కేసీఆర్ చేతుల్లోనే..

- మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి



**రాజన్నసిరిసిల్ల, ఏప్రిల్23 (జనంసాక్షి) :** కుట్రలు, కుతంత్రాలతో పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తెలంగాణ భవిష్యత్‌ను కాపాడటమే కేసీఆర్ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన జగిత్యాల సభ తెలంగాణ సమాజానికి దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పోవాలే కేసీఆర్ రావాలేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు యావత్ తెలంగాణ ప్రజలకు జీవధార అని వెల్లడించారు. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంప పెట్టు అని వివరించారు. కేసీఆర్, హరీశ్‌రావు, అధికారులను కేసులో ఇరికించాలని చేసిన కుట్రలు పటాపంచలయ్యాయని అన్నారు. ప్రతి రోజు రేవంత్ రెడ్డికి కలలో కేసీఆర్ కనపడుతున్నాడని తెలిపారు. ఈ సమావేశం లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, మండల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలని చూశారు

- కాళేశ్వరం కమిషన్‌పై హైకోర్టు తీర్పుతో దెబ్బ
- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ వెల్లడి



**నిజామాబాద్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించడం ద్వారా న్యాయం గెలిచిందని మాజీ ఎమ్మెల్యే గణెష్ బిగాల అన్నారు. కమిషన్ విచారణలో ప్రాథమిక నిబంధనలు పాటించలేదని కోర్టు స్పష్టం చేయడం ద్వారా ఆ నివేదికకు చట్టపరమైన ప్రాముఖ్యత లేదని తేలిందన్నారు. ముఖ్యంగా సెక్షన్ 8 కింద సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇవ్వకుండా ఆరోపణలు చేయడం సరికాదని కోర్టు వ్యాఖ్యానించడం అత్యంత కీలకమని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుపై రాజకీయంగా ఒత్తిడి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కమిషన్‌లను అడ్డంపెట్టుకుని వేధింపులకు పాల్పడిందని విమర్శించారు. న్యాయస్థానాలపై నమ్మకంతో పోరాడగా చివరకు నిజం గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ జీవధారగా భావించే కాళేశ్వరం ప్రాజె క్టుపై బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కక్షపూరితంగా వ్యవహరించాయని మండిపడ్డారు. ప్రాజెక్టు మరమ్మతులను సకాలంలో చేపట్టకుండా దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం చేశారని, చివరకు గత్యంతరం లేక ఇప్పుడు పనులు చేపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులను పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనే విశ్వాసానికి ఈ హైకోర్టు తీర్పు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ మేయర్ దండు నీతుకిరణ్ శేఖర్, పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ ఔజఆం చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్, నవీద్ ఇక్బాల్, గాండ్ల లింగం, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెన్షనర్లు, ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ పెన్షనర్ల సమన్వయ కమిటీ (ఎన్సీసీపీఏ) రాష్ట్ర స్థాయి సదస్సు డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తాప్రా గౌరవాధ్యక్షులు ఎంఎన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సు పలు తీర్మానాలను ఆమోదించింది. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ,1972 నుండి సుప్రీంకోర్టు ధర్మాసనం వెలువరించిన అనేక తీర్పులను నిర్వీర్యం చేస్తూ, నష్టదాయకమైన పెన్షన్ ధృవీకరణ అక్ట్ ను రద్దు చేయాలని, 8వ కేంద్ర వేతన సంఘం (సీపీసీ) టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సును సవరించాలనీ, బీఎస్ఎన్ఎల్, బ్యాంక్, కోల్, ఎల్ఐసీ,జీఐసీ పెన్షన్లను నవీకరించాలనీ, కనీస ఈపీఎస్ పెన్షన్ రూ.9000 లకు పెంచాలని డిమాండ్ చేసింది. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పెన్షన్ కమ్యూటేషన్ విలువపై కోత కాలాన్ని 10 సంవత్సరాల 8 నెలలకు తగ్గించాలనీ, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసు చేసిన విధంగా 65,70,75 సంవత్సరాలకు అదనపు పెన్షన్ ను మంజూరు చేయాలని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఎన్.పీ.ఎస్, యూపీఎస్ ను రద్దు చేసి, నిర్వాచిత పెన్షన్ పథకం(ఓపీఎస్)తో పాటు సీనియర్ సిటిజన్ ప్రయాణ రాయితీని పునరుద్దరించాలనీ, పి.ఎఫ్.ఆర్.డీ.ఏ చట్టాన్ని రద్దు చేయాలని, వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని కోరింది. 50 శాతం డీఏ, డీఆర్ ను బేసిక్ పెన్షన్ లో విలీనం చేయాలనీ,18 నెలల పెండింగ్ డీఏ, డీఆర్ లను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. కేంద్రం స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎన్సీసీపీఏ రాష్ట్ర అధ్యక్షులు సగరం శ్రీధర్, ప్రధాన కార్యదర్శి నామాల సోమయ్య, జాతీయ నాయకులు పాలకుర్తి కృష్ణమూర్తి, ఏఐటీయూసీ సంటి బాల్ రాజ్, సీఐటీయూ ప్రసాద్, తాప్రా రాష్ట్ర అధ్యక్షులు పోతుల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు నరహరి, డాక్టర్ లింగా అరుణ, జనార్ధన్ రెడ్డి, వి.కృష్ణ మోహన్, బీఎస్ఎన్ఎల్ నాయకులు రామచంద్రుడు, మహేష్, గోలి రమేష్, కాన్ఫెడరేషన్ నాగేశ్వరరావు, రైల్వే నాయకులు అతర్ సింగ్,రామకృష్ణచార్యులు, ముత్తయ్య, రాఘవ రావు, పోస్టల్ నాయకులు జలాలుద్దీన్, సురేష్ కుమార్, కృష్ణ భగవాన్ వివిధ పెన్షనర్ల నాయకులు రాజశేఖరరెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, జేవీఎస్ఆర్.కృష్ణ, పి శివలింగం,పి ప్రభాకర్ ప్రసంగించారు. వివిధ జిల్లాల నుండి కమల కుమారి, సుదర్శన్ రెడ్డి, బి.రామారావు, బ్రహ్మ చారి,టీ.నిరంజన్, యం.అర్జున్, బీ.నరహరి, బాల గంగాధర రావుల నాయకత్వంలో 500 మంది హాజరయ్యారు. ఎన్సీసీపీఏ రాష్ట్ర సదస్సులో డాక్టర్ల పర్యవేక్షణలో నిర్వహించిన వైద్య శిబిరంలో పరీక్షలు, కన్సల్టేషన్లు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

## పోలింగ్ కేంద్రం వద్ద నాటు బాంబుతో దాడి




**కోల్‌కతా, ఏప్రిల్23 (జనంసాక్షి) :** తొలిదశ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో పోలింగ్ వేళ తాజాగా నాటు బాంబుతో దాడి జరగడం కలకలానికి దారి తీసింది. జిల్లాలోని నవోదా ప్రాంతంలోని ఒక పోలింగ్ బూత్ సమీపంలో ఈ ఘటన జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఒకరు పోలింగ్ బూత్ సమీపంలో బాంబు విసరడంతో పలువురు గాయాలపాలయ్యారు. దీంతో, తీవ్ర భయాందోళనలకు లోనైన ఇతర ఓటర్లు పరుగులు తీశారు. ఈ ఘటనలో గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రులకు తరలించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఘటన సమాచారం అందగానే ఆ ప్రాంతానికి చేరుకున్న భద్రతా దళాలు తనిఖీలు చేపట్టాయి. బాంబు విసిరినది ఎవరో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పోలింగ్‌కు అడ్డంకి సృష్టించేందుకు ఈ దాడి జరిగిందా? అనే కోణంలో విచారణ చేస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతం తొలి దశలో భాగంగా 152 స్థానాల్లో పోలింగ్ జరుగుతోంది. 16 జిల్లాలోని స్థానాలకు జరుగుతున్న అసెంబ్లీ ఈ ఎన్నికల్లో మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వచ్చే వారం మిగిలిన 142 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్ అధికార పార్టీ తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడుతున్న విషయం తెలిసిందే.

## కార్మికుల సమ్మెలో టీఆర్పీ నాయకుల అరెస్ట్

**అక్రమ అరెస్టులు కొనసాగిస్తే ప్రజలతో పెద్దఎత్తున ఉద్యమిస్తాం : టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా**



**కరీంనగర్ (జనంసాక్షి) :** ఆర్టీసీ కార్మికులు వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ పార్టీ నాయకులతో కలిసి సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలందిస్తూ, ప్రభుత్వ అధికారులను సమయానికి విధులకు చేరవేస్తూ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వాలు నిర్వహించే సభలు సమావేశాలు విజయవంతం కావాలన్న ఆర్టీసీ కార్మికులే ప్రజలను తరలించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ వైఖరిని ఎండగట్టి నూతన ప్రభుత్వం ఏర్పడడానికి కీలక పాత్ర ఆర్టీసీ కార్మికులదని అన్నారు. అనుభవం లేని ముఖ్యమంత్రిని ప్రజలు ఎన్నుకున్నందున కార్మికులు సమ్మె బాట పట్టగా అనుభవం లేని డ్రైవర్లను పెట్టి ప్రభుత్వం బస్సులు నడిపించడం దుర్మార్గమని అన్నారు. సమ్మెల బాట పట్టిన తెలంగాణ రాష్టంలో ప్రజాపాలన కొనసాగుతుందని సభలలో సీఎం చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రభుత్వం నిజమైన ప్రజాపాలన కొనసాగిస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కొంత మంది ఆర్టీసీ సంఘాల అనుబంధ సంఘాల వారు ఆర్టీసీ సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి ప్రభుత్వాన్ని నడిపించే ఈ నాయకత్వానికి జేజేలు కొట్టడం, జిందాబాద్ లు పలకడం మురకత్వాని అలాంటి వారితో కార్మికులకు నష్టం కలుగుతోందని, వారు సమ్మెకు దూరంగా ఉంటే మంచిదని చెప్పుకొచ్చారు. ఆపదలో ఉన్న ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపితే అక్రమంగా టీఆర్పీ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం ఎంతవరకు సరైనది పోలీసులను ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఈ అక్రమ అరెస్టులను ఆపివేసి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అరెస్టులు కొనసాగితే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని, పోలీసులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, మైనార్టీ ప్రెసిడెంట్ వాజిద్, ప్రధాన కార్యదర్శి అంకుష్, టౌన్ ప్రధాన కార్యదర్శి రమేష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మహబూబ్ అలీ, టౌన్ మహిళా అధ్యక్షురాలు జింక లావణ్య, కొత్తపల్లి మండల మహిళా అధ్యక్షురాలు ఓర్సు విమల, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు శివరాత్రి మోహన్, ప్రధాన కార్యదర్శి దురుశెట్టి చందు తదితరులు పాల్గొన్నారు.



## గంగపుత్ర, బెస్త కులాలకు న్యాయం చేస్తాం

- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న గంగపుత్ర , బెస్త, గూండ్ల కులస్తులకు బిసి స్థితిగతుల అధ్యయనం కోసం జరిగే జన గణలో వారికి తగిన న్యాయం చేస్తుందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల చైర్మన్ జి.నిరంజన్ హామీ ఇచ్చారు. తమ దృష్టికి తెచ్చిన న్యాయమైన మీసమస్యలను కమిషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ముషీరాబాద్ శాసనసభ్యులు ముఠాగోపాల్ నాయకత్వంలో పలు బెస్త, గంగపుత్ర, గూండ్ల సంఘాల ప్రతినిధులు ఖైరతాబాద్ లోని బీసీ కమిషన్ కార్యాలయంలో గురువారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మూఠ గోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న గంగపుత్రులు, బెస్తల, గూండ్ల జనాభా సంఖ్య అతి తక్కువ సంఖ్య చూపించడం శోచనీయమన్నారు. ఈకార్యక్రమంలో బీసీ కమిషనర్లు రాపోలు జయప్రకాష్, ఆర్.బాల లక్ష్మి, రాష్ట్ర గంగపుత్ర సంఘాల ప్రతినిధులు ఆర్.కె.ప్రసాద్, ప్రొఫెసర్ సుదర్శన్, దీటి రామచందర్, అడ్వకేట్ మల్లేశం, చర్కసత్యనారాయణ, కాయ హనుమంతు, బి. లక్ష్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**గజ్వేల్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ – సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్'...ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్/ ఎక్విప్ మెంట్(వోఎఫ్ సీఈ), ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ(ఐఈటీ), టెక్నాలజీ / డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది.

## యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు**

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రేవంత్ సర్కార్ అమల్లోకి తెచ్చిన యూరియా యాప్ ను రైతు ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రైతు బంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినట్లు తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో నలుగురు రైతులు దాఖలు చేసిన పిల్ పై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారం చేపట్టింది. ఈ మేరకు 2 వారాల్లో సమగ్ర కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీజే తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టులో పిటిషనర్స్ తరపున పాశం రవీందర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు యూరియా యాప్ ద్వారా రైతులు యూరియా సప్లయి చేయడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది రైతులు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.రైతుల్లో అధిక శాతం మంది నిరక్షరాస్యులు. వీరిలో చాలా మంది దగ్గర స్మార్ట్ ఫోన్స్ లేవు. కొద్ది మంది వద్ద స్మార్ట్ ఫోన్ ఉన్నా యూరియా యాప్ డౌన్ లోడ్ చేసుకొని ఫోన్లో యాప్ ద్వారా బుక్ చేసుకొనే పరిజ్ఞానం లేదు. దీనివల్ల రైతులంతా వ్యవసాయ అధికారులపై, ప్రయివేట్ నెట్ సెంటర్లపై ఆధారపడాల్సిన దుస్థితి ఉన్నది.యూరియా యాప్ ద్వారా యూరియా బస్తాలు బుక్ చేయించుకోవాలంటే ఇతర సంస్థలపై రైతులు ఆధారపడి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. అంతేగాకుండా రైతులంతా వారి వ్యవసాయ పనులను వదిలిపెట్టి యూరియా బస్తాల కోసం క్యూ లైన్లలో నిలుచోవాల్సిన దుస్థితి నెలకొంది. యూరియా కోసం రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.ఎకరానికి కనీసం ఒక బస్తా ఒకేసారి వేయాల్సిన అవసరముంది. 10 ఎకరాలు ఉన్న రైతుకు యాప్ ద్వారా బుక్ అయినట్లయితే 7 బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. దీనివల్ల మిగతా 3 ఎకరాలకు బస్తాలు దొరకడం లేదు. 15 రోజుల తరువాత మిగతా బస్తాల కోసం యూరియా యాప్ ద్వారా బస్తాల కోసం బుక్ చేసుకున్నా ఒక బస్తా కూడా ఇవ్వడం లేదు. రెండో విడతగా కూడా యూరియా వేయాల్సిన అవసరం ఉన్నది. 15 రోజుల కాలవ్యవధి తర్వాత కూడా 5 –6 బస్తాలు కూడా దొరకని దుస్థితి ఉన్నది. ఈ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవడానికి కౌలు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సెకన్లలో స్టాక్ మాయమవుతున్నది. అంతేగాకుండా కౌలు రైతులకు ఓటీపి చేప్పే లోపే స్టాక్ యమవుతున్నది. రైతులు యూరియాను సక్రమంగా వేయకపోయినట్టయితే పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది.రైతులు తీవ్రం గా నష్ట పోవాల్సి వస్తుందని చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వెంట అంగోతు హాతీరాం నాయక్, మట్టపల్లి సైదులు, వేణుగోపాల్ రావు, పులి జగదీష్, హమీద్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులపై కక్షసాధింపు ధోరణి

- తాండూరులో టెంట్ సామాను ఇవ్వకుండా పోలీసుల ఒత్తిడి
- రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ తలసాని



**హైదరాబాద్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** ఆర్టీసీ సంస్థను ప్రైవేట్ పరం చేసే దిశగా కుట్రలు చేస్తున్నదని మాజీమంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆ ఫైల్‌ను గవర్నర్ దగ్గరకు పంపించామని, తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామాన్లు ఇవ్వరాదని వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో టెంట్ హౌస్ నిర్వాహకులను పోలీసులు నోటీసులు ఇవ్వడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఎన్డీయే కూటమి నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే తెలంగాణలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అంటూ ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మేధా పర్వతం లాంటి కేసీఆర్‌పై ఉమ్మేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకుల పైనే పడిందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు , నిధులు, నియామకాల ట్యాగ్ లైన్ తో తెలంగాణ ఉద్యమాన్ని నడిపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌అని పేర్కొన్నారు. వచ్చిన తెలంగాణలో రైతులు సంతోషంగా ఉండాలని ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బ్యారేజ్ మేడిగడ్డ . కాళేశ్వరం అంటే 100 కంపోనెట్లని, అందులో మేడిగడ్డ బ్యారేజ్ ఒకటని అన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి లక్ష కోట్ల అవినీతి అంటూ తమ పై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 ఏప్రిల్ 2026

గత సంచిక తరువాయి


# తెలంగాణ అస్తిత్వం - కర్తవ్యాలు

క్రీస్తు పూర్వం 1000 నుండి తెలంగాణలో బృహత్ శిలాయుగ సంస్కృతి వర్ధిల్లింది. ముడుమల్ వంటి ప్రాంతాల్లోని నిలువురాళ్లు మన పూర్వీకుల ఖగోళ శాస్త్ర పరిజ్ఞానానికి సాక్ష్యాలు. ఇవి సమాధుల గుర్తులు మాత్రమే కాదు, నక్షత్రాల గమనాన్ని బట్టి పంటలు పండించే విజ్ఞానం తెలంగాణ మట్టిలో వేల ఏళ్ల క్రితమే ఉందనేది మన అస్తిత్వానికి గర్వకారణం. ఈ రాళ్లను పరిశీలిస్తే నాటి ప్రజలకు కాలం పట్ల ఉన్న అవగాహన తెలుస్తుంది. ఇది మన గడ్డపై వికసించిన స్వదేశీ విజ్ఞానం. మన చరిత్రలో సైన్స్ అండ్ టెక్నాలజీ వేల ఏళ్ల క్రితమే ఉందనే వాస్తవాన్ని మనం ప్రపంచానికి చాటాలి. ప్రాచీన తెలంగాణ శాస్త్రవేత్తల వారసత్వాన్ని మనం గౌరవించాలి. ఇది కేవలం గతం కాదు, మన మేధో సంపత్తికి నిదర్శనం.

రాజవంశాల పరాక్రమం - శాతవాహనుల నుండి నిజాంల వరకు: తెలంగాణ గడ్డ అనేక సామ్రాజ్యాలకు నెలవు. కోటిలింగాల రాజధానిగా పాలించిన శాతవాహనులు దక్షిణ దేశానికే దిక్సూచిగా నిలిచారు. ఆ తర్వాత చాళుక్యులు, పరాక్రమవంతులైన కాకతీయులు శిల్ప కళా సంపదతో తెలంగాణను సుసంపన్నం చేశారు. కుతుబ్ షాహీలు మతసామరస్యానికి పునాది వేయగా, నిజాం రాజుల కాలంలో తెలంగాణ ఆధునిక పరిపాలన, రైల్వేలు మరియు పరిశ్రమల దిశగా అడుగులు వేసింది. ఈ రాజవంశాల పాలన తెలంగాణ అస్తిత్వానికి రాజకీయ మరియు ఆర్థిక పరిపుష్టిని ఇచ్చింది. ప్రతి కాలంలోనూ ఇక్కడి పాలకులు ప్రజా శ్రేయస్సు కోసమే కృషి చేశారు. ఈ రాజకీయ వారసత్వం మనకు అపారమైన అనుభవాన్ని ఇచ్చింది. మన రాజుల వైభవం మన అస్తిత్వ గర్వం.

సాహితీ వైభవం - గాథా సప్తశతి నుండి బసవ పురాణం వరకు : సాహిత్య రంగంలో తెలంగాణ అగ్రగామి. శాతవాహన చక్రవర్తి హాలుడు 'గాథా సప్తశతి'తో ప్రాకృత సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేయగా, గుణాఢ్యుడు 'బృహత్కథ'తో కథా సాహిత్యానికి మూలపురుషుడయ్యారు. దేశీ కవితా పితామహుడు పాల్కురికి సోమన 'బసవ పురాణం' ద్వారా సామాన్యుల భాషలో విప్లవాత్మక సాహిత్యాన్ని సృష్టించారు. మన సాహిత్యం కేవలం పురాణాలకే పరిమితం కాలేదు, అది సమాజంలోని వైరుధ్యాలను, మానవీయ విలువలను ప్రతిబింబించింది. ఈ సాహితీ వారసత్వమే మన భాషా అస్తిత్వానికి వెన్నెముకగా నిలిచింది. మన జాన్ పదాలు, మన మాండలికం, మన పదజాలం మన సాహిత్యానికే వన్నె తెచ్చాయి. ప్రాచీన కవుల స్ఫూర్తితో ఆధునిక సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలి.

మేధో సంపత్తి - మల్లికార్జున సూరి వ్యాఖ్యానాలుతెలంగాణ గొప్ప మేధావులకు పుట్టినిల్లు. మల్లికార్జున సూరి వంటి పండితులు కాళిదాసు కృతులకు సంక్లిష్టమైన వ్యాఖ్యానాలు అందించి, భారతదేశ మేధో ప్రపంచంలో తెలంగాణ ముద్రను వేశారు. సంస్కృత సాహితంలోని మెళకువలను విడమరిచి చెప్పడంలో ఆయన చూపిన ప్రతిభ అద్భుతం. ఇది మన నేల యొక్క విజ్ఞాన తృష్ణకు నిదర్శనం. అక్షరం ద్వారా అధికారాన్ని ప్రశ్నించడం మరియు జ్ఞానానికి పంచడం తెలంగాణ సంప్రదాయం. వేల ఏళ్లుగా ఇక్కడి కవులు తమ రచనల ద్వారా సమాజానికి దిశానిర్దేశం చేశారు. ఈ మేధో వారసత్వాన్ని మనం గర్వంగా స్మరించుకోవాలి. మన అస్తిత్వంలో జ్ఞానం ఒక ప్రధాన భాగం. తెలివైన వారు పాలితులై ఉండటం కాకుండా, పాలకులుగా ఎదగాలి. అందెశ్రీ, గోరటి వెంకన్న, జయరాజు, సి నారాయణ రెడ్డి , సుద్దాల అశోక్ తేజ, చంద్రబోసు, మిట్ట పెల్లి సురేందర్, డాక్టర్ మల్రయ్యా, బి ఎస్ రాములు, కాలువ మల్లయ్య, అంపశయ్య నవీన్, సురవరం ప్రతాపరెడ్డి, అల్లం రాజయ్య, వానమామలై



వరదాచార్యులు, యం ఎస్ ఆచార్య, దాశరథి సోదరులు , పి యశోదారెడ్డి, ముదిగంటి సుజాతా రెడ్డి, మాదిరెడ్డి సులోచన, పోల్కంపల్లి శాంతాదేవి, పిలోక్వేర్, పి టి రెడ్డి , కొండపల్లి శేషగిరిరావు, ఏలె లక్ష్మణ్, బి ఎన్ శాస్త్రి, ఠాకూర్ రాజారాణ సింగ్, కెవి నరేందర్, పెద్దింటి అశోక్ కుమార్, బోయ జంగయ్య, జూపాక సుభద్ర, సంగిశెట్టి శ్రీనివాస్ , స్కైబాబాబా, నందిని సిధారెడ్డి, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, వేముల ఎల్లయ్య, గూడ అంజయ్య, జి వై గిరి, జ్వలిత, జాజుల గౌరి, జూలూరి గౌరీశంకర్, వంటి సాహితీ వేత్తలు కళాకారులు తెలంగాణ నేల గర్వించదగినా వారసత్వం.

- బౌద్ధ, జైన, శైవ మతాల సంగమం: తెలంగాణ గడ్డ ఆధ్యాత్మిక చైతన్యానికి నిలయం. ఇక్కడ బౌద్ధం, జైనం, శైవం మరియు వీరశైవం ఆయాకాలాలలో వర్ధిల్లాయి. నాగార్జున కొండ బౌద్ధ క్షేత్రాల నుండి కొలనుపాక జైన కేంద్రాల వరకు ఈ నేల ప్రపంచానికి అహింసను పంచి ఇచ్చింది. ముఖ్యంగా బహుజనుల మతమైన శైవం, సామాజిక సమానత్వం కోసం పోరాడాయి. మతాల మధ్య వైరుధ్యం లేకుండా ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని పాటించే స్వేచ్ఛ ఇక్కడ ఉండేది. ఈ ఆధ్యాత్మిక వైవిధ్యమే మన అస్తిత్వంలోని సహనాన్ని సూచిస్తుంది. తెలంగాణ ఎప్పుడూ మత మౌఢ్యానికి తావు ఇవ్వలేదు, అది ఎల్లప్పుడూ మానవ ధర్మాన్నే గౌరవించింది. ఈ సామరస్యమే మన బలం. సర్వమత సమానత్వమే మన రాజ్యాంగ లక్ష్యం కూడా.

**వీరోచిత పోరాటాలు - సమ్మక్క - సారలమ్మ స్ఫూర్తి:**

అన్యాయంపై తిరగబడే గుణం తెలంగాణ మట్టిలోనే ఉంది. పాలకుల ఆధిపత్యంపై గిరిజన తల్లులు సమ్మక్క-సారలమ్మ సాగించిన వీరోచిత పోరాటం ప్రపంచానికే స్ఫూర్తిదాయకం. వారు కేవలం దేవతలు మాత్రమే కాదు, అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన ధీర వనితలు. వారి త్యాగం తెలంగాణ ఆత్మగౌరవ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచింది. నేటికీ కోట్లాది మంది ప్రజలు మేడారం జాతరకు తరలిరావడం ఆ తల్లుల పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనం. తెలంగాణ అంటేనే పోరాటాల నేల. దౌర్జన్యాన్ని ఎదురించడం మన రక్తంలోనే ఉంది. ఈ పోరాట స్ఫూర్తి మన అస్తిత్వానికి గొప్ప రక్షణ. ఈ వీరోచిత చరిత్రను నూతన తరానికి అందించి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి. రాంజీ గోండ్, కొమురం భీమ మన అడవితల్లి బిడ్డల ఆత్మ గౌరవానికి, అస్తిత్వానికి కొండగుర్తులు.

.అస్తిత్వానికి అసలైన ఆయుధం ఆధునిక విద్యా విప్లవం: వెనుకబడిన వర్గాల అస్తిత్వం నిలబడాలంటే విద్య మాత్రమే ఏకైక మార్గం. ఇప్పటివరకు విద్య కేవలం అక్షరజ్ఞానానికి మాత్రమే పరిమితమైంది. కానీ నేడు మనకు కావలసింది 'విద్యా విప్లవం'. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడగలిగే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించడమే మన తక్షణ కర్తవ్యం. విద్య ద్వారానే సామాజిక అసమానతలను రూపుమాపవచ్చు. జ్ఞానం ఉన్నచోట ఆత్మగౌరవం ఉంటుంది. అందుకే మన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం అస్తిత్వ ఉద్యమాల్లో ప్రధాన భాగం కావాలి. విద్యావంతుడైన వ్యక్తి మాత్రమే తన హక్కుల కోసం పోరాడగలడు. అస్తిత్వ పోరాటానికి అక్షరమే బలమైన ఆయుధం. విద్యా వికాసమే బహుజన విముక్తికి మొదటి మెట్టు.

**తొలితరం చైతన్యం - కేజీ టు పీజీ లక్ష్యం:**

ముఖ్యంగా 'తొలితరం' విద్యార్థులను గుర్తించి, వారికి పదహారేళ్ళపాటు కేజీ టు పీజీ ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించాలి. ఆర్టికల్ 21ఎ మరియు ఆర్టికల్ 46 మనకు కల్పించిన విద్యా హక్కులను ఆచరణలోకి తెచ్చినప్పుడే, బహుజన బిడ్డలు శాస్త్రవేత్తలుగా ఎదిగి తమ అస్తిత్వాన్ని చాటుకుంటారు. పేదరికం విద్యా వికాసానికి అడ్డంకి కాకూడదు. ప్రభుత్వం బాధ్యతగా ప్రతి బిడ్డకూ ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలి. అప్పుడే మన వర్గాల నుండి నూతన మేధావులు పుట్టుకొస్తారు. సామాజిక మార్పుకు విద్యా విప్లవమే పునాది. ప్రతి ఇంటా ఒక విద్యావంతుడు ఉన్నప్పుడే ఆ వర్గం అస్తిత్వం సుస్థిరమవుతుంది. ఇది మన రాష్ట్ర పునర్నిర్మాణంలో అత్యంత కీలకమైన అంశ

జీవన ప్రమాణాలు - సంస్కృతి వికాసానికి పునాది: జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే సంస్కృతి వికాసం చెందుతుంది. ఆహారం, నివాసం మెరుగుపడినప్పుడు మాత్రమే మనిషి మేధస్సు వికసిస్తుంది. కేవలం పాత సంస్కృతి మాత్రమే గొప్పది అనుకుంటే సమాజం వెనుకబడిన జీవితంలోనే ఉండిపోతుంది. సంస్కృతి అంటే నిరంతరం ప్రవహించే నదిలాంటిది, అది కాలంతో పాటు మారుతూ ఆధునికతను సంతరించుకోవాలి. పాత మూఢనమ్మకాలను వదిలి, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకోవాలి. ఆర్థిక స్థిరత్వం లభించినప్పుడు మాత్రమే కళలు మరియు నైపుణ్యాలు వికసిస్తాయి. అభివృద్ధి చెందినప్పుడే మన అస్తిత్వానికి ప్రపంచ గుర్తింపు లభిస్తుంది. సంస్కృతి పరిరక్షణ అంటే పాత కాలంలోకి వెళ్లడం కాదు, ఆధునికతతో మన మూలాలను కలపడం.

**ఆర్థిక స్వావలంబన - ఉద్యోగ, ఉపాధి అవకాశాలు:**

ఆర్థిక శక్తి లేని అస్తిత్వం ఎక్కువ కాలం నిలబడలేదు. సంప్రదాయ వృత్తులకే పరిమితం కాకుండా, ఐటీ మరియు పారిశ్రామిక రంగాల్లో వాటా పొందాలి. ఆర్టికల్ 16(4) ప్రకారం లభించే రిజర్వేషన్లను వినియోగించుకుని తమ భాగస్వామ్యాన్ని కోరడం అస్తిత్వ ఉద్యమాల్లో భాగం కావాలి. ఉద్యోగాలు చేసే స్థాయి నుండి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి బహుజన వర్గాలు ఎదగాలి. ఆర్థిక స్వావలంబన కలిగినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తాయి. సంపద సృష్టిలో మన వాటాను మనం సాధించుకోవాలి. ఆర్థిక స్థిరత్వమే మన ఆత్మగౌరవానికి అసలైన రక్షణ కవచం. మన సంపద మన వికాసానికి పునాది కావాలి. పారిశ్రామికవేత్తలుగా ఎదిగినప్పుడే మనం మన వర్గాలకు ఉపాధి కల్పించగలం.

**వెనుకబడిన ప్రాంతాల వికాసం - ప్రాంతీయ అస్తిత్వం:**

అభివృద్ధి కేవలం హైదరాబాద్ వంటి నగరాలకే పరిమితం కాకూడదు. వెనుకబడిన ప్రాంతాల ప్రజల భాష మరియు భౌగోళిక అస్తిత్వాన్ని గుర్తించాలి. ఆయా ప్రాంతాల్లోని వనరులు అక్కడి ప్రజల వికాసానికే ఉపయోగపడాలి. ప్రాంతీయ అసమానతలు తొలగినప్పుడే ఆ ప్రాంత అస్తిత్వానికి మరియు ప్రజల ఆత్మగౌరవానికి రక్షణ లభిస్తుంది. వికేంద్రీకరణ ద్వారానే సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుంది. వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించడం ద్వారా అక్కడి యువతకు ఉపాధి కల్పించాలి. ప్రాంతీయ అస్తిత్వం నిలబడినప్పుడే రాష్ట్ర అస్తిత్వం బలోపేతమవుతుంది. ప్రతి జిల్లా తనదైన ప్రత్యేకతతో అభివృద్ధి చెందాలి. ఇది సామాజిక న్యాయంలో ఒక ప్రధాన భాగం.

**సమగ్ర వికాసం - అందరి వాటా:**


నిజమైన అస్తిత్వవాదం 'సమగ్ర వికాసం' కోరుకుంటుంది. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి కూడా అందాలి. దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలు పారిశ్రామికవేత్తలుగా మారడమే అసలైన ఇన్ క్లూజివ్ గ్రోత్. ఆర్థిక వనరులు అందరికీ సమానంగా పంపిణీ అయినప్పుడే అస్తిత్వ పోరాటాలు సఫలమవుతాయి. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఇదే సమగ్ర వికాసాన్ని నిర్దేశిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. అందరి సంక్షేమమే అస్తిత్వ ఉద్యమాల అంతిమ లక్ష్యం కావాలి. సమిష్టి కృషితోనే సమసమాజం సాధ్యం. అభివృద్ధి అంటే కేవలం జీడీపీ పెరగడం కాదు, ప్రజలందరి కొనుగోలు శక్తి మరియు జీవన ప్రమాణాలు పెరగడం.

రాజ్యాంగబద్ధమైన హక్కులు - రిజర్వేషన్ల అమలు : భారత రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులే మన అస్తిత్వానికి శ్రీరామరక్ష. ఆర్టికల్ 14 నుండి 16 వరకు ఉన్న అధికరణలు మనకు సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని హామీ ఇచ్చాయి. రిజర్వేషన్లు అనేవి కేవలం కొన్ని ఉద్యోగాల కోసం మాత్రమే కాదు, అవి చారిత్రక అన్యాయాలను సరిచేసే ఆయుధాలు. విద్య మరియు రాజకీయాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడటం మన బాధ్యత. రాజ్యాంగం కల్పించిన ఈ రక్షణ కవచం ఉన్నంత వరకు మన అస్తిత్వానికి భయం లేదు. ఈ హక్కుల గురించి ప్రజల్లో చైతన్యం నింపాలి. చట్టబద్ధమైన పోరాటం ద్వారానే మన వాటాను సాధించుకోగలం. రాజ్యాంగమే మన అస్తిత్వ వేదం మరియు మన అభివృద్ధికి రాచ బాట.

తెలంగాణ అస్తిత్వం కోట్ల మంది ఆకాంక్షల ప్రతిరూపం. దశాబ్దాల వివక్షను ఎదుర్కొని, స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మనం ఇప్పుడు పునర్నిర్మాణంలో మన బాధ్యతను గుర్తించాలి. తెలంగాణ మట్టి వాసనను, ఇక్కడి శ్రమ జీవుల సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడమే దీని ప్రాథమిక లక్ష్యం. అస్తిత్వ స్పృహ కలిగిన మేధావులు ఒకే వేదికపైకి వచ్చి సమాజానికి దిశానిర్దేశం చేయాలి. మన ప్రత్యేకతను చాటుకుంటూనే, అందరినీ కలుపుకుని పోయే విశాల దృక్పథం ఉండాలి. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా నిరంతరం పని చేయాలి.

**మన ఎరుక మన చైతన్యం:**

తెలంగాణలోని, ప్రతి వెనుకబడిన బిడ్డకూ నాణ్యమైన విద్య, అందేలా చూడటం వేదిక మొదటి కర్తవ్యం. సామాజిక అసమానతలపై నిరంతరం చైతన్యం నింపాలి. కులవృత్తుల ఆధునీకరణకు కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరవేస్తూ, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి. పాత సంస్కృతిలోని మూఢత్వాన్ని వదిలి, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకునేలా ప్రజలను ప్రోత్సహించాలి. సమాజంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ, ఎప్పటికప్పుడు సరికొత్త ప్రణాళికలతో ప్రజల ముందుకు వెళ్లాలి. బహుజన ఐక్యత మరియు వికాసమే ఊపిరి కావాలి. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలి.ఆర్థిక భరోసా - పారిశ్రామికవేత్తలుగా బహుజనులుబహుజన వర్గాలు ఉత్పత్తిదారులుగా మారి, గ్లోబల్ మార్కెట్లో తమ ఉత్పత్తులకు గుర్తింపు తేవాలి.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

తరువాయి మరో సంచికలో




## దేవుళ్ళు!

మన జీవితాల్లో నిత్యం
వెలుగులునింపేవాళ్ళు
ఆరోగ్యం సౌభాగ్యం
తెచ్చేవాళ్ళు దేవుళ్ళు!

టీకాలు కనిపెట్టి
అంటువ్యాధుల నుండి
లోకాలు కాపాడిన వాడు
మనకు దేవుడంటాను!

భౌతిక శాస్త్రంలో
సాపేక్ష సిద్ధాంతం!
'ఐన్ స్టీన్' ఒక విప్లవం!
ఆయనకదా దేవుడు!

విద్యుత్ బల్బ్ కనుగొని
ప్రపంచానికి వెలుగిచ్చిన
థామస్ అల్వా ఎడిసన్
కదా మనకు దేవుడు!

మోటార్లు జనరేటర్లు
తెచ్చిన మైఖేల్ పారడే
ఆధునిక సాంకేతికతలో
ఎంత గొప్ప దేవుడు!

పరిణామసిద్ధాంతంతో
జీవపరిణామాన్నిచెప్పిన
చార్లెస్ డార్విన్ మనకు
నిత్య స్మరణీయ దైవం!

గెలీలియోలూయిపాశ్చర్
మార్కొని.. ఇంకాఎందరో
మానవసమాజానికి
మేలుచేసినదేవుళ్ళు!

సినిమా, రేడియో,టి వి
రైలు,విమానం,ర్యాకెట్
ఐటి,డ్రోన్,ఏఐటెక్నాలజీ
తెచ్చినవాళ్లంతాదేవుళ్లే!

ఇందుగలరందులేరను
సందేహము వలదు
వీళ్లు సర్వోపగతులు
ప్రపంచానికే దేవుళ్ళు!

వీళ్ళను మరువకండి!
సైన్స్ పాఠాల్లోఉన్నారా?
మేలుచేసినవాళ్ళను
మననిత్యంపఠించాలి !

వీళ్లంతా మానవాళికి
ప్రాతః స్మరణీయులు!
ఓ దేవుళ్ళారా!ఇవే
మీకు నాఅభివందనాలు!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ఆధ్యాత్మికత దాటి ఆర్థిక కేంద్రాలుగా దేవాలయాలు

గత సంచిక తరువాయి

మారుమూల మహిళ అధికారానికి రాలేదనే భావన ఉన్న మధ్యయుగ భారతదేశంలో, రుద్రమాదేవి రాజ్యాన్ని దశాబ్దాల పాటు సమర్థంగా పాలించింది. బయట శత్రువులను ఎదుర్కొంది, లోపల పాలనను సుస్థిరం చేసింది.

మాత్రమే కాదు - అది ఆ కాలపు సమాజం మహిళ లను ఏ స్థాయిలో అంగీకరించగలిగిందో చెప్పే సాక్ష్యం. పరిపాలనలో, ఆర్థిక వ్యవహారాల్లో, దేవాల య నిర్వహణలో, భూదానాల్లో మహిళల పాత్ర ఉందని అనేక శాసనాలు ధృవీకరిస్తున్నాయి. ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల ప్రమేయం ఉన్నప్పుడు కుటుంబం మొత్తం బలపడుతుందని, అది సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని నేటి ఆర్థిక పరిశోధ నలు నిరూపిస్తున్నాయి. కాకతీయుల కాలంలో ఈ నిజం అనుభవపూర్వకంగా అమలైంది. మహిళా సాధికారత అనే భావన నేటి చర్చలో మొదలైనది కాదు - అది కాకతీయుల కాలంలో ఆచరణలో ఉంది. ఈ చరిత్రను మనం గుర్తు తెచ్చుకోవడం కేవలం గర్వానికి కాదు, నేటి మహిళా సాధికారత లక్ష్యాలకు చారిత్రక ప్రేరణ అందించడానికి.

కాకతీయుల దేవాలయాలను కేవలం మత కేంద్రాలుగా చూస్తే సగం సత్యం మాత్రమే అర్థమవుతుంది. రామప్ప దేవాలయం, వేయిస్తంభాల గుడి వంటి నిర్మాణాలు శిల్పకళా సౌందర్యానికి మాత్రమే కాదు, సమాజ ఆర్థిక జీవితానికి కేంద్రాలుగా పనిచేశాయి. దేవాలయాలకు విస్తారమైన భూసంపద ఉండేది. ఆ భూముల ద్వారా వచ్చే ఆదాయం పూజారులకు, కళాకారులకు, శిల్పులకు, సంగీతకారులకు జీవనాధారం అయింది.

దేవాలయాల చుట్టూ ఏర్పడిన మార్కెట్లు వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి జరిగే సంతలుగా పరిణమించాయి. వివిధ ప్రాంతాల నుండి వ్యాపారులు, రైతులు, శిల్పులు ఈ మార్కెట్లలో పాల్గొనేవారు. ఇది కేవలం వస్తువుల మార్పిడి మాత్రమే కాదు, సమాచారం, సంస్కృతి, ఆలోచనల మార్పిడి కూడా. ఒక అర్థంలో, కాకతీయుల దేవాలయాలు నేటి వ్యాపార, సాంస్కృతిక, విద్యా కేంద్రాల పాత్రను ఒకే చోట నిర్వహించాయి.

నాట్యకళ, సంగీతం, శిల్పకళ, కవిత్వం - ఇవన్నీ దేవాలయాల ఆశ్రయంలో అభివృద్ధి చెందాయి. ఈ కళారూపాలు కేవలం సాంస్కృతిక సంపద మాత్రమే కాదు, ఆర్థిక కార్యకలాపాలు కూడా. కళాకారులకు జీవికను అందించడం, యాత్రికులను ఆకర్షించడం, స్థానిక ఆర్థిక వ్యవస్థను చురుకుగా ఉంచడం - ఇవన్నీ దేవాలయ కేంద్రీకృత సంస్కృతి ద్వారా సాధించబడ్డాయి.



**వాణిజ్యం - రాజ్య సరిహద్దులు దాటిన ఆర్థిక సంబంధాలు**

కాకతీయుల కాలంలో వాణిజ్యం రెండు స్థాయిలలో జరిగింది - అంతర్గత మరియు విదేశీ. అంతర్గత వాణిజ్యంలో గ్రామాలు, పట్టణాలు, నగరాల మధ్య వస్తువుల రవాణా జరిగేది. నేయకులు తయారు చేసిన వస్త్రాలు, కమ్మర్లు తయారు చేసిన పనిముట్లు, కుండల తయారీదారుల ఉత్పత్తులు - ఇవన్నీ మార్కెట్లలో అమ్ముడై ఆర్థిక చలనాన్ని పెంచాయి. వృత్తిజీవులకు వారి శ్రమకు తగిన ప్రతిఫలం లభించేది.

విదేశీ వాణిజ్యంలో మోటుపల్లి నౌకాశ్రయం కీలక పాత్ర పోషించింది. అరేబియా, పర్షియా, ఆగ్నేయాసియా ప్రాంతాలతో సముద్ర మార్గంలో వ్యాపారం సాగింది. ఈ వ్యాపారం ద్వారా విదేశీ మారకద్రవ్యం రాజ్యంలోకి ప్రవహించింది. గణపతిదేవుడు మోటుపల్లి శాసనం ద్వారా విదేశీ వ్యాపారులకు పూచీకత్తు ఇవ్వడం - వారి ఆస్తిని, వ్యాపారాన్ని రక్షించడమనే హామీ ఇవ్వడం - ఒక అత్యంత ముందుచూపు కలిగిన విధాన నిర్ణయం. ఇది ఆధునిక విదేశీ పెట్టుబడి ప్రోత్సాహక విధానాలకు పూర్వరూపంగా చెప్పవచ్చు. వ్యాపారం కేవలం ఆర్థిక లాభాలను మాత్రమే తీసుకురాలేదు. వేర్వేరు సంస్కృతుల మధ్య సంభాషణ, కొత్త సాంకేతిక పరిజ్ఞానం, వివిధ భాషల పరిచయం - ఇవన్నీ విదేశీ వాణిజ్యం యొక్క అదనపు ప్రయోజనాలు. కాకతీయుల కాలంలో ఈ సాంస్కృతిక మార్పిడి జరిగి సమాజ చైతన్యాన్ని పెంచింది.

**భూస్వామ్య విధానం - సమతుల్య సంపద పంపిణీ**

భూస్వామ్య వ్యవస్థ అనగానే దోపిడీ, అసమానత అనే భావనలు వస్తాయి. కానీ కాకతీయుల భూస్వామ్య విధానం కొంత భిన్నమైన లక్షణాలను కలిగి ఉంది. దేవాలయాలకు, బ్రాహ్మణులకు, సైనికులకు, సేవాధికారులకు - వివిధ వర్గాలకు భూములు దానమిచ్చారు. ఈ పంపిణీ ద్వారా భూసంపద ఒకే వర్గం చేతిలో కేంద్రీకృతం కాకుండా విస్తరించింది.

మరీ ముఖ్యంగా, చిన్న రైతులకు కూడా భూమి లభించింది. ఈ చిన్న రైతు వర్గం - మధ్య తరగతి రైతులు - ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వారు బలపడినప్పుడు వ్యవసాయ ఉత్పత్తి స్థిరంగా ఉంటుంది, పన్ను ఆదాయం క్రమబద్ధంగా వస్తుంది, సమాజంలో మధ్య తరగతి అభివృద్ధి చెందుతుంది. ఒక ఆరోగ్యకరమైన ఆర్థిక వ్యవస్థకు బలమైన మధ్య తరగతి అవసరమని నేటి ఆర్థిక శాస్త్రం చెప్తున్నది. కాకతీయులు అదే చేశారు.పన్నుల విధానం కూడా రైతుకు అనుకూలంగా ఉండేది. అధిక పన్నుల భారం వల్ల రైతు నష్టపోతే వ్యవసాయ ఉత్పత్తి తగ్గి రాజ్య ఆదాయం తగ్గుతుందని పాలకులు అర్థం చేసుకున్నారు. అందువల్ల సమతుల్యమైన పన్ను విధానం రైతుకు జీవనాన్ని కాపాడుతూ, రాజ్యానికి ఆదాయాన్ని అందించింది.

**శిల్పకళ, నిర్మాణం - సహకార భావన యొక్క వ్యక్తీకరణ**

కాకతీయ శిల్పకళ ప్రపంచ ప్రసిద్ధిని పొందింది. రామప్ప దేవాలయం యునెస్కో వారసత్వ స్థలంగా గుర్తింపు పొందడం ఆ శిల్పకళ యొక్క అంతర్జాతీయ ప్రమాణాన్ని నిరూపిస్తుంది. అయితే ఈ నిర్మాణాల వెనుక ఉన్న మరింత ముఖ్యమైన విషయం - అవి ఒంటరి ప్రతిభ యొక్క ఫలితం కాదు, సమాజ సహకారం యొక్క ఫలితం.

చెరువుల నిర్మాణంలో వేలాది మంది శ్రమ అవసరం. కోటల నిర్మాణం, దేవాలయ నిర్మాణం, రహదారుల అభివృద్ధి - ఇవన్నీ పెద్ద సంఖ్యలో శ్రమజీవులను, నిర్మాతలను, ఇంజినీర్లను కలుపుకొని జరిగాయి. ఈ నిర్మాణ కార్యక్రమాలు ఉపాధి అవకాశాలను విస్తరించాయి, నైపుణ్యాలను అభివృద్ధి చేశాయి, సమాజంలో ఐక్యతను పెంచాయి. ఒక పెద్ద ప్రాజెక్ట్ కోసం వివిధ నేపథ్యాల వ్యక్తులు కలిసి పనిచేసినప్పుడు వారి మధ్య పరస్పర అవగాహన, గౌరవం పెరుగుతుంది - ఇది కాకతీయ సమాజ ఐక్యతకు ఒక ముఖ్య కారణం.

నిర్మాణాలు కేవలం సౌందర్యానికి కాదు, ప్రయోజనానికి కూడా. చెరువులు నీటిని నిల్వ చేశాయి, కోటలు రక్షణ కల్పించాయి, దేవాలయాలు సమాజాన్ని ఏకీకృతం చేశాయి, రహదారులు వాణిజ్యాన్ని సులభతరం చేశాయి. ఒక నిర్మాణంలో సౌందర్యం, ఉపయోగం, ఆధ్యాత్మికత - అన్నీ కలిసి ఉండటం కాకతీయ నిర్మాణ తత్వానికి ప్రత్యేకత.

కాకతీయుల చరిత్రను అధ్యయనం చేసేటప్పుడు మనం ఒక ముఖ్యమైన ప్రశ్న అడగాలి - ఈ కాలం నుండి ఏ పాఠాలు నేర్చుకోవచ్చు? ఈ ప్రశ్నకు సమాధానాలు అనేకం ఉన్నాయి, అవి నేటి సందర్భంలో మరింత ప్రాసంగికంగా అనిపిస్తాయి.

మొదటి పాఠం - వికేంద్రీకరణ. కాకతీయుల అయగర్ వ్యవస్థ నిరూపించింది: స్థానిక స్థాయిలో అధికారాన్ని, వనరులను అందించినప్పుడు పరిపాలన మరింత సమర్థంగా జరుగుతుంది. నేటి భారత్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ ఆదర్శంగా అమలవుతే - నిజమైన వికేంద్రీకరణ జరిగితే - సమాజాభివృద్ధి వేగవంతమవుతుంది.

రెండవ పాఠం - నీటి సంరక్షణ. కాకతీయుల చెరువుల వ్యవస్థ నేటి జల సంక్షోభానికి సమాధానాన్ని సూచిస్తుంది. సంప్రదాయ నీటి నిర్వహణ పద్ధతులను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కలిపితే వ్యవసాయ అభివృద్ధి సాధ్యం. తెలంగాణలో చేపట్టిన చెరువుల పునరుద్ధరణ పథకాలు ఈ దిశలో మంచి అడుగు. మూడవ పాఠం - సమానత్వం ఆధారిత అభివృద్ధి. సమాజంలోని అన్ని వర్గాలను - రైతులు, వృత్తిజీవులు, మహిళలు, అన్ని కులాల వారు - అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములు చేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కాకతీయుల అనుభవం చెప్తుంది. ఇది నేటి సమ్మిళిత అభివృద్ధి సిద్ధాంతానికి చారిత్రక ఆధారం. నాల్గవ పాఠం - వాణిజ్య ప్రోత్సాహం. మోటుపల్లి శాసనంలో గణపతిదేవుడు వ్యక్తం చేసిన వ్యాపారికి రక్షణ, ప్రోత్సాహం ఇచ్చే విధానం నేటి వ్యాపార అనుకూల వాతావరణ నిర్మాణానికి పాఠం. విదేశీ పెట్టుబడులకు స్వాగతం పలుకుతూ, స్థానిక వ్యాపారాన్ని పోషిస్తూ నడిపిన ఆ ఆర్థిక విధానం నేటి సందర్భంలో కూడా వర్తిస్తుంది.

కాకతీయుల వ్యవస్థ మనకు ఒక సందేశం ఇస్తుంది - నీటిని నిలువ చేయడం, నేలను సాగులో పెట్టడం, ప్రజలను ఐక్యంగా ఉంచడం, స్థానిక స్వపరిపాలనను గౌరవించడం - ఇవి చేస్తే ఏ కాలంలోనైనా సమాజం సుస్థిర అభివృద్ధి సాధించగలదు.

గతం నుండి నేర్చుకోలేని సమాజం, తన భవిష్యత్తును స్వయంగా నిర్ణయించుకోలేదు. కాకతీయుల చరిత్ర ఆ నేర్చుకోవలసిన పాఠం - ఓరుగల్లు రాళ్ళలో చెక్కిన అక్షరాల రూపంలో, రామప్ప అలలలో నిక్షిప్తమైన జ్ఞానం రూపంలో నేటికీ మనతో మాట్లాడుతోంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

ఎలక్ట్రానిక్ థీసిస్, డిజర్టేషన్ రచనలో

# తర్వాత తరానికి వేయవలసిన పునాదులు, మౌలిక వసతులు

ఎలక్ట్రానిక్ థీసిస్ అండ్ డిజర్టేషన్ (ఈటీడీ) అనగా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు విద్యార్థుల పరిశోధన గ్రంథాలను డిజిటల్ రూపంలో భద్రపరచే వ్యవస్థ. ఇది కేవలం పత్రాల నిల్వ కేంద్రం కాదు. జ్ఞానాన్ని నిలిపి ఉంచే భాండాగారం. భవిష్యత్తులో పరిశోధన మరింత వేగంగా, మరింత అందుబాటులో ఉండాలంటే ఈటీడీలకు బలమైన పునాదులు అవసరం. అందుకే తరువాతి తరం ఈటీడీల మౌలిక వసతులపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మొదటిగా డిజిటల్ నిల్వ వ్యవస్థ బలంగా ఉండాలి. వేల సంఖ్యలో పత్రాలు, చిత్రాలు, పట్టికలు, వీడియోలు, డేటా ఫైళు ఒకే చోట భద్రపరచాలి. అందుకోసం వేగవంతమైన సర్వర్లు, క్లౌడ్ నిల్వ సామర్థ్యం పెంపు, నిరంతర బ్యాకప్ సదుపాయాలు అవసరం. ఒక సిస్టమ్ పనిచేయక పోయినా మరొక సిస్టమ్ ద్వారా సేవలు నిరంతరం కొనసాగాలి. సమాచారం కోల్పోవడం అనేది విద్యా ప్రపంచానికి పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. రెండవది, శోధన సౌలభ్యం. ఒక విద్యార్థి తన అంశానికి సంబంధించిన పాత పరిశోధన తెలుసుకోవాలంటే గంటల తరబడి వెతకాల్సిన పరిస్థితి ఉండకూడదు. రచయిత పేరు, విశ్వవిద్యాలయం, విభాగం, సంవత్సరం, కీలక పదం ఆధారంగా తక్షణమే ఫలితాలు రావాలి. దీని కోసం మెటాడేటా సరైన పద్ధతిలో నమోదు కావాలి. ప్రతి సంస్థ వేర్వేరు విధానాలలో వివరాలు నమోదు చేస్తే ప్రపంచ స్థాయి శోధన (సెర్చ్) కష్టమవుతుంది.

మూడవది, భద్రత. పరిశోధన గ్రంథాలు మార్పులు చేయబడకూడదు. అనధికారిక డౌన్‌లోడ్, డేటా దొంగతనం, హ్యాకింగ్ వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయి. అందువల్ల పాస్‌వర్డ్ రక్షణ, యాక్సెస్ నియంత్రణ, ఎన్‌క్రిప్షన్, నిరంతర పర్యవేక్షణ అవసరం. ఒక పరిశోధకుడు ఎన్నో సంవత్సరాల కష్టం చేసి రాసిన గ్రంథం దొంగతనంగా కాపీ చేసే నట్లయితే మూల రచయిత క్షణాల్లో నష్టపోయేలా ఉండకూడ దు. నాలుగవది, అందుబాటు. నగరాల్లో ఉన్న విద్యార్థులు మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు కూడా ఈటీడీలను ఉపయోగించగలగాలి. తక్కువ ఇంటర్నెట్ వేగంతో కూడా తెరుచుకునేలా ఫైళ్లు ఉండాలి. మొబైల్ ఫోన్ ద్వారా చదవగలగాలి. దివ్యాంగులకు స్క్రీన్ రీడర్, వాయిస్ సపోర్ట్ వంటి సదుపాయాలు ఉండాలి.

ఐదవది, బహుభాషా ప్రాప్యత. భారతదేశం వంటి దేశాల్లో ఇంగ్లీష్ మాత్రమే సరిపోదు. తెలుగు, హిందీ, మరాఠీ, తమిళం వంటి భాషల్లో పరిశోధనా సారాంశాలు (అబ్స్ట్రాక్ట్) ఉంటే పరిశోధన విస్తృతంగా చేరుతుంది. స్థానిక భాషల్లో శోధన సదుపాయం ఉంటే గ్రామీణ విద్యార్థులు కూడా ప్రపంచ జ్ఞానాన్ని అందుకోవచ్చు. ఆరవది, దీర్ఘకాల భద్రపరిచడం. ఈరోజు సేవ్ చేసిన ఫైల్ పది సంవత్సరాల తర్వాత కూడా తెరుచుకోవాలి. అందుకే ఓపెన్ ఫార్మాట్లు, కాలానుగుణ మార్పులు, ఫైల్ మైగ్రేషన్ అవసరం. పాత సాఫ్ట్‌వేర్ లేకపోవడం వల్ల పరిశోధన గ్రంథాలు చదవలేని పరిస్థితి రాకూడదు. ఏడవది, పరస్పర అనుసంధానం. ఒక విశ్వవిద్యాలయంలో ఉన్న పరిశోధ న మరొక దేశంలో ఉన్న విద్యార్థికి కూడా కనిపించాలి. ఇందుకోసం అంతర్జాతీయ ప్రమాణాలు అవసరం. ఓపెన్ యాక్సెస్ విధానాలు ఉంటే ప్రపంచవ్యాప్తంగా జ్ఞానం పంచుకోవచ్చు. ఎనిమిదవది, కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలు. ఆటోమేటిక్ సారాంశాలు, సంబంధిత పరిశోధన సూచనలు, నకిలీ గుర్తింపు, భాషా అనువాదం వంటి సేవలు ఈటీడీలను మరింత ఉపయోగకరంగా మారుస్తాయి. కానీ ఈ సేవలకు నమ్మకమైన డేటా పునాది అవసరం. తొమ్మిదవది, నిర్వహణలో శిక్షణ. లైబ్రరీ సిబ్బంది, సాంకేతిక బృందం, అధ్యాపకులు ఈటిడీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలి. మంచి సిస్టమ్ ఉన్నా దాన్ని వాడే నైపుణ్యం లేకపోతే ప్రయోజనం తక్కువ.

చివరిగా...పదవది, మొత్తానికి తదుపరి తరం ఈటీడీలు కేవలం డిజిటల్ అల్మారాలు కావు. అవి పరిశోధనను ప్రపంచానికి చేర్చే వేదికలు. బలమైన మౌలిక వసతులు, భద్రత, అందుబాటు, ప్రమాణాలు, సాంకేతిక నవీకరణ కలిసివస్తేనే ఈటిడీలు జ్ఞాన విప్లవానికి దారి తీస్తాయి. విద్యాసంస్థలు దీనిని ఖర్చు కాదు, భవిష్యత్తులో పెట్టుబడిగా చూడాలి. అప్పుడు విద్యార్థి శ్రమ సమాజానికి ఉపయోగపడే జ్ఞానంగా మారుతుంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

# శిథిలావస్థలో ప్రాథమిక పాఠశాల

- భయం భయంగా విద్యార్థులు
- వంటశాలే గదినే పాఠశాల గదిగా మార్చుకున్న వైనం..
- రంగారెడ్డి జిల్లా లాలపేట గ్రామ పాఠశాలల్లో నెలకొన్న దుస్థితి..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/కొందుర్గ్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** పాఠశాలకు వచ్చినప్పటినుండి ఆవిద్యార్థులు అక్షరాల వైపు కాకుండా ఆకాశంలో ఉన్న మేఘాల వైపు చూస్తుంటారు ఎందుకంటే చిన్నపాటి గాలివాన వర్షం వచ్చిన పాఠశాల భవనం ఎప్పుడు కూలి మీద పడుతుందో తెలియని భయంకరమైన స్థితిలో భయ భయంగా చదువును కొనసాగిస్తున్నారు విద్యార్థులు వేసవి కాలం కావడంతో చెట్ల కిందే చదువులు కొనసాగిస్తున్నారు ఇకా వర్షాకాలం వస్తే పరిస్థితి ఏమిటనే భయాందోళన విద్యార్థులకు ఉపాధ్యాయులకు గ్రామస్తులకు నెలకొంది రంగారెడ్డి జిల్లా కొందుర్గ మండలం లాలపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఈ దుస్థితి వెలుగులోకి వచ్చింది..

ఆ ఊరి పిల్లలకు అక్షరాలు నేర్చుకోవాలంటే భయం.. బడికి పంపాలంటే తల్లిదండ్రులకు వణుకు.. కురిసే ప్రతి వాన చినుకు వారి పాలిట శాపంగా మారుతోంది. ఇది రంగారెడ్డి జిల్లా కొందుర్గ మండలం లాలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిత్యకృత్యం . 'మన ఊరు – మన బడి' వంటి ఆర్భాటపు నినాదాలు వినిపిస్తున్నా, ఈ బడి పిల్లల తలరాత మాత్రం మారడం లేదు.

పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఎవరి నెత్తిన పడతాయో తెలియని దుస్థితి నెలకొంది పైకప్పు నుంచి సిమెంటు పెచ్చులు ఊడిపడుతుంటే, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఆకాశం మేఘావృతమైందంటే చాలు.. ఆ పాఠశాలలో చదువు ఆగిపోవాల్సిందే. వర్షం వస్తే తరగతి గదులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో చేసేది లేక ఉపాధ్యాయులు వంటశాలనే క్లాస్ రూమ్ గా మార్చేశారు. పోపుల పెట్టెలు, గిన్నెల మధ్యే విద్యార్థులు కూర్చుని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాల రూమ్ కంటే వంటశాలే సేఫ్ అని భావించే స్థాయికి ఆ భవనం చేరుకోవడంతో పాటు పాఠశాల భవనానికి ఉన్న కిటికీలు డోర్లు ఊడిపోయే స్థితిలోకి చేరుకున్నాయి

### ప్రతిభ ఉన్నా.. వసతులు లేవు

సౌకర్యాలు లేకపోయినా ఇక్కడి విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూనే ఉన్నారు. పాఠశాలలో ఉన్న మొత్తం 19 మంది విద్యార్థుల్లో.. ఏకంగా నలుగురు విద్యార్థులు గురుకులాలకు ఎంపిక కావడం విశేషం. ఉపాధ్యాయుల కష్టానికి విద్యార్థుల ప్రతిభ తోడై ఫలితాలు వస్తున్నా, ప్రభుత్వం మాత్రం కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతోంది..

### తల్లిదండ్రుల ఆవేదన

"పిల్లల్ని బడికి పంపాలంటేనే భయమేస్తోంది. చదువుకోవడానికి పంపిస్తే, ఎక్కడ స్లాబ్ పడి ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూస్తున్నాం" అని లాలపేట గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని, నాయకులు వచ్చి హామీలు ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులారా.. ఇంకెప్పుడు మేల్కొంటారు..?

ప్రతిభ గల విద్యార్థులు ఉన్న ఈ బడికి కొత్త భవనం మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఏదైనా ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందే మేల్కొని లాలపేట పాఠశాలకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజా పాలన కాదు - ప్రతీకార పాలన

- తెలంగాణ పాలిటి వరప్రదాయిని కాళేశ్వరం
- ప్రజల దృష్టిని మళ్లించడానికి రేవంత్ రెడ్డి కాళేశ్వరం పై ఆరోపణలు




**వనపర్తి రూరల్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పాల్గొని వారు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పై వేసిన పి. సి. ఘోష్ కమిషన్ నివేదిక నిబంధనలకు విరుద్ధంగా ఉందని కమిషన్ సిఫార్సుల మేరకు కె సి అర్, హరీష్ రావుల పై చర్యలు తీసుకోకూడదని హై కోర్టు తీర్పు ఇవ్వడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టు లాంటిదని వారన్నారు. రెండున్నర ఏండ్ల నుండి కాలయాపన తప్పా అభివృద్ధి పథకాలు అమలు చేసింది లేదు, కేవలం కె సి ఆర్ మీద ఆరోపణలు చేయడానికి పాలనా సాగించినట్లు ఉందని ఘాటుగా విమర్శించారు. గోదావరి జలాలు ఆంధ్రాకు తరలించడం కోసం, రేవంత్ గురువు చంద్రబాబు నాయుడు కు లబ్ది చేయడానికి మేడిగడ్డ రిపేర్ చేయడం లేదు, ఆంధ్ర ప్రయోజనాల కోసం తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొడుతున్న రేవంత్ చర్యలను వారు ఖండించారు. ఇప్పటికైనా కక్ష్య సాధింపు చర్యలు మానుకొని ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీల కోసం కృషి చేయాలని వారు హితవు పలికారు. ఈ దండనావేశములో నందిమల్ల అశోక్, పరంజ్యోతి, జోహెబ్ హుస్సేన్, స్టార్ రహీం, సయ్యద్ జమీల్, సూర్యవంశం గిరి, చిట్యాల రాము, రాజానగరం సత్యనారాయణ, గంధం కృష్ణ, తోట శ్రీను పాల్గొన్నారు.


## మహిళల భద్రత సామాజిక బాధ్యత



**పటాన్‌చెరు, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** మహిళలు భయం లేకుండా స్వేచ్ఛగా జీవించగల వాతావారణాన్ని సృష్టించడానికి సామూహికంగా బాధ్యత వహించాలని గీతంలోని అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అఫ్రీన్ వసీం అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 'పరిశోధన చర్చల' శ్రేణిలో భాగంగా ఐదవ సెమినార్ ను గురువారం నిర్వహించింది. భారతదేశంలోని మహిళలపై లైంగిక హింస ముప్పు యొక్క మానసిక ప్రభావం' అనే శీర్షికతో జరిగిన ఈ ఉపన్యాసం, లైంగిక హింస యొక్క నిరంతర ముప్పు కారణంగా మహిళలు మోస్తున్న, విస్తృతంగా వ్యాపించి ఉన్న, తరచుగా విస్మరించబడే మానసిక భారాన్ని పరిశీలించింది. ఈ భయం వారి మానసిక ఆరోగ్యాన్ని, ప్రవర్తనను, రోజువారీ నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందో డాక్టర్ వసీం వివరించారు.అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 'అనాలిసిస్ ఆఫ్ సోషల్ ఇష్యూస్ అండ్ పబ్లిక్ పాలసీ' (వైలీ) జర్నల్ లో ప్రచురితమైన ఆమె పరిశోధన, అందులోని ప్రధాన అంశాలను డాక్టర్ వసీం వివరించారు. అనుభవపూర్వక పరిశోధనల ఆధారంగా, సమాజంలో లోతుగా పాతుకుపోయిన, ఈ సవాళ్లను పరిష్కరించడానికి మరింత అవగాహన, విధానపరమైన జోక్యం, బలమైన సహాయక వ్యవస్థల ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు. 'భయం యొక్క పటం'గా వర్ణించిన ఆరు కీలక అంశాలను డాక్టర్ వసీం సమర్పించారు. జీఎస్ హెచ్ఎస్ సంస్థాగత పరిశోధన కమిటీ నిర్వహించిన ఈ చర్చాగోష్ఠిలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సమకాలీన భారతదేశంలో లింగం, భద్రత, మానసిక శ్రేయస్సుపై విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తూ, ఆసక్తికరమైన చర్చతో ఈ సమావేశం ముగిసింది.

# రేషన్ పంపిణీలో అవకతవకలు ఉండొద్దు

- మెరుగైన విద్య, వైద్యం అందించాలి
- మంచి ఆహారం, మెనూ ప్రకారం భోజనం అందించాలి
- రైతుల సమస్యలకూ తక్షణమే పరిష్కారం చూపాలి



**బంట్వారం, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** బంట్వారం రేషన్ పంపిణీలో అవకతవకలు ఉండొద్దని వికారా బాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. విద్యా ర్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. మంచి ఆహారం మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. బంట్వారం మండలం కేంద్రంలో కలెక్ట ర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రేషన్ డీలర్ షాప్ వద్దకు వెళ్లి బియ్యం నిల్వ, సరఫరా అయినా బియ్యం, మొత్తం రేషన్ కార్డుదారుల వివరాలు వంటి రికా ర్డులు పరిశీలించారు. రేషన్ పంపిణిలో ఎలాంటి అవ కతవకలు ఉండొద్దని అధికారులకు సూచించారు. అనం తరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆస్పత్రిలో మందులను, రికార్డులను పరిశీలించారు. అత్య వసర పరిస్థితులలో పేషంట్లకూ మెరుగైన వైద్య సేవలకై సమీప ఆస్పత్రికి అంబులెన్సులో చేర్పించాలని సూచించా రు. ఆస్పత్రిలోని పేషంట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వారి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారం చూపుతానని అన్నారు. అక్కడి నుంచి పీఏసీ ఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, వ్యవసాయంకు సంబం ధించిన రైతుల రుణాలకూ, రికవరీ సంబంధించి రికార్డులను పరిశీలించారు. రైతులకు యూరియా, డీఏపీ కొరతా లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సూచిం చారు. అనంతరం కేజీబీవీ పాఠశాల సందర్శించి బాలికల క్లాస్ రూమ్ను సందర్శించి, విద్యార్థులతో ముచ్చ ట్టించా రు. ఉపాధ్యాయుల పాఠాలు బాగా బోదిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. సమ్మర్ హాలిడేస్లో వేసవి కాలం దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు. అనంతరం పాఠశాల వంట గదిని సంద ర్శించి, మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచిం చారు. వంట సామాగ్రిని పరిశీలించారు. అనంతరం రైతు వేది కను సందర్శించి, రైతులకు పంట ఉత్పాదకతను మెరుగు పర్చుకునేలా, రైతులకూ సహకారం అందించాలని ఏఓకు సూచించారు. రైతు వేదికలో ఉన్న కొన్ని సమ స్యలను ఏఓ శ్రావ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. రైతు వేదిక ప్రహరీ గోడ, నాసిరకమైన తలుపులు, కిటికీలు, మూత్ర శాలలు వంటి సమస్యలను ఉన్నాయని తెలిపింది. ఆమె చెప్పిన సమస్యలపై స్పందించిన కలెక్టర్ వెంటనే పరిష్కా రం చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనం తరం గ్రామంలోని ఓ పర్టిలేజర్ షాప్లో తనిఖీ చేసి, రికా ర్థులులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రేణుక దేవి, తహసీల్దార్ విజయ్కుమార్, ఎంపీడీఓ రాం లు, ఏఓ శ్రావ్య, ఆర్ఐ రాంగోపాల్, కేజీబీవీ స్పెషల్ ఆఫీస ర్ శైలజ, సెక్రటరీ గోపాల్, గ్రామ రెవెన్యూ ఆఫీసర్ అనిత, ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



**చేవెళ్ల, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన సందర్భంగా చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య విద్యార్థులను శాలువతో సన్మానించి మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్ లో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థినిలు అన్నత చదువు చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యలో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే, తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, కౌన్సిలర్ లు మాజీ సర్పంచ్ బండారి శైలజఆగి రెడ్డి, మద్దేల శ్రీనివాస్, క్రిష్ణా నాయక్, మంగలి కళ్యాణి యాదగిరి, ముడిమ్యాల సొసైటీ మాజీ చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, నాయకులు గిరిధర్ రెడ్డి, ఖదీర్ పాష, మండల విద్యాధికారి పురం దాస్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నప రెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థినిలు, మోడల్ స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మారణాయుధాలతో సంచరిస్తున్న పాత నేరస్తులు అరెస్ట్

- కోర్టు రిమాండ్
- రివాల్వర్, ఎయిర్ గన్స్, గొడ్డళ్లు, కత్తులు స్వాధీనం



**ఉప్పల్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** నగరంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా మారణాయుధాలతో సంచరిస్తున్న ముగ్గురు పాత నేరస్తులను ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రివాల్వర్, ఎయిర్ గన్స్, గొడ్డళ్లు, కత్తులు, ఇనుప రాడ్లు వంటి ప్రమాదకర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిని దాసరి సురేందర్, సురేష్ ముదిరాజ్, ఆదిత్య రాథోడ్‌లుగా గుర్తించారు. వీరు గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ప్రాథమిక విచారణలో, ఈ ముగ్గురు వ్యక్తులు నగరంలోని జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దాడులు, బెదిరింపులు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు తేలింది. ఇందుకోసం ముందస్తుగా ఆయుధాలను సేకరించి గ్యాంగ్ కార్యకలాపాలకు ప్రణాళికలు రచించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో పెద్ద నేర కుట్రను పోలీసులు భగ్నం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ కేసులో మరికొంత మంది ప్రమేయం ఉండే అవకాశముందని భావిస్తున్న పోలీసులు దర్యాప్తును మరింత విస్తరించారు. స్వాధీనం చేసిన ఆయుధాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించనున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో వారిని జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే సమాచారాన్ని అందించాలని కోరారు. నగరంలో శాంతిభద్రతలను కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

# మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా ఎదగాలి

- కోరమండల్ తెలంగాణ స్టేట్ ఆపరేషన్ హెడ్ రవి కుమార్



**శామీర్‌పేట్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** కోరమండల్ సంస్థ ఫర్టిలైజర్, పెస్టిసైడ్ రంగంలో అగ్రగామిగా సంస్థ వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తూనే కార్పొరేట్ సామజిక భాద్యతలో భాగంగా సమాజానికి, కమ్యూనిటీ ల యొక్క అభివృద్ధి కొరకు మేలు చేసే విద్య, నైపుణ్యం, వైద్యం, పర్యావరణ, కన్స్ట్రక్షన్ రంగాల్లో ఎన్నో సేవలు అందించి,మహిళలు, యువత మరియు పిల్లల యొక్క అభివృద్ధి కొరకు ఎన్నో శిక్షణ, సహాయక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆయా కమ్యూనిటీలు అభివృద్ధి పథంలో నడవడంలో ఎంతో కృషి చేస్తుందని తెలంగాణ స్టేట్ కోర మండల్ ఆపరేషన్ హెడ్ రవికుమార్ అన్నారు. గురువారం రోజు ప్రధాన కేంద్రం శామీర్ పేట్ డివిజన్ లోని కోరమండల్ మన గ్రోమోర్ సెంటర్ లో కుట్టు మిషన్ల పంపిణి కార్యక్రమం నిర్వ హించారు.కోరమాండల్ వారి హైదరాబాద్ రిటైల్ జోన్ పరిధిలోని మన హైదరాబాద్ పట్టణంలో దిగువ మధ్య తరగతికి చెంది టైలరింగ్ లో అనుభవం వుండి, ఆ వృత్తినే జీవనోపాదిగా మలుచుకొన్న మహిళలకు మరింత ఉపాది పెరిగేలా ఒక సెమీ ఇండస్ట్రియల్ కుట్టు మిషన్ ను ఉచితంగా అందిస్తూ సహాయం చేసేలా ఒక కార్యక్రమాన్ని రూపొందిచి సుమారు 54 మంది అర్హతగల మహిళలకు కుట్టు మిషిన్ల పంపిణీ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో అమలుచేయడానికి హైదరాబాద్ చెందిన ఇక్క లెర్నింగ్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ఈ ప్రోగ్రాం విజయవంత అయ్యేలా కోరమండల్ సంస్థ కృషి చేసింది. ఇక్క లెర్నింగ్ ఫౌండేషన్ సంస్థ దిగువ మధ్య తరగతి మహిళల అభివృద్ధి కొరకు మైక్రో బిజినెస్ లు ఏర్పాటు చేసే విధంగా, నైపుణ్య పెంపుదలకు, కెరీర్ గైడెన్స్, ప్లేస్ మెంట్ కల్పించే రకరకాల శిక్షణలను రూపొందించి మహిళలకు శిక్షణలను అందిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా కోరమాండల్ తెలంగాణ స్టేట్ ఆపరేషన్స్ హెడ్ రవి కుమార్ మాట్లాడుతూ..మహిళలచే చిన్న చిన్న వ్యాపారాల ఏర్పాటుతోపాటు వారి ఆర్థిక అభివృద్ధి అనేది కోరమండల్ సంస్థ యొక్క సి ఎస్సార్ కార్యక్రమాలలో చాల ముఖ్యమైనది. ఈ కుట్టు మిషన్ ద్వారా వారి కుటుంబ ఆదాయం పెరగాలని ఆశిస్తున్నానన్నారు. అనంతరం హైదరాబాద్ జోనల్ హెడ్ మురళి కృష్ణంరాజు మాట్లాడుతూ.. మహిళలు బట్టలు కుట్టడం ద్వారా ఎంతో గౌరవప్రదమైన ఉపాదిని పొందుతూ ఇతరులకు ఆదర్శవంతంగా ఉంటున్నారు. ఇలాంటి సహాయక కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత మంది మహిళలకు చేరేలా చేసి వారి ఆర్థిక స్వాతంత్రంలో కోరమండల్ కూడా భాగస్వామ్యం అవుతుందని అన్నారు. జోనల్ హెచ్ ఆర్ సౌజన్య మాట్లాడుతూ..ఈ కార్యక్రమం ద్వారా సరియైన క్వాలిటీ కుట్టు మిషన్లను ఇవ్వడం ద్వారా మహిళలు మరింత సౌకర్య వంతంగా వేగంగా పని చేస్తూ వారి ఉపాదిని మెరుగు పరుచుకోగలుగుతారని పేర్కొన్నారు . ఇక్క ఫౌండేషన్ డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ.. ఈ అవకాశానికి సుమారు 290 పైగా మహిళలు దరకాస్తు చేసుకోగా దిగువ మధ్య తరగతికి చెందిన కుట్టు మిషన్ ద్వారానే జీవనొపాదినీ పొందుతున్న అర్హులైన మహిలలను 54 మంది మహిళలను ఎంపిక చేసి ఈ అవకాశం చేరేలా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నామని వీరిలో కొంత మంది టైలరింగ్ , బోటిక్ షాపులను ఏర్పాటు చేసుకొని మరింత స్థిరమైన ఆదాయాని గడిస్తూ మహిళలు ముందుకు సాగాలని కోరారు.ఈ కార్యక్రమంలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే

- పంట నష్టపోయిన వారికి అండగా ఉంటాం
- నష్టంపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయధికారులకు ఆదేశం



**రాజోలి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** రాజోలి మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో ఇటీవల కురిసిన అకాల భారీ వర్షాలు, ఈదురు గాలులు రైతన్నకు తీరని వేదనను మిగిల్చాయి. కాగా, దెబ్బతిన్న మొక్కజొన్న, వరి పంటలను గురువారం క్షేత్రస్థాయిలో అలంపూర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు పరిశీలించారు. బాధితులను పరామర్శించి, ఎవరూ కూడా ఆందోళన చెందవద్దన్నారు. దాదాపు 80 శాతం పంటలు చేతికందే సమయంలో అకాల వర్షాలకు దెబ్బతినడం చాలా బాధాకరమని అన్నారు. అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని తప్పకుండా అందేలా కృషి చేస్తానని వారికి భరోసానిచ్చారు. గ్రామంలో సుమారు 1,140 ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలపాలై, నీటిలో తడిసి ముద్దవ్వడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు త్వరితగతిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీచ్చారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పచ్చర్ల శ్రీనివాసులు, మండల వ్యవసాయధికారి రాధిక, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్‌లు పరిష్కరించాలి

● మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి

**మెదక్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడిచిపెట్టి తక్షణమే చర్చలు ప్రారంభించి, కార్మికుల అన్యాయమైన డిమాండ్ లను పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మెదక్ ఆర్టీసీ డిపో గుల్షన్ క్లబ్ వద్ద కొనసాగుతున్న కార్మికుల రెండొవ రోజు సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులతో కలసి ర్యాలీగా డిపో వరకు వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ హామీలు అన్ని గంగలో కలిసాయని,ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పుడు అమలు కాకుండా తూతూమంత్రంగా పరిపాలన సాగుతోందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు గుప్పించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సమ్మె కొనసాగడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. గతంలో . మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ, సరైన గుర్తింపు ఇచ్చి గౌరవాన్ని కాపాడారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రభుత్వంలో విలీనం, పీఆర్సీ ఫిట్‌మెంట్ వంటి హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. దీనివల్ల కార్మికులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు టెంట్లు వేసుకుని సామరస్యంగా సమ్మె కొనసాగిస్తున్నప్పటికీ, మెదక్ ప్రాంతంలో మాత్రం పోలీసులు




కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా మహిళా కార్మికులను కూడా పట్టించుకోకుండా అరెస్టు చేసి పాపన్నపేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన కార్మికులను వెంటనే విడుదల చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు పూర్తి స్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా వాయిదాలు వేయడం వల్ల కార్మికుల్లో ఆందోళన పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకలైన ఆర్టీసీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం తగదని, ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగాల భర్తీ, బకాయిల చెల్లింపు, సంఘ ఎన్నికల నిర్వహణ, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ వంటి కీలక డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ వారికి సరైన హక్కులు, భద్రత కల్పించకపోవడం అన్యాయమని విమర్శించారు. వారి శ్రమ దోపిడీని అరికట్టి తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ గడువు కోరడం సమ్మెను నీరుగార్చే ప్రయత్నంగా కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విధమైన ఆలస్యం సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తుందన్నారు. కమిటీలు, నివేదికల పేరుతో కాలయాపన చేయకుండా ప్రత్యక్షంగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమ్మె కారణంగా సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం దెబ్బతింటోందని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సంస్థ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ మల్లికార్జున్ గౌడ్,జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యం.లావణ్య రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి,న్యాయవాది జీవన్ రావు,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు సోహెల్ జుబేర్ దీపక్ కుమార్, మెదక్ మాజీ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్,లింగారెడ్డి,సురేందర్ గౌడ్, వెంకటేశం,కాశినాథ్ రావు, అంజి రెడ్డి, వేణు,సాయికుమార్, రంజిత్, స్వామి నాయక్, యంబిపూర్. మహేష్ చంద్ పాషా, ఆర్టీసీ జేఏసీ జేఏసీ నాయకులు ఆర్కే శ్రీను , ఆర్టీసీ కార్మికులు,సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి




**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** ప్రాణత్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మేడే వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు కార్మికులకు పిలుపునిచ్చారు గురువారం సీఐటీయూ సంగారెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సుందరయ్య భవన్లో నిర్వహించరు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి సాయిలు మాట్లాడుతూ 140 ఏళ్ల క్రితం చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన పోరాటం ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచిందని గుర్తు చేశారు. ఆనాడు కార్మికులు చిందించిన రక్తం ఫలితంగానే 8 గంటల పని విధానం, సెలవు సౌకర్యాలు మరియు కనీస వేతన చట్టాలు ఏర్పడ్డాయని తెలియజేశారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని కార్పొరేట్ అనుకూల 4'లేబర్ కోడ్‌లు'గా మార్చడం కార్మిక వర్గానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచే వెసులుబాటును ఈ కోడ్‌లు కల్పిస్తున్నాయని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన సంఘటితమయ్యే హక్కు, నిరసన హక్కు, సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే అధికారాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలు యాజమాన్య భద్రత కవచాలుగా మారడం శోచనియం అన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూలి లేబర్ కోడ్స్ అమలవుతున్న నేపథ్యంలో దేశంలో పెరిగిన ద్రవ్యల్బణం, ఇండ్ల అద్దెలు,ఆహార ధరలు, పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు కార్మికులకు మోయలేని భారాలైన నేపథ్యంలో కార్మికుల సంఘటితమై తమ బ్రతుకులు మార్చుకోవడం కొసం ఈ మేడే ను ఉద్యమంగా వాడవాడలా గ్రామ గ్రామాన, పట్టణాలలో వాడవాడనా పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి మే డే జెండాలను ఎగురవేసి పోరాట స్ఫూర్తిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోసీఐటీయూ నాయకులు సదానందం, శ్రీనివాస్ ,లక్ష్మణ్, యాదయ్య, నర్సింలు, రాజేష్, గౌతమ్, సుగుణ, నరసమ్మ, వీరవాని, లక్ష్మీ ,సంగీత మంజుల, మల్లమ్మ ప్రవీణ్ ,తదితరులు పాల్గొన్నారుయి.

## కలెక్టరేట్‌లో ఘనంగా భగీరథ జయంతి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లా కలెక్ట రేట్ లోని వీసీ హాల్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మహర్షి భగీరథ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణీం ద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులుఅర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభగీరథ మహర్షి ఒక గొప్ప తపస్వి అని అన్నా రు. వారు చేసిన తపస్సును ప్రసన్నమై శివ పరమాత్ము డు గంగాదేవిని భూమికి పంపించాడనీ,అందుకే మనము గంగా నదిని భగీర థి అని కూడా పిలుస్తామని తెలిపారు. భగీరథ మహర్షి గంగానదిని భూమికి తీసుకు వచ్చి మానవాళి పాపాలను పోగొట్టేందుకు చేసిన కఠోర తపస్సు భారతీయ సంస్కృ తిలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉందని తెలిపారు. ఆయన చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయక మని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించే దుకు భగీరథ మహర్షి అడు గుజాడల్లో నడవాల్సిన అవ సరం ఉందని ఆమె పిలుపు నిచ్చారు. ముఖ్యంగా యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొందాలని సూచిం చారు. ఆ మహాపురుషుని జయంతి సందర్భంగా శ్రద్ధాం జలి ఘటిస్తున్నందుకు ఎంతో సంతోషమని ఆయన పేర్కొ న్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలందరికీ భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీపీ ఆర్ వో ఎం.ఏ. రషీద్, సగర సంఘం జిల్లా అధ్యక్షులు ఆంజనేయు లు సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పట్టణ అధ్యక్షు డు విజయ్ సాగర్, సంఘం సభ్యులు ఆంజనేయులు, నరేందర్, వెంకటేష్, మన్నే లక్ష్మణ్, హన్మంతు, రవి, రాంపూర్ హన్మంతు, ప్రజా ప్రతినిధులు, బిసి సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ శివారులో జోరుగా సాగుతున్న మట్టి దందా

- అనుమతి పేరుతో అర్ధరాత్రి వరకు మట్టి దందా
- అధికారుల అండదండలతో ఇష్ట రాజ్యంగా చెలరేగిపోతున్న తీరు
- చట్ట విరుద్ధ విధులకు పాల్పడితే మట్టి దందా దళారులకు కఠినంగా శిక్షించాలి
- భూగర్భ సంపదను లూటీ చేస్తున్న దళారులు
- పాదచారులకు ద్విచక్ర వాహనదారులకు రాత్రివేళ అంతరాయం కలిగిస్తున్న టిప్పర్లు
- జీవో నెంబర్ 10 ప్రకారం పర్యావరణ అనుమతులు తప్పనిసరి
- రాత్రి వేళలో మట్టిని రవాణా చేయడం చట్టరీత్యా నేరం

**మనోహరాబాద్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో జోరుగా సాగుతున్న మట్టి దందా టిజిఐఐసి పారిశ్రామికవాడలోకి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారులు నా చేతిలో ఉన్నారంటూ విరివేగతో అర్ధరాత్రి వరకు మట్టి దందా నిర్వహిస్తున్నాడు అనుమతి ఉన్న వాహనాలు పది గంటల నుంచి సాయంత్రం 6 గంటల్లోపు మట్టి దండ ముగించుకోవాలి. కానీ చట్ట విరుద్ధ విధులకు పాల్పడితే మట్టి దందా దళారులను అధికారులు కఠినంగా శిక్షించాలి భూగర్భ సంపదను లూటీ చేస్తున్న దళారులు కొండాపూర్



గ్రామానికి చెందిన వ్యక్తి అనుమతి పేరుతో అర్ధరాత్రి వరకు మట్టి దందా చేస్తూ నిర్లక్ష్య వైఖరితో ఏకంగా అధికారులు నా చేతులు ఉన్నారంటూ ఏం చేస్తారో చేసుకోండి అని వెర్రివీగుతూ ఇష్టారాజ్యంగా అర్ధరాత్రి వరకు టిప్పర్ లారీలతో ప్రైవేట్ పరిశ్రమలకు మట్టి తరలిస్తున్నాడు. అధికారుల అండదండలతో ఇష్ట రాజ్యాంగ చెలరేగిపోతున్న తీరు రాత్రి వేళల్లో మట్టిని రవాణా చేయడం చట్టరీత్యా నేరం అదేవిధంగా మట్టిని తీయాలంటే ఇరిగేషన్ మైనింగ్ మరియు రెవెన్యూ అధికారుల ముందస్తు అనుమతి తప్పనిసరి అయినప్పటికీ జీవో నెంబర్ 10 ప్రకారం పరిశ్రమల వాణిజ్య శాఖ గనుల విభాగం నుండి పర్యావరణ అనుమతులు కూడా తప్పనిసరి కలకల్ నుంచి కొండాపూర్ రావాలంటే పాదాచారకు ద్విచక్ర వాహనదారులకు టిప్పర్ లారీల ద్వారా ఇబ్బందికరంగా మారుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

## కలెక్షన్ ఫుల్... మెయింటెనెన్స్ నిల్..!

- జనం సాక్షి కథ దానికి స్పందన
- ఈతకొలను శుభ్రం చే సిబ్బంది
- అధికారుల్లో స్పందన



**జంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** స్థానిక ఈతకొలను దుర్వ్యవస్థపై వెలువడిన వార్త ప్రభావంతో అధికారులు కదిలారు. పూల్ నిర్వహణలో నెలకొన్న నిర్లక్ష్యంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో, కలెక్షన్ ఫుల్... మెయింటెనెన్స్ నిల్! ప్రచురితమైన జనం సాక్షి దినపత్రికలో వెలువడిన వార్తకు అధికారులు వెంటనే స్పందిస్తూ, తక్షణ చర్యలకు దిగింది. డివైస్ ఓ అఖిలేష్ రెడ్డి స్వయంగా పూల్‌ను పరిశీలించి, సిబ్బందిపై తీవ్ర


జనంసాక్షి
కలెక్షన్ ఫుల్.. మెయింటెనెన్స్ నిల్

ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణలో లోపాలు, నీటి నాణ్యత క్షీణతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో స్విమ్మింగ్ పూల్ సిబ్బంది పూల్‌లోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి, శుభ్రపరిచే పనులు ప్రారంభించారు. పూల్ గోడలు, అడుగు భాగాన్ని శుభ్రపరచడంతో పాటు, కొత్తగా శుద్ధి చేసిన నీటిని నింపేందుకు ఏర్పాట్లు చేపట్టారు. డీవైఎస్ఓ అఖిలేష్ రెడ్డి నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, రసాయనాల వినియోగాన్ని ప్రమాణాల మేరకు మాత్రమే వినియోగించాలని సిబ్బందికి సూచించారు.

## బస్ డిపో వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** టీజీఎస్ఆర్టీసీ జేఏసి సమ్మె నేపథ్యంలో నారాయణపేట పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోను గురువారం జిల్లా ఎస్పీ వినీత్ క్షేత్రస్థా యిలో సందర్శించి, భద్రతా ఏర్పాట్లను అక్కడి పరిస్థితు లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య తో మాట్లాడి బస్సుల రాకపోక లు డిపో వద్ద నెలకొన్న తాజా పరిస్థితులను అడిగి తెలుసు కున్నారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమ త్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో విధులకు హాజరయ్యే డ్రైవ ర్లు ఇతర సిబ్బంది ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవస రం లేదని, వారికి పోలీసు శాఖ తరపున పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థకు ఆటంకం కలిగించే ప్రయత్నం చేసినా, లేదా ప్రభుత్వ ఆస్తులైన బస్సులకు నష్టం కలిగించినా సహించేది లేదని హెచ్చరించారు. చట్టా న్ని అతిక్రమించి ఆందోళన లకు దిగేవారిపై, విధులను అడ్డుకొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకో వాలని అక్కడి అధికారుల ను ఆదేశించారు. జిల్లా లోని రెండు డిపోలలో పరిస్థితి శాంతియుతంగా కొనసాగుతోంది, ఆర్టీసీ విధులకు హాజరయ్యే ఉద్యోగులు ఎవరు భయపడకుండా తమ విధు లకు హాజరు కావాలని అందుకు పోలీస్ శాఖ రక్షణ కల్పిస్తుంది అని తెలిపినారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకరాలు కొనసాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ తో పాటు ఎస్ బి ఎస్సై నరేష్, ఎస్సైలు వెంకటేశ్వ ర్లు, రాజు పోలీసు సిబంది ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● కొప్పుల శేషారెడ్డి



**అల్లాదుర్గం ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలలను సాకారం చేస్తోందని ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి అన్నారు. గురువారం అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామానికి చెందిన (నిర్జప్ల కవిత భర్త బేతయ్య) అనే లబ్ధిదారురాలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నాళ్లుగానో ఎదురు చూసిన పేదల గృహ కలలను ఈ పథకం నెరవేర్చుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధానంగా తీసుకుని పనిచేస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల పోరం అధ్యక్షులు ,సాతెల్లి గారి నర్సారెడ్డి , గ్రామ సర్పంచ్ ,పాంపాటి వీరప్ప,డీసీసీ ప్రధాన కార్యదర్శి బాలకిషన్ , జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు బలరాం,పంచాయతీ కార్యదర్శి ,స్వరూప ,హౌసింగ్ ఏ, ఈ,అక్రమ్ , ఉపసర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు అతినారం బస్వారాజ్ ,కాంగ్రెస్ నాయకులు కోర్మని ప్రభు, జైపాల్, బక్కయ్య, యాదయ్య,పాపయ్య ,ఆంజనేయులు,సిద్దప్ప ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

● జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** పిల్లల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకున్నప్పుడే వారి భవిష్యత్తు బాగుంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జరుగుతున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా సంగారెడ్డి లో గల మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల జోగిపేట (బాలికలు)లో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించి, తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని, పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు తమ సూచనలు, సలహాలు అందించాలని, సమస్యలు ఉన్నపక్షంలో వెంటనే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అవసరమైతే కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేసి, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల సమస్యలను స్వీకరించి పరిష్కరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇంగ్లీష్ భాషలో నైపుణ్యం పెంపొందించేందుకు హాస్టల్‌లో ప్రతిరోజు ఒక గంటపాటు ఇంగ్లీష్‌లోనే మాట్లాడే విధానాన్ని అమలు చేయాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులకు ఆదేశించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారు బలహీనంగా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పాటు, ఆసక్తి ఉన్న రంగాలలో ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూరుస్తోందని, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు రెగ్యులర్ హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వసతి గృహాలలో అందిస్తున్న సౌకర్యాలపై కూడా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరై, పిల్లలతో కలిసి ఒక పూట భోజనం చేసేలా అన్ని వసతి గృహాలకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులలో పెరుగుతున్న మానసిక, భావోద్వేగ సమస్యలను దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కలిసి వారికి మానసిక ధైర్యం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న సబ్జెక్టులను ఎంపిక



చేసుకుని, తమ ప్రతిభను మెరుగుపరుచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తపరిచి, సంక్షేమ వసతి గృహాలలో అందుతున్న నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం 2025-26 విద్యాసంవత్సరంలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ప్రిన్సిపాల్ రజని, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ స్రవంతి, డిప్యూటీ వార్డెన్ జ్యోతి, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెలో ఆర్టీసీ సిబ్బంది

- తాత్కాలిక డ్రైవర్లతో అరకొర బస్సులు
- బస్సులు లేక ఇబ్బంది పడ్డ ప్రయాణికులు





**మంచిర్యాల ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ జేఏసీ చేపట్టిన సమ్మె మంచిర్యాల జిల్లాలో రెండో రోజు కొనసాగుతోంది. కార్మికులు విధులకు దూరంగా ఉండటంతో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఆర్టీసీ కార్మికులు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుండి ఐబి చౌరస్తా వరకు ర్యాలీ తీసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు మాట్లాడుతూ..ఆర్టీసీ కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ సిబ్బంది సమ్మె బాట పట్టారు .ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వేతన సవరణ 2021, 2025 వేతన సవరణలను 30% ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో పాల్గొన్నారు . మొత్తం 32 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును యాజమాన్యానికి అందజేసినట్లు జేఏసీ నేతలు తెలిపారు. ఆర్టీసీ సంస్థను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలను పునరుద్దరించాలని, పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

### ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిజెపి సంఘీభావం

తెలంగాణలోని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు తీరని అన్యాయం చేసిందని తెలంగాణ రాష్ట్రం బీజేపీ ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. గురువారం నాడు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్ డిపో వద్ద సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు రఘునాథ్ మద్దతు తెలిపారు.. సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారని విస్మరించి ఆర్టీసీ కార్మికుల పొట్ట గొడుతున్నారని అన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణమని డ్రైవర్ల కండక్టర్లకు అధిక పని భారాన్ని మోపుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీ కూడా విస్తరిస్తున్నారని అలాంటి వారిని వచ్చే ఎన్నికల్లో ప్రజలు కచ్చితంగా బుద్ధి చెప్తారని అన్నారు ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

## పోలీస్ కుటుంబాలకు అండగా ప్రభుత్వం

- కారుణ్య నియామకం కింద ఐదుగురు జూనియర్ అసిస్టెంట్‌లుగా నియామక పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(జనంసాక్షి):** జిల్లా పోలీ శాఖలో విధినిర్వహణలో ఉండగా మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని జిల్లా ఎస్పీ నీతికా పంత్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన ఐదుగురు అభ్యర్థులకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాలను ఎస్పీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తిని కోల్పోయిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పోలీస్ కుటుంబాలను ఆదుకోవడమే కారుణ్య నియామకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. కొత్తగా విధుల్లో చేరుతున్న అభ్యర్థులు క్రమశిక్షణతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, తమ కుటుంబాలకు గౌరవం తీసుకురావాలని సూచించారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో మరణించిన కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్ వారసులు ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ పత్రాలు అందుకున్న అభ్యర్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ క్లిష్ట సమయంలో ఉపాధి కల్పించినందుకు ప్రభుత్వం, జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు జాదవ్ రాజ్ కుమార్, తండ్రి ఉక్కు నాయక్, కే వినోద్ కుమార్, తండ్రి జలపతిరావు, రాథోడ్ మమత, తండ్రి శంకర్, ముదాసిర్ అహ్మద్, తండ్రి మోక్షుద్ అహ్మద్, నాగర్జున, తండ్రి తిరుపతయ్య, వీరంతా మీ అమ్మకు పత్రాలని అందుకున్నారు.

## భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** వివిధ భూ సమస్యలపై భూభారతి రెవెన్యూ సదస్సులలో ప్రజలు అందించిన దరఖాస్తుల పరిష్కారం ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి భూ భారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల భూ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం దిశగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని కన్నెపల్లి తహసిల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్, కన్నేపల్లి మండల తహసిల్దార్ రామచందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తో కలిసి సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ, కార్యాలయ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్ల రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచసే విధంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాలలో మూత్రశాలలో నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా చేపడుతున్న చర్యలలో భాగంగా జిల్లాలోని పాఠశాలలలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం నెన్నెల, తాండూర్ మండలాల తహసిల్దార్ల కార్యాలయాలను సందర్శించి ఆయా మండలాల తహసిల్దార్లు శ్రీనివాస్, జ్యోత్స్న తో భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలించి పరిష్కార ప్రక్రియ ప్రభుత్వానిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో మాట్లాడి వచ్చిన కారణాలను తెలుసుకొని దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వ బస్సులు నై, ప్రైవేటు బస్సులు సై

- తికమక పడుతున్న ప్రయాణికులు
- రెండో రోజుకు చేరిన సమ్మె
- బస్టాండ్ ముందు ప్రైవేటు బస్సుల హల్‌చల్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఇదేంటి ఆర్‌టీసీ బస్సులు రయ్ రయ్ మని రోడ్డెక్కుతున్నాయి. అనుకుంటున్నారా? ఒక పక్క తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్‌టీసీ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నాలు ఆందోళనలు చేస్తుంటే ఇంకో పక్క సమ్మె నడుస్తున్న కూడ అదేమి పట్టించుకోకుండా బస్టాండ్ ముందు హైర్ విత్ బస్సులు ఏం చక్క ప్రయాణీకులను గమ్య స్థానాలకు చేర్చుతున్నారు. కానీ ఇదంతా చూసే కొంత మంది తికమక పడుతున్నారు. ఒక్క రోజులోనే సమ్మె ముగిసిపోయిందా అంతలోనే బస్సులు రోడ్డుపై రయ్ రయ్ మని పరుగులు పెడుతున్నాయ్ అని ఆనందం వ్యక్తం చేస్తున్న పరిస్థితి కలుగుతుంది. కానీ పరుగులు పెడుతున్న బస్సులు ప్రభుత్వ బస్సులు కావు. అవి హైర్ విత్(ప్రైవేటు)బస్సులు ఐతే సమ్మె మొదటి రోజు కాకుండా రెండవ రోజు నుంచి ఈ బస్సులు బస్టాండ్ ముందు క్యూలో ఉంటూ ఈ బస్సుల్లో ప్రయాణికుల్ని వారి వారి గమ్య స్థానాలకు పంపిస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి మాత్రం ఏ ఒక్క బస్సు డిపో నుంచి కదలడం లేదు. ఆర్ టీ సీ ని ప్రభుత్వంలో విలీనం చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారు. కానీ చూసే వారికి మాత్రం బస్సులు రోడ్డుపై పరుగులు పెడుతుంటే బస్సులు మళ్ళీ తిరుగుతున్నాయా ఇవి ప్రైవేటా లేక గవర్నంటు బస్సులా అని తికమక పడుతున్నారు. అరకొర బస్సులు ఉండడం కారణంగా బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటున్నప్పటికీ ప్రయాణికులు ప్రయాణం చేస్తున్న పరిస్థితి నెలకొంది.



## అటెండర్ గా పనిచేసి.. అతిథిగా వచ్చి...

**ఖానాపూర్ ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** మున్సిపల్ కేంద్రంలోని 5వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో అటెండర్ గా విధులు నిర్వహించిన మేసు పోసమ్మ అదే వార్డు కౌన్సిలర్ గా ఎన్నికై అతిథిగా పాఠశాలను సందర్శించారు. గురువారం ఈ అరుదైన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది పోసమ్మ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం పోసమ్మ మాట్లాడారు. విధులు నిర్వహించిన చోటికి అతిథిగా రావడం ఆనందంగా ఉందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షరీఫా, ఉపాధ్యాయురాలు శోభ, అంగన్వాడి టీచర్ పుష్ప లతో పాటు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, ఏప్రిల్ 23(జనంసాక్షి):** గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాసంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా (సింపుల్ సెల్ డీడ్స్ ) సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ సంబంధిత అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. సాదాబైనామా కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, ప్రతి దరఖాస్తును సమగ్రంగా ధృవీకరించాలన్నారు. భూ సంబంధిత పత్రాలు, పాత రికార్డులు, ఆదాయ పత్రాలు, తదితర వివరాలను ఖచ్చితంగా పరిశీలించా లన్నారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా సమాచారం అందించి, ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ స్థాయిలో తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షణలు నిర్వహించి, నివేదికలు సమర్పించాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు సమస్యాత్మక కేసులను జిల్లా స్థాయికి పంపించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులకు న్యాయం చేయడం, వారి హక్కులను రక్షించడం, భూ రికార్డులను సక్రమంగా నమోదు చేయడం ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## కాళేశ్వరం కట్టు కథలు.. రేవంత్ రెడ్డికి చెంపపెట్టు

- న్యాయస్థాన ఆదేశాలతో తేటతెల్లం
- మాజీ మంత్రి రెడ్యానాయక్



**డోర్నకల్ (జనంసాక్షి) :** కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి చోటు చేసుకుందని ప్రస్తుత ప్రభుత్వం నియమించిన పిసి గోష్ కమిటీ నివేదిక పై హైకోర్టు ఆదేశాలు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంప పెట్టని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తీవ్రంగా స్పందించారు.గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై బురద చల్లడమే పనిగా కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 80 లక్షల కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్ల అవినీతి జరిగిందనడం కట్టు కథలకు పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు.మాజీ మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్, కౌన్సిలర్లు శరత్, రాము, మాజీలు సర్పంచ్ పాండు నాయక్, సొసైటీ చైర్మన్ బిక్షం రెడ్డి, హేమచంద్రశేఖర్, కో ఆప్షన్లు రామభద్రం, మియా, యశోదర్,కొత్త వీరన్న,ఆయుబ్ పాషా, చంటి, కోటి,గౌస్ పాషా,రమేష్,కిరణ్ తదితరులున్నారు.

## ధాన్యం చెల్లింపులు సకాలంలో చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే వరి ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఎన్ని గ్రామాల నుంచి ధాన్యం వస్తోంది టోకెన్ వ్యవస్థ అమలు ఎలా జరుగుతోంది ధాన్యం నాణ్యత పరీక్ష విధానం వంటి అంశాలపై అధికారులు, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కేంద్రాల వద్ద టార్పాలిన్లు,ప్యాడీ క్లీనర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న కాటన్ జిన్నింగ్ మిల్, ములుకనూరు రైస్ మిల్‌ను పరిశీలించారు. సంబంధిత కార్యకలాపాలను సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. తరువాత ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని సందర్శించిన కలెక్టర్,అక్కడి కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన పొందారు. సహకార సంఘం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి,సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి,మేనేజర్ రాంరెడ్డి, సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి,డీసీఎస్‌వో వాజిద్ అలీ,సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, ఏడీఏ ఆదిరెడ్డి, వేణుగోపాల్, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం,ఏవో పద్మ,రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీధర్,మాజీ కొత్తకొండ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా తదితరులు,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** అర్హులైన జర్నలిస్టులందరికీ పారదర్శకంగా అక్రిడేషన్ కార్డులు అందజేస్తామని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని 252 జీవో ననుసరించి అర్హులైన జర్నలిస్ట్ కి పారదర్శకంగా అక్రిడిటేషన్ లు అందజేస్తామని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్యశారద తెలిపారు. వరంగల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వ వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కోసం ఆన్లైన్ ద్వారా ఐపిఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను జీవో ననుసరించి క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రయత్నించాలని ఆమె సూచించారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు.ప్రజాస్వామ్యంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 2026–2028 సంవత్సరానికి నూతన కార్డులు జారీచేసే పక్రియ ను వేగవంతం చేయాలని వారు పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియని ఆమె పేర్కొన్నారు .ఎవరు కూడా ఆందోళనకు గురి కాకుండా జర్నలిస్టులు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని జర్నలిస్టులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ ప్రేమలత, వరంగల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శ్రీరాశీ రాశీచందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, బోడిగ శ్రీనివాస్, మట్టా దుర్గాప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, పల్లెల సోమేశ్వర్, హుస్సేన్ పాషా, బొల్లపల్లి రాజు పాల్గొన్నారు.

## పోషకాలు ప్రతీ సమావేశానికి హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ రూరల్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** నిర్మల్‌లోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సంక్షేమ వారోత్సవాల సందర్భంగా గురువారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జాదవ్ అంబాజీ ఆధ్వర్యంలో పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్, జిల్లా విద్యాధికారి భోజన్న, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జీవరత్నం, ఏసీఎంఓ రాథోడ్ శివాజీ, మండల విద్యాధికారి, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయురాలు ఎన్. శైలజ, జిల్లా క్రీడల అధికారి బుక్య రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలనాధికారి పాఠశాల వసతులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రధానోపాధ్యాయురాలు, క్రీడల అధికారి బుక్య రమేష్‌ను అభినందించారు. క్రీడలలో విశేష సేవలందించినందుకు రమేష్‌ను శాలువాతో సత్కరించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి జీవితంలో విజయం సాధించాలని సూచించిన పాలనాధికారి, పోషకులు ప్రతి సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం పాలనాధికారిని పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## రెగ్యులర్ జడ్జిని నియమించాలని వినతి

**ఖానాపూర్ ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రెగ్యులర్ జడ్జిని నియమించాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మట్టేరి రాజశేఖర్ జిల్లా జడ్జి శ్రీవాణికి వినతిపత్రం సమర్పించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కోర్టు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసుల పరిష్కారంలో ఇన్చార్జి జడ్జి ఉండటం వలన జాప్యం అవుతున్నదని అన్నారు. వాయిదాలు ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలంటే రెగ్యులర్ జడ్జిని నియమించినట్లయితే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని కోరినట్లు ఆయన తెలిపారు.

# పేద విద్యార్థులకు మంచి భోజనం, నాణ్యమైన విద్య అందిస్తోంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది..
- ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరేలా సకల సదుపాయాలు కల్పిస్తున్నాం



**మణుగూరు, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** నిరుపేద విద్యార్థులకు మంచి భోజనం నాణ్యమైన విద్య ప్రభుత్వం అందిస్తోందని గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మణుగూరు మండలం లంక మల్లారం గ్రామంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేసి, టీటీఆర్‌జేసీ బాలికల డార్మెటరీ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముందుగా రూ.1 కోటి అంచనా వ్యయంతో ప్రధాన బీటీ రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి టీటీఆర్‌జేసీ బాలికల డార్మెటరీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

### హాస్టల్లో అమ్మచేతి వంట

పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మంచి ఆహారం తీసుకుంటూ, మెరుగైన విద్యను అభ్యసించాలనే ఆశయంతో ప్రభుత్వం హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లులు చేసే వంటల రుచిని గుర్తు చేసేలా పోషకాహారంతో కూడిన మెనూను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ అందించే ఆహారం విషయమై స్పష్టమైన ప్రణాళికతో హాస్టళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

### విద్యతో ఉపాధి అవకాశాలు

ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి విశ్వాసంతో ఉందని, వారు తమ కాళ్ల మీద నిలబడి దేశాన్ని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగాలని విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో ఏ టీ సి కేంద్రాల ద్వారా వివిధ నైపుణ్యాలపై శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎలక్ట్రిషియన్, మెకానిక్ వంటి రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణల ద్వారా వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

### నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకటరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ గ్రామ సర్పంచ్ పూనెం రమేష్,పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ ఏరియా ఆసుపత్రిలో కాయకల్ప బృందం తనిఖీ

- ఆసుపత్రి పనితీరుపై ఆరా
- మెరుగుపడుతున్న ఆసుపత్రి సేవలు అని ప్రశంస
- పరిశుభ్రత భేష్
- మెరుగైన వైద్య సేవలకు సూచనలు



**దేవరకొండ, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** దేవరకొండ ఏరియా ఆసుపత్రిని గురువారం కాయకల్ప బృందం సందర్శించింది. వారు అక్కడ పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను, అక్కడ అందుతున్న సేవలు, సౌకర్యాలు, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులను పరిశీలించారు. కాయకల్ప బృందం స్వామి ఆంగోతూ, డా,సాయి కిరణ్, డాక్టర్ ప్రియదర్శిని ఆస్పత్రికి సుపరిండెంట్ డాక్టర్ పి రవి ప్రకాష్ మరియూ సిబ్బంది అక్కడ అందుతున్న సేవలను వారికీ వివరించారు. కాయకల్ప బృందం ఆసుపత్రిని భౌతికంగా తనిఖీ చేసి సిబ్బంది, రోగులతో సంభాషించారు. అసెస్మెంట్ బృందం ఆసుపత్రి పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేసింది. ముఖ్యంగా ఉన్నత నిర్వహణ ప్రమాణాలను పాటించినందుకు బృందం వారు ప్రత్యేకంగా ప్రశంసించారు. కాయకల్ప పథకం ద్వారా ప్రజారోగ్య సేవలను మెరుగుపరచడం, పరిశుభ్రతను ప్రోత్సహించడమని అన్నారు.ఈ కార్యక్రమములో సూపరింటెండెంట్ డా. పి. రవి ప్రకాష్ డా. కృష్ణ, డా. రంజిత్ కుమార్ , డా. విజయ్ కుమార్,డా. మంగ్త నాయక్, డా శంకర్ ఇతర వైద్య బృందం మరియు నర్సింగ్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్ కాలవలతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం

- మంత్రి తుమ్మల



**ములకలపల్లి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** సీతారామ ప్రాజెక్ట్ కాలువ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణతో కలిసి బుధవారం పరిశీలించారు. తొలుత ములకలపల్లి మండలం కమలాపురం నుండి అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు వరకు సుమారు 20 కిలోమీటర్లు పర్యటించి ఆయన కాలువను,పనులను పరిశీలించారు.అనంతరం సత్తుపల్లి మండలం యాతాలకుంట దగ్గర జరుగుతున్న టన్నెల్ పనులను సైతం పరిశీలించి అధికారులకు తగు సలహాలు,సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ కాలువల పనులు త్వరలోనే పూర్తవుతాయని,రైతులకు అందుబాటులోకి వస్తాయని,సీతారామ ప్రాజెక్ట్ కాలువతో రెండు జిల్లాలు సస్యశ్యామలం అవుతాయని ఆయన అన్నారు.ఆయన వెంట జిల్లా అధికారులు,సంబంధిత శాఖ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**మునగాల, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలోని పిఏసిఎస్ వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్వయంగా ధాన్యం నాణ్యతను పరిశీలించి, తేమ శాతాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## బీటీ రహదారులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు



**టేకులపల్లి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ఇల్లందు పర్యటనలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్.కే పురం నుండి ఏడుప్పలగూడెం వరకు బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.3 కోట్ల 30 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు స్థానిక శాసన సభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ పాల్గొన్నారు. అనంతరం టేకులపల్లి మండలంలో పర్యటిస్తూ మొక్కంపాడు నుండి పూబల్లి వరకు, మద్రాస్ తండా నుండి మేళ్ల మడుగు వరకు బీటీ రహదారుల కోసం మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసి రెండు నెలల్లోనే పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రహదారి నిర్మాణంతో ప్రాంతీయ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి గ్రామాల మధ్య అనుసంధానం బలపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన



**కొండమల్లేపల్లి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర రోడ్డు రవాణా భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే బాలు నాయక్ నేడు శుక్రవారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొలుముంతల పహాడ్ గ్రామ పంచాయతీలో 202 సర్వేనెంబర్లోని 20 ఎకరాలలో 200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణా శంకుస్థాపన కార్యక్రమానికి నేడు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. నేటి పోటీ ప్రపంచంలో నాణ్యమైన విద్య కోసం మధ్య పేద తరగతి తల్లిదండ్రులు తమ స్తోమతకు మించి అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు పూర్తిగా అందుబాటులోకి వస్తే రూపాయి ఖర్చు లేకుండా అత్యున్నత స్థాయి బోధన, భోజన వసతి సౌకర్యాలు లభిస్తాయి. ఇది వేలాది కుటుంబాలకు ఆర్థికంగా పెద్ద ఊరట నిస్తుంది. ప్రస్తుత గురుకుల వ్యవస్థలలో ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కో పాఠశాల ఉండగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల సమీకృత విధానం ద్వారా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు అందరూ ఒకే ప్రాంగణంలో ఒకే గొడుగు కింద చదువుకోనున్నారు. ఈ విధానం విద్యార్థుల కుల వివక్షను తొలగించడమే కాకుండా చిన్ననాటి పాత తరంలా సామాజిక ఐక్యతను పెంపొందిస్తుంది. ఇలాంటి విద్యా విధానం నేటి సమాజానికి ఎంతో అవసరం.

## పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

**జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** పట్టుదలకు మారుపేరే భగీరథ మహర్షి అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కఠోర దీక్షతో గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చి ప్రపంచాన్ని సస్యశ్యామలం చేసిన మహనీయుడు భగీరథ మహర్షి అని అన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆ స్ఫూర్తిని భవితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పనిలో ఎన్ని అవరోధాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని కృషి చేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఆయన సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్, రేషన్ బియ్యం వంటి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ అధికారి సంజీవయ్య, సగర సంఘం అధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లెట్ల మారయ్య, జిల్లా కార్యదర్శి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ టిడిపి రాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా సగర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.కార్యక్రమానికి ముందు జిల్లా సగర సంఘం ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

## ధాన్యం కొనుగోలులో శ్రద్ధ చూపని ప్రజా ప్రతినిధులు

- ఇప్పటికీ ధాన్యం కొనుగోలు ప్రారంభించని ఐకేపీ సెంటర్లు
- ధాన్యం రాశుల మధ్య దిష్టి బొమ్మలుగా దర్శనమిస్తున్న కొనుగోలు కేంద్రాలు
- మధ్య దళారీ వ్యవస్థకు తరలిపోతున్న దాన్యం దళారీ చెప్పిన రేటుకే రైతు ధాన్యం
- అమ్ముకుంటున్న వైనం



**పెనుబల్లి, ఏప్రిల్ 23 (జనం సాక్షి) :** ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో చూపిన ఉత్సాహం ధాన్యం కొనుగోలు చేయించడంలో మాత్రం ,ప్రజా ప్రతినిధులు ,అధికారులు ఉత్సాహం చూపించడం లేదు. అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేయకుండా ఎందుకు మోసం చేస్తున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు.గోనె సంచులు రాలేదని, మిల్లర్లు అనుమతులు ఇవ్వలేదని కుంటి సాకులు చెప్పలేక కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాలను ఎందుకు ఏర్పాటు చేసామా అని ఐకేపీ సిబ్బంది తమలో తామే మధన పడుతున్నారు.రైతుకు గిట్టుబాటు ధర అందడం లేదు.దిక్కు లేని పరిస్థితుల్లో మధ్య దళారీలు నిర్ణయించిన రేటుకే అమ్ముకొని రైతులు దోపిడీకి గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.మండలంలో ఇప్పటికే 75 శాతం ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవడం జరిగింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ఇప్పటి వరకు మండలంలో ఎక్కడా ధాన్యాన్ని కాటా వేసిన దాఖలాలు లేవని రైతులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.

## కాంగ్రెస్ కుట్రల కోటలు బద్ధలు

- హైకోర్టు తీర్పుతో కేసీఆర్ పవిత్రత మరోసారి నిరూపితం
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



**ఖమ్మం, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** తెలంగాణ సాధకుడు, అపర భగీరథుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు విచారణ కమిషన్లను ఉపయోగించి బద్నాం చేయాలని ప్రయత్నించిందని బిఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఘాటుగా విమర్శించారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్ లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ కుట్రలకు గట్టి చెంపదెబ్బగా మారిందన్నారు. కేసీఆర్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ, ఆయన నాయకత్వంలోనే 'జై తెలంగాణ' నినాదం దేశవ్యాప్తంగా మార్మోగి స్వరాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. "కేసీఆర్ ఒక వ్యక్తి కాదు.. తెలంగాణ పునర్నిర్మాణానికి పునాది" అని అభివర్ణించారు. గత కాంగ్రెస్ పాలనలో నల్లగొండ జిల్లా, రంగారెడ్డి జిల్లా ప్రాంతాలు ఫ్లోరోసిస్ సమస్యతో తీవ్రంగా నష్టపోయాయని గుర్తుచేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధ నీటిని అందించి ఆ సమస్యను అధిగమించిన ఘనత కేసీఆర్‌కే చెందుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాలలో ఒకటైన కాళేశ్వరం ప్రాజెక్టు ను తక్కువ కాలంలో పూర్తి చేసి తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిందని చెప్పారు. మేడిగడ్డ వద్ద జరిగిన సమస్యను ఆధారంగా తీసుకుని కాంగ్రెస్ "కూలేశ్వరం" అంటూ విషప్రచారం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లోకి వెళ్లి నిజాలను వెల్లడిస్తామని, చివరికి ధర్మమే గెలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణను కాపాడగలిగే శక్తి కేసీఆర్ మరియు భారత రాష్ట్ర సమితి మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కూరాకుల నాగభూషణం, బెల్లం వేణుగోపాల్, ఉప్పల వెంకటరమణ, తాజుద్దీన్, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, ఈదుల రాజేష్, బెల్లంకొండ గోపి, మహమ్మద్ రఫీ, కృష్ణ ప్రసాద్, పోలిపాంగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు వచ్చేలా చూడాల్సిన బాధ్యత జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీపై ఉందని, అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ కార్డు త్వరలో అందజేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే గురుతర బాధ్యత పత్రికలు, చానళ్లపై ఉందని అన్నారు.అలాంటి విధులు నిర్వహించే జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డులు అర్హత ఉన్న వారికే అందాలని అన్నారు. ఆ విధంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ చర్యలు తీసుకోవాలని అన్నారు.నేటి సాయంత్రంలోగా దరఖాస్తు చేయని పాత్రికేయులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్ లైన్ లో దరఖాస్తు చేయాలని సూచించారు.నూతనంగా ఎంపికైన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, వజ్జే వీరయ్య, షేక్ సైదా, కోల నాగేశ్వరరావు, ఎండి.ఖలీల్ అహ్మద్, డాక్టర్ బంటు కృష్ణ, రెబ్బ విజయకుమార్, శంకరమంచి రవీందర్ శర్మ, బత్తుల మల్లికార్జున్, బుక్క ఉపేందర్ లకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ దర్శనం మల్లేశం, జిల్లా పౌర సంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి

- జూన్ నుండి "బ్రేక్ ఫాస్ట్" పథకం ప్రారంభిస్తాం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**యాలాల, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.గురువారం యాలాల మండలం అగ్గనూర్ జడ్పీ హెచ్ ఎస్ పాఠశాలలో రూ.42 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను మరియు సైన్స్ ల్యాబ్ ను, యాలాల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో 7 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడ మరియు 20 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన సీసీ రోడ్లను, ముద్దాయి పేట గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంబించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అగ్గనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ విలువ-ఆధారిత విద్యను విస్తరించడానికి, మెరుగైన, మౌలిక సదుపాయాలను అందించడానికి కొత్త భవనాలు నిర్మించామన్నారు. అగ్గనూర్ పాఠశాల ప్రశాంతతతో పాటు క్రమశిక్షణకు మారుపేరుగా ఉందన్నారు. అన్ని క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో ముందంజలో ఉంటుందని తెలిపారు. ఈ పాఠశాలను ఇంటర్‌గా అప్గ్రేడ్ చేసేలా నేను కృషి చేస్తానని పేర్కొన్నారు. 4 అదనపు గదులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు విన్నవించగా వాటిని తప్పకుండా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశాం.సీఎం రేవంత్ రెడ్డి విద్య శాఖ మంత్రిగా ఉన్నారు కాబట్టి విద్యార్థుల ఆరోగ్యం కూడా బాగుండాలని జూన్ నుండి "బ్రేక్ ఫాస్ట్" పథకంను ప్రారంభిస్తామన్నారు. విద్యార్థులందరు బాగా చదవండి, గురువుల మాట వినండి, మీ లక్ష్యాన్ని ఎప్పుడూ మర్చిపోకండి. మీరు మంచి స్థాయికి చేరితే, మీ కుటుంబం మాత్రమే కాదు, మీ గ్రామం కూడా గర్వపడుతుందని సూచించారు.తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి. కార్పొరేట్ పాఠశాలలకు తీసుకుపోకుండా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్య అందుతున్నదని వెల్లడించారు.తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు పంపే విధంగా కృషి చేయాలన్నారు.అనంతరం అగ్గనూర్ మరియు యాలాలలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి, గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# రెండో రోజూ భారీ నష్టాల్లో

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలు చవిచూశాయి. ఇరాన్- అమెరికా మధ్య చర్చలపై నీలినీడలు కమ్ముకోవడం, హర్మూజ్ వద్ద దిగ్బంధనం కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. చమురు ధర బ్యారెల్ మళ్లీ 100 డాలర్ల ఎగువకు చేరడం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ 850 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,200 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 77,983.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,516.49) నష్టాల్లో ప్రారంభమై.. రోజంతా అదే బాటలో పయనించింది. ఇంట్రాడేలో 77,574.18 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 852.49 పాయింట్ల నష్టంతో 77,664.00 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 205.05 పాయింట్ల నష్టంతో 24,173.05 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మళ్లీ 94 మార్కు దాటి 94.10కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, ఎల్అండ్‌టీ, సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, బీఈఎల్ మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4688 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బికాజీ ఫుడ్స్ అధినేత కన్నుమూత

దిల్లీ: బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు, ప్రమోటర్ శివ్ రతన్ అగర్వాల్ (75) గురువారం కన్నుమూశారు. ఈ మేరకు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. సాధారణ స్నాక్స్, స్వీట్స్ వ్యాపారాన్ని 'బికాజీ' పేరిట ఒక అంతర్జాతీయ బ్రాండ్‌గా అగర్వాల్ నెలకొల్పారని కంపెనీ పేర్కొంది. తనదైన వ్యూహాలతో కంపెనీకి బలమైన పునాదులు వేశారని, ఆయన అకాల మరణం కంపెనీకి తీరని లోటని తెలిపింది. రాజస్థాన్‌లోని బికనేర్‌లో జన్మించిన శివ్ రతన్ అగర్వాల్.. 1986లో తొలుత శివ్‌దీప్ ప్రొడక్ట్స్‌ను నెలకొల్పారు. 1993లో అదే బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్‌గా అవతరించింది. చదివింది ఎనిమిదో తరగతే అయినా బికనేర్ రుచులను తనదైన తయారీ, మార్కెటింగ్ వ్యూహాలతో అగర్వాల్ ముందుకు నడిపించారు. తద్వారా దేశంలోనే అతిపెద్ద ప్యాకేజ్డ్ స్నాక్స్ కంపెనీగా బికాజీని నిలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.13,430 కోట్లుగా ఉంది. భారత్‌తో పాటు ఇతర దేశాల్లోనూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తోంది. భూజియా, నామ్‌కిన్, స్వీట్లు, ప్యాకేజ్డ్ స్నాక్స్‌ను విక్రయిస్తోంది. 2022లో ఐపీఓకు వచ్చింది. 2024 ప్రపంచ ఫోర్బ్స్ బిలియనీర్ లిస్టులో అగర్వాల్ స్థానం సంపాదించారు.

# కార్పొరేట్ వారసుల హవా

హైదరాబాద్: భారత కార్పొరేట్ రంగంలో వారసుల హవా నడుస్తోంది. తమ పూర్వీకులు నిర్మించిన వ్యాపార సామ్రాజ్యాలను, కొత్తతరం యువతీ యువకులు విజయవంతంగా ముందుకు నడిపించడమే కాకుండా.. సంస్థ లాభాలు, మార్కెట్ విలువను మరో స్థాయికి పెంచుతున్నారు. 2020 మార్చి నుంచి 2026 మధ్య కాలంలో, వారసుల నేతృత్వంలోని 50 కంపెనీలు రూ.26.3 లక్షల కోట్ల వాస్తవ మార్కెట్ విలువను సృష్టించాయి. వీటి మొత్తం ఆదాయం రూ.8.2 లక్షల కోట్లు, వార్షిక నికర లాభం రూ.90,168 కోట్లుగా ఉన్నాయి. ఈ కంపెనీలు 8.6 లక్షల మందికి ఉపాధినివ్వడమే కాకుండా, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.1028 కోట్లు ఖర్చుపెట్టాయి.బుధవారం విడుదలైన '2026 ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియా సక్సెసర్స్ 50' జాబితా దీనికి సంబంధించి పలు విషయాలు వెల్లడించింది. కుటుంబ వ్యాపారాలను నడిపిస్తూ.. 2020 నుంచి 2026 మధ్య తమ సంస్థల మార్కెట్ విలువ వృద్ధిని గణనీయంగా పెంచిన 50 ఏళ్లలోపున్న రెండోతరం, తదుపరి వారసులను ఈ నివేదికలో పేర్కొన్నారు.



**హైదరాబాద్ కంపెనీలు..**

ఈ జాబితాలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 3 కంపెనీలు చోటు దక్కించుకున్నాయి. ఈ మూడింటి మార్కెట్ విలువ రూ.86,852 కోట్లు.

నవ: మౌలిక రంగానికి చెందిన ఈ కంపెనీకి, మూడోతరం వారసులైన అశ్విన్ దేవినేని (ఎండీ,సీఈఓ), నిఖిల్ దేవినేని (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్) నాయకత్వం వహిస్తున్నారు. వీరు తమ కంపెనీ వృద్ధిని 24.6 రెట్లు పెంచి, మొత్తం జాబితాలో 6వ స్థానంలో నిలిచారు.

లారస్ ల్యాబ్స్: ఔషధ రంగంలోని ఈ సంస్థ జాబితాలో 14వ స్థానాన్ని దక్కించుకుంది. రెండోతరం వారసులైన సౌమ్య చావ, కృష్ణ చైతన్య చావ (ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు) నేతృత్వంలో ఈ సంస్థ మార్కెట్ విలువ 16.2 రెట్లు పెరిగింది. 21 ఏళ్ల క్రితం స్థాపితమైన ఈ సంస్థ, జాబితాలోని అత్యంత పిన్న వయసున్న హై-గ్రోత్ కంపెనీల్లో ఒకటిగా నిలిచింది.

అవంతి ఫీడ్స్: వ్యవసాయ రంగంలో లావాదేవీలు నిర్వహిస్తున్న ఈ సంస్థకు రెండో తరం వారసుడైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట సంజీవ్ అల్లూరి దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సంస్థ 4.5 రెట్ల వృద్ధితో జాబితాలో 45వ ర్యాంకు సాధించింది.

అగ్రస్థానంలో వికాస్ లోహియా

ఈ జాబితాలో జూపిటర్ వ్యాగన్స్‌కు చెందిన రెండో తరం వారసుడు వికాస్ లోహియా అగ్రస్థానంలో నిలిచారు. ఆరేళ్లలో తన కంపెనీ మార్కెట్ విలువను ఏకంగా 152.8 రెట్లు పెంచారని నివేదిక వివరించింది. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్‌కు చెందిన నాలుగోతరం వారసుడు అమిత్ దహనుకర్, జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ మూడోతరం వారసుడు అభ్యుదయ జిందాల్ తమ కంపెనీల మార్కెట్ విలువను 52.5 రెట్లు చొప్పున పెంచి, రెండో స్థానం కైవసం చేసుకున్నారు.

సంపద సృష్టిలో కరణ్ అదాని

వాస్తవ సంపద సృష్టిని పరిగణనలోకి తీసుకుంటే, అదాని పోర్ట్స్ అండ్ సెజ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదాని రూ.2,67,525 కోట్ల అదనపు విలువ సృష్టించి, జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. రూ.42,149 కోట్ల కంపెనీని కరణ్ రూ.3,09,674 కోట్లకు చేర్చారు. సన్‌ఫార్మా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అలోక్ షాంఘ్వీ, విధి షాంఘ్వీ రూ.1,72,135 కోట్లు, హిందుస్థాన్ జింక్ ఛైర్‌పర్సన్ ప్రియా అగర్వాల్ హెబ్బార్ రూ.1,56,991 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మూలధనంపై రాబడి, ఆదాయ వృద్ధి ఆధారంగా రూపొందించిన పెర్ఫార్మెన్స్ ఇండెక్స్‌లో కోరమాండల్ ఇంటర్నేషన్‌లకు చెందిన అరుణ్ అలగప్పన్ (నాలుగోతరం) 7.0 స్కోరుతో మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు.

మహిళల జాబితాలో..

ఈ జాబితాలో 9 కంపెనీలకు చెందిన 10 మంది మహిళా వారసులు చోటు దక్కించుకున్నారు. కిర్లోస్కర్ బ్రదర్స్ జాయింట్ ఎండీ రమా కిర్లోస్కర్, లారస్ ల్యాబ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సౌమ్య చావ, సరేగామ ఇండియా వైస్ ఛైర్‌పర్సన్ అవర్ణ జైన్, ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్ అలిషా మూపెన్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ హోల్ టైం డైరెక్టర్ ఉజ్మా ఇర్ఫాన్ మొదటి అయిదు స్థానాల్లో ఉన్నారు. ముంబయి, దిల్లీదే రాజ్యం: భారత తదుపరి తరం వ్యాపార దిగ్గజాలకు ఎక్కువగా ముంబయి, దిల్లీ ఆవాసంగా మారింది. జాబితాలో 6 (12%) కంపెనీలు ఇక్కడే ఉన్నాయి. అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా తలా 5 కంపెనీలను కలిగి ఉన్నాయి.జాబితాలో అత్యంత పిన్నవయస్కుడిగా చైతన్య జలాన్ (మూడో తరం, రామకృష్ణ ఫోర్జింగ్స్) నిలిచారు. జాబితాలో సగటు వయసు 42గా ఉంది. 'దేశంలో ప్రస్తుతం వ్యవస్థాపకుల నుంచి వారి వారసులకు భారీ స్థాయిలో వ్యాపార బదిలీ జరుగుతోంది. ఈ నాయకులు మూలధనాన్ని సమర్థంగా వినియోగిస్తూ, ఆవిష్కరణలతో పాటు పటిష్ఠమైన గవర్నెన్స్ జోడించి, దేశ ఆర్థిక ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నారు' అని ఆస్క్ ప్రైవేట్ వెల్త్ సీఈఓ రాజేష్ సలుజా, హురున్ ఇండియా వ్యవస్థాపకులు అనస్ రెహ్మాన్ జునైద్ పేర్కొన్నారు.


## వాట్సప్‌లో మొబైల్ ప్రీపెయిడ్ రీఛార్జి సదుపాయం

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ కొత్త సదుపాయం తీసుకొచ్చింది. భారత్‌లోని వాట్సప్ యూజర్లు యాప్‌లోనే మొబైల్ ప్రీపెయిడ్ రీఛార్జి చేసుకునే వెసులుబాటును తెచ్చింది. ఇందుకోసం పేయూతో జట్టుకట్టింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు దశలవారీగా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వాట్సప్ వెల్లడించింది. జియో, ఎయిర్‌టెల్, వీఐ.. ఇలా ఏ నెట్‌వర్క్ వినియోగదారులైనా సంబంధిత ప్లాన్ ఎంపిక చేసుకుని చెల్లింపులు చేయొచ్చు.భారత్‌లోని వినియోగదారులు తమ రోజువారీ టాస్కులను సులువుగా చేసుకునేందుకు వీలుగా మొబైల్ రీఛార్జి సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు మెటా ఇండియా డైరెక్టర్ రవి గార్గ్ పేర్కొన్నారు. మొబైల్ రీఛార్జి కోసం వేర్వేరు యాప్‌లపై ఆధారపడకుండా వాట్సప్‌లోనే రీఛార్జిని ఎంపిక చేసుకుని పేమెంట్ కూడా చేసే వెసులుబాటును తెచ్చినట్లు వెల్లడించారు. దీంతో పాటు రూపీ సింబల్‌ను కూడా హోమ్‌స్క్రీన్‌లో కనిపించేట్లు వాట్సప్ అందుబాటులోకి తెచ్చింది.వాట్సప్‌లో మొబైల్ రీఛార్జి చేయాలంటే తొలుత రూపీసింబల్‌పై క్లిక్ చేయాలి. అక్కడ మొబైల్ ప్రీపెయిడ్ రీఛార్జి ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. అందులో మీది గానీ, మీ కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్ గానీ ఎంటర్ చేయాలి. ఆపరేటర్‌ను ధ్రువీకరించుకున్నాక మీకు నచ్చిన మొబైల్ రీఛార్జి ప్లాన్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. యూపీఐ, డెబిట్‌కార్డు, క్రెడిట్ కార్డు సాయంతో చెల్లింపులు చేయొచ్చు. వాట్సప్‌లో ఇప్పటికే యూపీఐ చెల్లింపులు, మెట్రో టికెట్ బుకింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

## భారత్ సమయం ఆసన్నమైంది:నీతా అంబానీ

న్యూయార్క్: భారత్ సమయం అసన్నమైందని రిలయన్స్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నీతా అంబానీ అన్నారు. న్యూయార్క్‌లో టైమ్ మ్యాగజైన్ నిర్వహించిన టైమ్ 100 సమిట్‌లో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. టైమ్ మ్యాగజైన్ సీఈఓ జెస్సికా సిబ్లీతో జరిగిన ఇంటర్వ్యూలో నాయకత్వం అంశంపై నీతా మాట్లాడుతూ.. ప్రపంచానికి హార్డ్‌పవర్ అక్కర్లేదని, అది సాఫ్ట్ పవర్‌ను కోరుకుంటోందన్నారు. ఆ సాఫ్ట్ పవర్‌కు భారత్ ప్రతినిధిగా ఉందని పేర్కొన్నారు. పూర్తి ఇంటర్వ్యూ త్వరలో ప్రసారం కానుంది. ఈ లీడర్ షిప్ సమ్మిట్‌కు భారత సంప్రదాయ దుస్తుల్లో నీతా అంబానీ హాజరయ్యారు. భారత కళా వైభవాన్ని చాటి చెప్పేలా 'జమ్దానీ' చీరను ధరించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత బీరేన్ కుమార్ బాసక్ రెండేళ్లు కష్టపడి దీన్ని రూపొందించారు.




# మాకొద్దీ అమెరికా..

## 'అమెరికాను వీడి వెళ్లిపోదాం ఇక'.. 40శాతం మంది భారతీయుల ఆలోచన..!

**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండో దఫా హయాంలో అనుసరిస్తున్న విధానాలపై సర్వత్రా వ్యతిరేకత ఎదురవుతోంది. ముఖ్యంగా 'అమెరికా అమెరికన్లకు మాత్రమే' అన్న నినాదం వలసదారులను ఇబ్బంది పెడుతోంది. దీంతో చాలా మంది విదేశీ సంతతి పౌరులు అగ్రరాజ్యాన్ని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా నుంచి శాశ్వతంగా వెళ్లిపోవాలని ప్రతి పది మంది ఇండియన్-అమెరికన్లలో నలుగురు ఆలోచిస్తున్నట్లు తాజాగా ఓ సర్వేలో వెల్లడైంది. అమెరికాలో జీవన విధానాలు, ట్రంప్ ప్రభుత్వ తీరుపై అంతర్జాతీయ సంస్థ కార్నెగీ ఎండోమెంట్ ఇటీవల సర్వే నిర్వహించింది. ఇందులో 40శాతం మంది ఇండియన్-అమెరికన్లు అగ్రరాజ్యాన్ని శాశ్వతంగా వీడేందుకు తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు తేటతెల్లమైంది. 'రాజకీయ అస్థిరత' వల్లే తాము అమెరికా నుంచి వెళ్లిపోవాలని అనుకుంటున్నట్లు వీరిలో 58శాతం మంది చెప్పినట్లు సర్వే తెలిపింది. రెండో దఫాలో ట్రంప్ పాలనపై తాము అసం టతృప్తిగా ఉన్నామని 71శాతం ఇండియన్-అమెరికన్లు వెల్లడించారు. 2024-25 నాటి గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం 54 లక్షల మందికి పైగా భారతీయులు అమెరికాలో నివసిస్తున్నారు. అగ్రరాజ్య మొత్తం జనాభాలో వీరు 1.5శాతానికి సమానం కావడం గమనార్హం.



**25శాతం తగ్గిన హెచ్-1బీ వీసాలు..**

ఇదిలా ఉండగా.. ట్రంప్ అధికారంలోకి రాగానే వలస విధానాలను కఠినతరం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆంక్షలతో సరిహద్దులో అక్రమ వలసల కంటే కూడా.. అమెరికాలోకి చట్టబద్ధ వలసలే భారీగా తగ్గాయట. ఈ మేరకు అగ్రరాజ్య మేధో సంస్థ క్యాటో ఇనిస్టిట్యూట్ సర్వే వెల్లడించింది. ముఖ్యంగా హెచ్-1బీ వీసాల జారీలో భారీ తగ్గుదల నమోదైనట్లు తెలిపింది."ట్రంప్ అధికారంలోకి రాక ముందు నుంచే అక్రమ వలసలు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాలనలోనూ ఆ ట్రెండ్ కొనసాగింది. అయితే, దీనికి భిన్నంగా చట్టబద్ధ వలసలు గతంతో పోలిస్తే భారీగా తగ్గాయి. అత్యధికంగా హెచ్-1బీ వీసాలపైనే ఈ ప్రభావం ఎక్కువగా కన్పించింది. గత సంవత్సరంలో ఈ వీసాల జారీ 25శాతం మేర తగ్గింది. ఇక, లక్ష డాలర్ల ఫీజు అమల్లోకి వచ్చిన తర్వాత హెచ్-1బీ వీసాల కోసం కంపెనీల నుంచి పిటిషన్లు ఏకంగా 87శాతం తగ్గాయి. అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో హెచ్-1బీ వీసాలు మరింతగా తగ్గొచ్చు" అని సర్వే అంచనా వేసింది. సోషల్ మీడియా వెట్టింగ్ తదితర ఆంక్షల కారణంగా విద్యార్థి వీసాలు కూడా 40శాతం మేర తగ్గినట్లు సర్వే వెల్లడించింది.

## లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ ముఠాలను పాక్ అణిచివేయాలి

వాషింగ్టన్(జనంసాక్షి):లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర ముఠాలను పాక్ అణిచివేయాలని అమెరికా కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్‌షెర్మన్ పిలుపునిచ్చారు. గతేడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడితో ఈ బృందాలకు సంబంధం ఉన్నట్టు ఆరోపించారు. భారతీయ ఎంబసీ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో ఆయన మాట్లాడారు. 'హ్యూమన్ కాస్ట్ ఆఫ్ టెర్రరిజం' పేరిట భారత రాయబార కార్యాలయం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉగ్రవాదం వల్ల సామాన్యులకు కలిగే నష్టం గురించి ఆయన ప్రసంగించారు. పహల్గాం దాడిని గుర్తు చేసుకుంటూ.. "అమాయకులను లక్ష్యంగా చేసుకొని ఈ దారుణానికి ఒడిగట్టారు. మతాన్ని దృష్టిలోపెట్టుకొని దాడి చేశారు. ఈ సందర్భంగా పాక్ ప్రభుత్వానికి నేను ఒక్కటే చెప్పదలచుకున్నాను. పహల్గాం ఘటనతో సంబంధం ఉన్న లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్రబృందాలను అణిచివేయాలి అని మనందరం కలిసి డిమాండ్ చేద్దాం" అని పిలుపునిచ్చారు. ఈ డిజిటల్ ఎగ్జిబిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన అతిపెద్ద ఉగ్రదాడులను ప్రదర్శించారు. 1993లో ముంబయిలో జరిగిన బాంబు పేలుళ్లు 2008లో ముంబయిలో ఉగ్రదాడి, పహల్గాం దాడికి సంబంధించిన చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు. అమెరికాలో భారత రాయబారిగా వ్యవహరిస్తోన్న వినయ్ మోహన్ క్వాత్రా మాట్లాడుతూ "మనందరం కొన్ని విషయాలు గుర్తుచేసుకోవడానికి ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశాం. ఉగ్రవాదం మన సమాజానికి అపార నష్టం కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఒక్కటై ఐకమత్యంతో మెలగాలి. అనంతరం ఉగ్రవాదం అనే భూతాన్ని తరిమికొట్టాలి" అని పేర్కొన్నారు.



# ఆ జలసంధిలో.. ఒక్కచోటే 124 నౌకల శకలాలు

న్యూఢిల్లీ:అంతర్జాతీయ సరకు రవాణాలో జలసంధి పాత్ర ఎంత కీలకమో హర్మూజ్ పరిణామాలతో స్పష్టమైంది. అలాంటి మరో కీలక జలసంధికి సంబంధించి ఓ ఆసక్తికర వార్త తాజాగా బయటికొచ్చింది. ఐరోపా, ఆఫ్రికాను వేరుచేసే 'జిబ్రాల్టర్ జలసంధిలో ఓ చోట 124 నౌకల శకలాలను పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిల్లో అత్యంత పురాతన ఓడల నుంచి ఆధునిక నౌకల శకలాలు వరకు ఉన్నాయని శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో వెల్లడించారు.స్పెయిన్‌కు చెందిన కొందరు పురావస్తు శాస్త్రవేత్తలు 2020-2023 మధ్య సర్వే చేశారు. నీటి అడుగున ఉన్న పురావస్తు ప్రాంతాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే జిబ్రాల్టర్ జలసంధిలోని 29 స్క్వేర్‌మైల్ బే వద్ద 124 నౌకల శకలాలను గుర్తించారు. ఇందులో అతిపురాతన ప్యూనిక్ నాగరికత, రోమన్, మధ్యయుగం నాటి నౌకల శకలాలు కూడా ఉన్నట్లు శాస్త్రవేత్తలు తమ రీసెర్చ్ పేపర్‌లో పేర్కొన్నారు.ఇందులో ఒకటి 5వ శతాబ్దం నాటి నౌక అని గుర్తించారు. అప్పట్లో ఆ నౌకలో స్పెయిన్‌లో ఉత్పత్తి చేసిన చేపల సాస్‌ను రవాణా చేసి ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. రెండో ప్రపంచయుద్ధంలో ఇటలీ నౌక ఉపయోగించిన ఓ సబ్‌మెరైన్ శకలాన్ని కూడా ఈ ప్రాంతంలోనే గుర్తించారు. ఈ బృందం నీటి లోపల కేవలం 10 మీటర్ల లోతు వరకే అధ్యయనం చేసిందట. ఈ ప్రాంతం మొత్తం లోతు దాదాపు 400 మీటర్లు ఉంటుందని, ఇంకా లోపలికి వెళ్తే మరిన్ని ఆసక్తికర విషయాలు బయటపడొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. హర్మూజ్ మాదిరిగానే 'జిబ్రాల్టర్' కూడా సన్నని పొడవైన జలసంధి. దాదాపు 36 మైళ్ల పొడవుండే ఈ జలమార్గం అట్లాంటిక్ మహా సముద్రం, మధ్యధరా సముద్రాన్ని కలుపుతుంది. ఈ జలసంధి ఓ ప్రాంతం వద్ద కేవలం 8 మైళ్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. అంతర్జాతీయ సరకు రవాణాలో ఇది కూడా ఓ ప్రధాన జలమార్గం. రోజుకు సగటున 300 నౌకలు జిబ్రాల్టర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి.

# బెంగాల్‌లో అధికారం మాదే

కానీ ఆ ఝల్ (మసాలా) టిఎంసిని తాకింది' అని అన్నారు. బెంగాల్ ప్రజలు టిఎంసి పాలనను వ్యతిరేకిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టులను వ్యతిరేకించారు. ఇప్పుడు టిఎంసి జంగిల్ రాజ్ కి వ్యతిరేకంగా నిలబడ్డారు. దీనికి అణచివేతదారులు, అవినీతిపరులే జవాబుదారీగా ఉంటారు. మా మంత్రం సబ్కా సాథ్, సబ్కా వికాస్ అని మీకు తెలుసు. మే 4వ తేదీ తర్వాత పశ్చిమ బెంగాల్లో సుపరిపాలనకు కొత్త హామీ ప్రారంభం కానుందని అన్నారు. మతువా సమాజం, నమశ్రూద సమాజం, శరణార్థి కుటుంబాలు టిఎంసికి భయపడాల్సిన పనిలేదు. మీకు ఎవరు హానీ చేయలేరు. ఆశ్రయం, గౌరవం కోరుతూ భారతదేశానికి వచ్చిన వారందరికీ తాను అండగా నిలుస్తారని మోడీ హామీనిచ్చారు. బెంగాల్లో ఏర్పడే బిజెపి ప్రభుత్వం సిఎఎ కింద పౌరసత్వం మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. మంజూరు చేసే పక్రియను వేగవంతం చేస్తోందని మోడీ అన్నారు. దేశంలోని ప్రతి భారత పౌరుడికి దక్కాల్సిన ప్రతి హక్కు, ప్రయోజనం మీకు లభిస్తుందని మోడీ హామీనిచ్చారు. నేడు బెంగాల్లో మొదటి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. నేడు తమిళనాడులో కూడా జరుగుతున్నాయి. ఓటర్లందరికీ శుభాకాంక్షలు. ఈసారి ప్రతి ఒక్కరూ కొత్త ఓటింగ్ రికార్డులు సృష్టించాలని మోడీ ఓటర్లను కోరారు. బెంగాల్ లో గత 50 ఏళ్లలో హింసను కనిష్ట స్థాయికి పరిమితం చేసిన మొదటి ఎన్నిక ఇదే అని మోడీ చెప్పారు. లేకపోతే, ఇక్కడ ప్రతి వారం ఎవరో ఒకరిని ఉరితీయడం, దానిని ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించడం చేసేవారు. ఒకరకమైన గూండాల పాలన ప్రబలింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరోసారి నిలబెట్టినందుకు ఎన్నికల సంఘానికి తాను హృదయపూర్వక అభినందలు తెలిపారు.

## రాహుల్ గాంధీతో టీపీసీసీ చీఫ్ భేటీ..

ఆర్గనైజేషన్ కార్యక్రమాలు, డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీల నియామకాలను రాహుల్‌కు వివరించారు.తెలంగాణలో కులగణన సమాచారాన్ని ప్రకటించినట్లు తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో బీసీ రిజర్వేషన్లనూ జోడించాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. రాబోయే ఏఐసీసీ జాతీయ ఓబీసీ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరారు. రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## రచయితలు, మేధావుల అభిప్రాయాలను గౌరవిస్తాం

గౌరవిస్తాం కానీ.. వాటిని వ్యక్తిగతమైనవిగానే పరిగణిస్తాం పరిగణిస్తాం. ఇవన్నీ న్యాయపరమైన నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపవు" అని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ.. వాట్సప్ యూనివర్సిటీ నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రం అంగీకరించలేమని చమత్కరించారు.

# ఇరాన్‌లో ఎవరి మాట చెల్లుతోంది?

## సైనిక, రాజకీయ నేతల సంఘర్షణ

టెహ్రాన్:యుద్ధంపై ఇరాన్ ప్రభుత్వంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయా? అతివాదులు, మితవాదుల మధ్య ఇరాన్ ఎటూ తేల్చుకోలేకపోతోందా? "ఇరాన్ ప్రభుత్వంలో చీలికలు తీవ్రంగా ఉన్నాయి. ఆ దేశ నేతలు, ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి, ఉమ్మడి ప్రతిపాదన చేసేందుకు వీలుగా సమయమిస్తున్నాం".. కాల్పుల విరమణ గడువు పొడిగింపు ప్రకటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలివి. ఆయన వ్యాఖ్యలు కొంతవరకు వాస్తవమే! యుద్ధాన్ని కొనసాగించడం, హర్మూజ్‌ను తెరవడం వంటి అంశాల్లో టెహ్రాన్ రాజకీయ, సైనిక నాయకత్వం మధ్య ఏకాభిప్రాయం లేదు!! సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తెరవెనుక పాత్రకే పరిమితమవుతున్న వేళ ఐఆర్‌జీసీ చీఫ్ అహ్మద్ వాహిదీ దేశంలో ఇప్పుడు అత్యంత శక్తిమంతమైన వ్యక్తుల్లో ఒకరిగా ఎదిగారు. ఐఆర్‌జీసీ- ఇరాన్‌లో అత్యంత శక్తిమంతమైన వ్యవస్థ. నిఘా నెట్‌వర్క్‌గా, ప్రాంతీయ పవర్ బ్రోకర్‌గానూ పనిచేస్తుంది. ప్రస్తుత యుద్ధంలో పలువురు సీనియర్ నేతలు మరణించి, సంప్రదాయ వ్యవస్థలు బలహీనపడటంతో.. ఇరాన్‌పై తన పట్టును ఐఆర్‌జీసీ మరింత పెంచుకుంది. దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్, అబ్బాస్ అరాగ్చీ వంటి రాజకీయ నాయకులు ప్రజల్లో ఉంటూ పాలనా విధులు నిర్వర్తిస్తున్నట్లు కనిపిస్తున్నా.. వారికున్న వాస్తవాధికారాలు తక్కువే! కాల్పుల విరమణ, యుద్ధం ముగింపునకు అరాగ్చీ వంటి నేతలు మొగ్గుచూపుతున్నా.. అమెరికా బలగాలు దిగ్బంధనాన్ని ఉపసంహరించుకునే వరకూ ఆ దిశగా అడుగులు వేయొద్దని వారిని ఐఆర్‌జీసీ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఐఆర్‌జీసీ వ్యవస్థాపక సభ్యుల్లో అహ్మద్ వాహిదీ ఒకరు. యుద్ధం ఆరంభంలోనే అమెరికా-ఇరాన్ దాడుల్లో అప్పటి ఐఆర్‌జీసీ చీఫ్ మరణించడంతో..వాహిదీ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. మిలిటరీ ఆపరేషన్లకు పరిమితం కాకుండా.. కాల్పుల విరమణ సంప్రదింపులు సహా పలు వ్యూహాత్మక నిర్ణయాల్లో ఘర్షణాత్మక ధోరణితోనే ఆ దేశం ముందుకెళ్లేలా తనదైన ముద్ర వేశారు.

**సంతకం చేసేదెవరు?**

సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రస్తుతానికి తిరుగులేని నేతగా ఏమీ వ్యవహరించడం లేదు. సమష్టి నాయకత్వ ఫ్రేమ్‌వర్క్‌తోనే ఆయన ముందుకెళ్తున్నారు. ఈ పరిస్థితుల్లో అమెరికాతో శాంతి ఒప్పందం కుదిరినా.. దానిపై ఇరాన్ తరఫున ఎవరు సంతకం చేస్తారన్నదానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. ప్రభుత్వ నిర్ణయాలను తోసిరాజనే శక్తి ఐఆర్‌జీసీకి ఉండటం అందుకు ప్రధాన కారణం.





# 'అక్షరాలవైపు' కాదు.. ఆకాశం వైపు

లాలాపేట ప్రాథమిక పాఠశాల ప్రస్తుతం అత్యంత దయనీయ స్థితిలో ఉంది. ఇక్కడ 19 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలమై, వర్షం పడినప్పుడల్లా పైకప్పు నుండి పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తల్లిదండ్రులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే వంటశాలే పాఠశాలగా మార్చుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి, పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టడమో లేదా నూతన భవనాన్ని మంజూరు చేయడమో చేయాలని కోరుతున్నాము. తద్వారా విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించి, బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచే అవకాశం కలుగుతుంది.



**అరుంధతి, ఉపాధ్యాయురాలు,**
లాలాపేట ప్రాథమిక పాఠశాల

## బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు

### భవనాలు శిథిలావస్థకు చేరడంతో నిత్యం భయం భయం

- వంటశాలే గదినే పాఠశాల గదిగా మార్చుకున్న వైనం..
- రంగారెడ్డి జిల్లా లాలపేట గ్రామ పాఠశాలల్లో నెలకొన్న దుస్థితి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/కొందుర్గ్/(జనంసాక్షి) :** పాఠశాలకు వచ్చినప్పటినుండి ఆ విద్యార్థులు అక్షరాల వైపు కాకుండా ఆకాశంలో ఉన్న మేఘాల వైపు చూస్తుంటారు ఎందుకంటే చిన్నపాటి గాలివాన వర్షం వచ్చిన పాఠశాల భవనం ఎప్పుడు కూలి మీద పడుతుందో తెలియని భయంకరమైన స్థితిలో భయ భయంగా చదువును కొనసాగిస్తున్నారు విద్యార్థులు వేసవి కాలం కావడంతో చెట్ల కిందే చదువులు కొనసాగిస్తున్నారు ఇకా వర్షా కాలం వస్తే పరిస్థితి ఏమిటనే భయాందోళన విద్యార్థులకు ఉపాధ్యాయులకు గ్రామస్తులకు నెలకొంది రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లాలపేట గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఈ దుస్థితి వెలుగులోకి వచ్చింది..

ఆ ఊరి పిల్లలకు అక్షరాలు నేర్చుకోవాలంటే భయం.. బడికి పంపాలంటే తల్లిదండ్రులకు వణుకు.. కురిసే ప్రతి వాన చినుకు వారి పాలిట శాపంగా మారుతోంది. ఇది రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లాలపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిత్య కృత్యం. 'మన ఊరు – మన బడి' వంటి ఆర్భాటపు నినాదాలు వినిపిస్తున్నా, ఈ బడి పిల్లల తలరాత మాత్రం మారడం లేదు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులు ఎప్పుడు ఎవరి నెత్తిన పడతాయో తెలియని దుస్థితి నెలకొంది పైకప్పు నుంచి సిమెంటు పెచ్చులు ఊడిపడుతుంటే, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

ఆకాశం మేఘావృతమైందంటే చాలు.. ఆ పాఠశాలలో చదువు ఆగిపోవాల్సిందే. వర్షం వస్తే తరగతి గదులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో చేసేది లేక ఉపాధ్యాయులు వంటశాలనే క్లాస్ రూమ్‌గా మార్చేశారు. పోపుల పెట్టెలు, గిన్నెల మధ్యే విద్యార్థులు కూర్చుని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాల రూమ్ కంటే వంటశాలే సేఫ్ అని భావించే స్థాయికి ఆ భవనం చేరుకోవడంతో పాటు పాఠశాల భవనానికి ఉన్న కిటికీలు డోర్లు ఊడిపోయే స్థితిలోకి చేరుకున్నాయి

**ప్రతిభ ఉన్నా.. వసతులు లేవు**

సౌకర్యాలు లేకపోయినా ఇక్కడి విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూనే ఉన్నారు. పాఠశాలలో ఉన్న మొత్తం 19 మంది విద్యార్థుల్లో.. ఏకంగా నలుగురు విద్యార్థులు గురుకులాలకు ఎంపిక కావడం విశేషం. ఉపాధ్యాయుల కష్టానికి విద్యార్థుల ప్రతిభ తోడై ఫలితాలు వస్తున్నా, ప్రభుత్వం మాత్రం కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతోంది..

**తల్లిదండ్రుల ఆవేదన**

"పిల్లల్ని బడికి పంపాలంటేనే భయమేస్తోంది. చదువుకోవడానికి పంపిస్తే, ఎక్కడ స్లాబ్ పడి ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎదురుచూస్తున్నాం" అని లాలపేట గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని, నాయకులు వచ్చి హామీలు ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిభ గల విద్యార్థులు ఉన్న ఈ బడికి కొత్త భవనం మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఏదైనా ప్రమాదం జరిగాక స్పందించడం కంటే, ముందే మేల్కొని లాలపేట పాఠశాలకు శాశ్వత భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు..

# రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

### సిఎం చొరవతో జరుగుతున్న పనుల పురోగతిపై ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ సమీక్ష

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 22 (జనంసాక్షి) :



దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై హైదరాబాదులో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్,ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు, వీటీఏడీఏ వైస్ చైర్మన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం వేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి విస్తరణ పనులపై సవివరంగా చర్చించమన్నారు. ఇందులో భాగంగా ఈ దశలో చేయాల్సిన పనులను గుర్తించి సవివరంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ అధికారులకు సూచించమన్నారు. దీనికి అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారన్నారు. ఆలయ అభివృద్ధి పనులపై మరోసారి శృంగేరి పీఠం జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి స్వామి వారి దగ్గరకు వెళ్లాలని నిర్ణయించమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని ఆయన తెలిపారు.గతంలో సమ్మక్క సారక్క జాతర సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై ఆరా తీశారని అయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సూచనలు,సలహాలతో అతి త్వరలోనే రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని విప్ తెలిపారు. ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఆర్ అండ్ బీ అధికారులు,ఆర్కిటెక్చర్, స్థపతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భళా నితేష్.. భళా!

- పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చిన విద్యార్థి..
- ఉపాధ్యాయుల ఔదార్యంతో సైకిల్ అందుకున్న నితేష్
- వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలి
- ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి



**బొంరాస్ పేట, ఏప్రిల్ 23 (జనం సాక్షి):** మండల పరిధిలోని పాఠశాలలకు వేసవి సెలవులు శుక్రవారం నుండి ప్రభుత్వము ప్రకటించడంతో గురువారము విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.మండల పరిధిలోని ఏర్పుమల్ల ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు 3వ తరగతికి చెందిన విద్యార్థి నితేష్ పట్ల ఔదార్యాన్ని చాటుకున్నారు. పాఠశాలకు ప్రతిరోజు 5 కిలోమీటర్ల పరిధిలోని సీత్యానాయక్ తండా నుండి నడుచుకుంటూ వస్తూ అత్యధికంగా హాజరు శాతం నమోదు చేయడమే కాకుండా అత్యధిక మార్కులు సాధించి 3వ తరగతి టాపర్ గా నిలిచిన నితేష్ అనే విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి,ఉపాధ్యాయులు సర్దార్,ప్రశాంత్ సొంత డబ్బులతో సైకిల్ కొనుగోలు చేసి గురువారం పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన సర్పంచ్ బందెయ్య,ఉప సర్పంచ్ తిరుపతయ్య పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్ చేతులమీదుగా విద్యార్థికి సైకిల్ ను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి చదువుకోవాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మె సంపూర్ణం





- రెండో రోజు విధుల్లో చేరని కార్మికులు
- అద్దె డ్రైవర్లు కండక్టర్లు పోలీస్ బందోబస్తు మధ్య తిరిగిన కొన్ని బస్సులు
- ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అరెస్ట్
- టెంట్ యజమానులకు బెదిరింపులు ఒక కేసు నమోదు
- ఆర్టీసీ కార్మికులపై చేయి చేసుకున్న పరిగి డి.ఎస్.పి
- ప్రభుత్వ ప్రకటన వెలుబడకపోతే మూడో రోజు సమ్మెకు రెడీ

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 23 (జనం సాక్షి):** హక్కుల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె రెండవ రోజు సంపూర్ణంగా జరిగింది. రెండో రోజు ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రయాణికులు ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమయానికి బస్సులు లేకపోవడంతో రోడ్లపై ఎండలో గంటల తరబడి చంటి పిల్లలతో నిల్చో వలసిన పరిస్థితి నెలకొంది. విద్యాశాఖ విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించడంతో సుధూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేట్ వాహనాల్లో కొందరు తల్లిదండ్రులు విద్యార్థులను ఇంటికి చేర్చారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా ఆధ్వర్యంలో వికారాబాద్ ఆర్టీసీ బస్ డిపో దగ్గర భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ స్నేహమేహ్రా పరిగి తాండూర్ వికారాబాద్ డిపోల దగ్గర బందోబస్తు విషయమై సమీక్షించారు. ఎలాంటి గొడవలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ డ్రైవర్ రెగ్యులర్ కండక్టర్లు డ్రైవర్లు గురువారం రెండవ రోజు జరిగిన సమ్మెలో పాల్గొన్నారు. తమ సమస్యలే సాధనగా ఒక్క ఆర్టీసీ కార్మికుడు కూడా విధుల్లోకి చేరలేదు. కానీ ఆర్టీసీ సమ్మెను విరమింప చేయడానికి అధికార యంత్రాంగం అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆర్టీసీ కార్మికులు బస్సు డిపోల ముందు సమ్మె చేయకుండా పోలీసులు పూర్తిగా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. మండుతున్న ఎండల్లో ఆర్టీసీ కార్మికులు సమ్మెకు పూనుకున్న కారణంగా వారి కనీస అవసరాల కోసం టెంట్లు వేసుకోవడానికి పోలీసులు అనుమతించడం లేదు. అలాగే సమ్మె కారణంగా సమావేశాలు నిర్వహించకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్లు సామాన్లు ఫంక్షన్ హాల్స్ కమ్యూనిటీ హాల్స్ కన్వెన్షన్ హాల్స్ ఇవ్వవద్దని ఆయా యజమానులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. తాండూర్‌లో ఎస్ఎస్ టెంట్ హౌస్ యజమానిపై పోలీసుల కేసు నమోదు చేశారు. ఈ విషయమై సర్వత్ర చర్చ జరుగుతుంది. అయినా ఆర్టీసీ కార్మికులు బస్సు డిపోల దగ్గర ఉన్న ప్రహరీ గోడల దగ్గర ఎండలో నిలుచని సమ్మె చేస్తున్నారు. పరిగి డిపో నుంచి ఆర్టిసి బస్సులను పోలీసులు బయటకు పంపిస్తే ఆర్టీసీ కార్మికులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు కార్మికుల మధ్య వాగ్వివాదంతో పాటు తోపులాట జరిగింది. ఒకింత సహనం కోల్పోయిన పరిగి డిఎస్పి ఆర్టీసీ కార్మికులపై చేయి చేసుకున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ముఖ్య ప్రాంతాలకు బస్సులను తెంపే ప్రయత్నం చేస్తున్నారు. రెండో రోజు ఆర్టీసీ సమ్మె కారణంగా అధికారులు 96 బస్సులను తిప్పినట్లు తెలియజేశారు. పరిగిలో 36 వికారాబాద్ లో 27 తాండూర్ డిపోలో 33 బస్సులను వివిధ ప్రాంతాలకు తిప్పి ప్రయాణికులను చేరవేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగతా బస్సులను తిప్పడానికి ఆర్టిసి అధికారుల దగ్గర డ్రైవర్లు కండక్టర్లు లేరు. ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్ దగ్గర పనిచేస్తున్న డ్రైవర్లను విధుల్లో చేరాలని ఆర్టిఏ ఆర్టిసి డిఎంలు వత్తిడి చేస్తున్నారు. సమ్మె విరమించుకొని వెంటనే విధుల్లో చేరకపోతే తమ దగ్గర ఉన్న ఔట్సోర్సింగ్ డ్రైవర్ల లైసెన్సులను రద్దు చేస్తామని బెదిరించినట్లు తెలుస్తోంది. కాగా లైసెన్సుల కోసం ఆర్టిఏ ఆఫీస్ కు వచ్చిన డ్రైవర్ల సహకారంతో ఆర్టీసీ బస్సులను నడపడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం అద్దె కండక్టర్లు డ్రైవర్లతో పాక్షికంగా బస్సులు వేళలు పాటించకుండా తిరుగుతున్నాయి. కాగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బి.ఆర్.ఎస్ పార్టీ మద్దతు ప్రకటించింది. వికారాబాద్ ఆర్టిసి బస్ డిపో ముందు సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా ఆందోళనకు దిగారు. దీంతో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తోపాటు బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద పటేల్ ఇతర బి ఆర్ ఎస్ నాయకులను వికారాబాద్ పోలీస్ పోలీసులు అరెస్టు చేసి ధారూర్ స్టేషన్ కు తరలించారు. అరెస్టుల సందర్భంగా ఆర్టీసీ డిపో ముందు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

## రికాన్ ఆయిల్ నుంచి అందుబాటులో 'మంగళమై' దీపం నూనె

ఖైరతాబాద్ : హైదరాబాద్ రికాన్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ యొ క్క ప్రముఖ ప్రీమియం తినదగిన, దీప నూనెల తయారీదారు తన ప్రసిద్ధ 'మంగళమై' దీపం, దియా నూనెను ఇప్పుడు జెప్టో, స్విగ్గీ ఇన్ మార్ట్, బిగ్ బా స్కెట్లలో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# గ్రామీణ యువతలో దాగిన ప్రతిభను వెలికితీయాలి

### ప్రతి గ్రామంలో శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం అందిస్తా : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**యాచారం, ఏప్రిల్ 23 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండలం కురుమిద్ద గ్రామంలోని యంబి కర్మెల్ ప్రార్థనా మందిరంలో గత మూడు సంవత్సరాలుగా యువతీ యువకులకు ఉచితంగా అందించిన స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావడంతో గురువారం సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అంతకుముందు అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ – గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని, ఈ శిక్షణతో యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇలాంటి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు కావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వ పరంగా అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎమ్మాస్ మినిస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రెవరెండ్ డాక్టర్ బీసీ పాల్ మాట్లాడుతూ – కందుకూరు ప్రాంతంలో సంస్థ గత 27 సంవత్సరాలుగా పేదవారి అభివృద్ధి కోసం నిరంతర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కుట్టుమిషన్ శిక్షణ, ఉచిత కంప్యూటర్ విద్య, ఉచిత వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అనాథ పిల్లల కోసం అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేసి వారికి ఆశ్రయం కల్పిస్తూ భవిష్యత్తు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించి బీదవారి అభివృద్ధికి తమవంతు సహకారం కొనసాగిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు, ఏసీపీ కేవీపీ రాజు, సీనియర్ పాస్టర్ రెవరెండ్ జి. డేవిడ్‌రాజ్, ఎమ్మాస్ మినిస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ డాక్టర్ ఎస్. దేవకుమార్, క్రిస్టఫర్ సత్యరాజ్, ట్రెజరర్ కె. ఆనంద్‌ప్రేమ్‌రాజ్, గ్రామ పాలకవర్గ సభ్యులు, సంఘస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# సైకిళ్లతో స్వావలంబన బాట

- బ్యాంక్ ఆఫ్ ఇండియా సీఎస్ఆర్ కింద 500 మంది విద్యార్థినులకు ఉచిత సైకిళ్ల పంపిణీ
- వనపర్తి జెడ్పీ బాలికల పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని ఎంపీ హామీ
- లిఫ్ట్‌కు రూ.10 లక్షలు, కాంపౌండ్ వాల్‌కు రూ.5 లక్షలు మంజూరు చేయిస్తాం: మల్లు రవి
- 6,000 మంది విద్యార్థినులకు సైకిళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటాం : ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 23 జనంసాక్షి :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందని, విద్యార్థులు బాగా చదువుకుంటే మంచి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ బాలికల పాఠశాలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద విద్యార్థినులకు 500 సైకిళ్ళు అందజేత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మల్లు రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీతో పాటుగా ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ మనోజ్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ – వనపర్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిసి ఆశ్చర్యానికి గురయ్యానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో వెయ్యి మంది చదవడం గొప్ప విషయమన్నారు. ఉచితంగా సైకిళ్లు అందజేసేందుకు ముందుకు వచ్చిన బ్యాంక్ ఆఫ్ ఇండియాను అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్న భోజన పథకంతో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. వెయ్యి మంది విద్యార్థుల సామర్థ్యం ఉన్న ఈ పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. పాఠశాలకు లిఫ్ట్ ఏర్పాటుకు రూ.10 లక్షలు, కాంపౌండ్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ – బ్యాంకుల ద్వారా సీఎస్ఆర్ నిధులు తెప్పించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్న ఎంపీకి, సైకిళ్లు అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియాకు, ప్రత్యేక చొరవ తీసుకున్న జిల్లా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఇప్పటికే వనపర్తిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీ, సీటీ స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయడం, ఇప్పుడు దాదాపు రూ.16 లక్షల వ్యయంతో 500 మంది అమ్మాయిలకు సైకిళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో వనపర్తి నియోజకవర్గంలో 8, 9, 10 తరగతుల్లో చదివే 6,000 మంది విద్యార్థినులకు సీఎస్ఆర్ ద్వారా సైకిళ్లు పంపిణీ చేసే కార్యక్రమానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పాఠశాలల అభివృద్ధి ప్రథమ ప్రాధాన్యత అని, సీఎం రేవంత్‌రెడ్డి చదువుకున్న పాఠశాల అభివృద్ధికి రూ.50 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ – సీఎస్ఆర్ ద్వారా 500 సైకిళ్లు అందజేస్తున్న బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు సైకిళ్లను సద్వినియోగపరచుకొని పాఠశాలకు ప్రయాణించడానికి ఉపయోగించుకోవాలన్నారు. వనపర్తికి విద్యారంగంలో మంచి పేరు ఉన్న నేపథ్యంలో వచ్చే సంవత్సరం పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఈవో అబ్దుల్ ఘని, బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ కుట్రను సహించం

- డీలిమిటేషన్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌దే బాధ్యత :కిషన్‌రెడ్డి
- మహిళా ఆగ్రహ యాత్రలో బీజేపీ నేతలు భాగస్వామ్యం
- మోదీ ప్రభుత్వం తెచ్చిన 33% రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్
- ఏప్రిల్ 17ను 'చీకటి రోజు'గా అభివర్ణన



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టినా, మహిళా లోకానికి అన్యాయం చేయాలని చూసినా కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, వారి మిత్రపక్షాల నాయకులు స్టాలిన్, అసదుద్దీన్ ఓవైసీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం దోమలగూడ ఏవీ కళాశాల వద్ద నుండి ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వరకు మహిళా ఆగ్రహ యాత్ర చేపట్టారు. ఈ ర్యాలీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు, డా. కే. లక్ష్మణ్, ఈటెల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ – నారీ శక్తికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్న నాయకులకు రాబోయే రోజుల్లో తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెబుతుందని ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం దేశాభివృద్ధి కోసం ఏ నిర్ణయం తీసుకున్నా కాంగ్రెస్, రాహుల్ గాంధీ అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణ సాధ్యం కాని మాటలతో మహిళలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం గడప దాటడం లేదని ఎద్దేవా చేశారు. రేపు డీలిమిటేషన్ ప్రక్రియలో తెలంగాణకు గానీ, మహిళలకు గానీ అన్యాయం జరిగితే దానికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఏకమై అడ్డుకోవడం వారి మహిళా వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. ఈ అప్రజాస్వామిక ధోరణిని పల్లె పల్లెనా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మహిళా రిజర్వేషన్ల ఆవశ్యకతను గుర్తించినప్పటికీ, దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ అంశాన్ని నిర్లక్ష్యం చేసి మహిళా లోకానికి ద్రోహం చేసిందని విమర్శించారు. ఏప్రిల్ 17ను దేశ చరిత్రలో మహిళా లోకానికి జరిగిన అవమానకరమైన 'చీకటి రోజు'గా అభివర్ణించారు. నేడు బీసీ జనాభా గణన గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్, తాము అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఆ పని చేయలేదని నిలదీశారు.

మహిళలను రాజకీయంగా, సామాజికంగా వెనక్కి నెట్టాలని చూస్తున్న కాంగ్రెస్ కుట్రలను నారీలోకం గమనిస్తోందన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా సర్పంచులు, వార్డు మెంబర్లు, కౌన్సిలర్లు, మహిళా సంఘాలు ఏకమై కాంగ్రెస్ కపట బుద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా అందరూ ఏకం కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.



## వ్యాసరచన విజేతలకు నగదు రివార్డులు

▫ అందజేసిన డీజీపీ బి.శివధర్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి నగదు బహుమతులను అందజేశారు. రెండు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు 'సెంట్రల్ ఫ్లాగ్ ఫండ్' నుంచి నగదు పురస్కారాలను అందజేశారు. ప్రథమ విజేతలకు రూ. 20,000, ద్వితీయ విజేతలకు రూ. 15,000, తృతీయ విజేతలకు రూ. 10,000 చొప్పున బహుమతులు ఖరారు చేశారు. విజేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

**కేటగిరీ-1 (పీసీ నుంచి ఏఎస్ఐ వరకు):** 'పని ప్రదేశాల్లో లింగ వివక్ష' అనే అంశంపై నిర్వహించిన ఈ విభాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ బెటాలియన్‌కు చెందిన ధసరి ప్రశాంత్, కావేరి దీపిక ప్రథమ బహుమతులు సాధించారు. కరీంనగర్ పీటీసీకి చెందిన కె. రవికుమార్, ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్‌కు చెందిన ఎ. రాజు ద్వితీయ బహుమతులు... కరీంనగర్ జిల్లా చొప్పదండి పీఎస్‌కు చెందిన పి. స్వర్ణలత, జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఎ. శ్రీలత తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

**కేటగిరీ-2 (ఎస్ఐ ఆపై స్థాయి అధికారులు):** 'అట్టడుగు స్థాయి పోలీసింగ్‌ను బలోపేతం చేయడం' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ములుగు జిల్లా ఆర్ఐ వెంకట నారాయణ, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డబ్ల్యూపీఎస్ ఎస్ఐ వై. మౌనిక ప్రథమ స్థానంలో నిలిచారు. వరంగల్ పీటీసీ ఇన్‌స్పెక్టర్ కె. అశోక్ కుమార్, ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్ ఆర్ఎస్ఐ ఎన్.వి.ఆర్. చౌదరి ద్వితీయ బహుమతులు... సీఐడీ ఎస్ఐ ఖాజా హఫీజున్నీసా బేగం, జోగులాంబ గద్వాల భరోసా కేంద్రం ఎస్ఐ బి. తారక తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఐజిపి గజరావు భూపాల్, డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పండుగగా వాసవి మాత జయంతి

సీఎం రేవంత్ రెడ్డికి ఉప్పల శ్రీనివాస్ గుప్త ధన్యవాదాలు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాత జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య సమాజం హర్షం వ్యక్తం చేస్తోందని, ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి ఆర్య వైశ్యుల తరుపున టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాసవి మాత జయంతి అనేది ఆర్యవైశ్యుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని అన్నారు. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి రోజున జరుపుకునే ఈ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం ద్వారా ప్రభుత్వం ఆర్యవైశ్యుల భావోద్వేగాలను గౌరవించినట్టయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం వాసవి మాత జయంతి రోజున రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా వేడుకలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం ఎంతో అభినందనీయం అని తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు వాసవి మాత జయంతి ఉత్సవాలు మరింత భక్తి, శ్రద్ధలతో నిర్వహించబడతాయని అన్నారు.

## అద్దె బస్సులను నడిపేందుకు యత్నం

సమ్మెను విచ్ఛిన్నం చేయవద్దని వేడుకున్న కార్మికుడు



**జనగామ, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. పోలీసుల పహారా మధ్య బలవంతంగా అద్దె బస్సులను నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా ఆర్టీసీ కార్మికులు ఎక్కడి కక్కడ అడ్డుకుంటున్నారు. తాజాగా జనగామ జిల్లాలో నిరసనకు దిగిన ఆర్టీసీ కార్మికులను అడ్డుకోవద్దంటూ ఓ ఆర్టీసీ కార్మికుడు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని కదలించింది. జనగామ ఆర్టీసీ డిపో ఎదుట సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ జనగామ డిపో నుండి వివిధ ప్రాంతాలకు బస్ కు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి పంపిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయమైన తమ డిమాండ్ల కోసం రోడ్డెకిన తమను అడ్డుకోవద్దంటూ పోలీసుల కాళ్లు మొక్కి వేడుకున్నాడు. కాగా, డిమాండ్స్ నెరవేర్చే వరకు సమ్మె ఆపేదే లేదని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

యువత పట్టుదలతో ముందుకు సాగాలి : మంత్రి వాకిటి




**హైదరాబాద్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా శ్రీశ్రీశ్రీ సగర భగీరథ మహర్షి జయంతి వేడుకలు జరిగాయి. వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం నాయకులు ఉప్పరి శేఖర్, ఆస్కానీ మారుతిసాగర్ తదితరులు పాల్గొన్నారు. భగీరథ జయంతి వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల సంక్షేమం కోసం పాటుపడుతున్నాం అన్నారు. సగరులు సమస్యల పరిష్కారం కోసం ముందుంటాం అన్నారు. కలియుగంలో కూడా భగీరథుని ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగుతున్నాం అని వెల్లడించారు. శివుని తలలో ఉండే గంగను దివి నుంచి భువికి తీసుకువచ్చిన మహానీయులు భగీరథుడు అని అన్నారు. భగీరథ ప్రయత్నం అంటూ నేటి సమాజం ముందుకు సాగుతున్నదని, బసవేశ్వరుడు పనిలోనే దేవుడు ఉన్నారని చెబితే..పని సాధించేవరకు ప్రయత్నం చేయాలని భగీరథుడు చెప్పాడని అన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే నేటి యువత ప్రేరణగా తీసుకోవాలన్నారు. భగీరథున్ని దిక్సూచిగా తీసుకొని యువత ముందుకుసాగాలని పిలుపునిస్తున్నామని అన్నారు.

# విద్యార్థుల నైపుణ్యాల పెంపుదలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

వైస్ ఛాన్సలర్లకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూచన



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** విశ్వవిద్యాలయాలలో విద్యార్థుల నైపుణ్యాల పెంపుదల, నిరంతర అభివృద్ధిపై వైస్ ఛాన్సలర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా అన్నారు. లోక్ భవన్‌లో గురువారం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు , ఉన్నత విద్యా అధికారులతో గవర్నర్ శివప్రతాప్ శుక్లా సమావేశం నిర్వహించారు. ఉన్నత విద్యలో గత సంవత్సర కాలంలో అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త కోర్సులు, పరిశోధన, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీజీసీహెచ్ఈ) చైర్మన్ వి.బాలకిష్టారెడ్డి గవర్నర్‌కు వివరించారు. ఆ వెంటనే వైస్ ఛాన్సలర్ లు తమ విశ్వ విద్యాలయాలలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, ప్రవేశాలను పారదర్శకంగా చేపట్టేందుకు తీసుకున్న చర్యలు, చేపట్టిన సంస్కరణలను గవర్నర్‌కు వివరించారు.

అనంతరం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా వైస్ ఛాన్సలర్ లను ఉద్దేశించి మాట్లాడారు. ఉస్మానియా, కాకతీయ, జేఎన్‌టీయూ వంటి విశ్వవిద్యాలయాల కృషిని గవర్నర్ ప్రశంసించారు. యూనివర్సిటీలు అంటే డిగ్రీలు ప్రదానం చేసే సంస్థలుగా మాత్రమే ఉండకుండా, ఉపాధి అవకాశాలు కల్పించే, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన విద్యా వ్యవస్థ అభివృద్ధి చేయాలని గవర్నర్ అన్నారు. ఉత్తమ అధ్యాపకుల నియామకం, శిక్షణ, నిరంతర అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పరిశ్రమలతో సమన్వయం చేసుకుంటూ ఆచరణాత్మక పరిష్కారాలు, పరిశోధన, ఆవిష్కరణలు ప్రోత్సహించాలన్నారు. యువతను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దడానికి నైపుణ్యాభివృద్ధి , ఉపాధి ఆధారిత విద్యకు, నూతన విద్యా విధానం అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీలు మంచి పనితీరు కనబరుస్తూ దేశంలోనే బెస్ట్ యూనివర్సిటీ ర్యాంకింగ్ లో టాప్ లో ఉండాలన్నారు. దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ చేపట్టిన 'స్టార్టప్ ఇండియా', 'స్కిల్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' వంటి కార్యక్రమాలు యువత సాధికారతకు దోహదం చేస్తున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. 'రాష్ట్రీయ ఉన్నత శిక్షా అభియాన్', 'ప్రధానమంత్రి పరిశోధన ఫెలోషిప్' వంటి పథకాలు ఉన్నత విద్యలో కొత్త ఊపునిస్తున్నాయని అన్నారు. ఫారిన్ యూనివర్సిటీలు మన యూనివర్సిటీల కంటే గొప్పవేమి కాదన్నారు. మనదేశ యూనివర్సిటీలలో విద్యను అభ్యసించిన ఇంజనీర్లు డాక్టర్లు తమ పనితీరుతో ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారని గుర్తు చేశారు. వైస్ ఛాన్సలర్లు కేవలం నిర్వాహకులు గానే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే దార్శనిక నాయకులు అని గవర్నర్ అభివర్ణించారు. తెలంగాణను విద్య, పరిశోధన, ఆవిష్కరణలలో అగ్రగామిగా నిలపడానికి అందరూ అంకితభావంతో కలిసి చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇటీవల ప్రవేశపెట్టిన విద్యాసంస్కరణలతో కూడిన 'ఫ్రమ్ విజన్ టు ఇంపాక్ట్: టీజీసీహెచ్ఈ రీసెంట్ హయ్యర్ ఎడ్యుకేషన్ రిఫార్మ్స్" పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్, టీజీసీహెచ్ఈ చైర్మన్ వి బాల కిష్టారెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్-చైర్మన్-1 ప్రొఫెసర్ ఈ. పురుషోత్తం, వైస్-చైర్మన్-2 ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగారం, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ యాదగిరి రావు, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్, శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ , సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ నిత్యానంద రావు, వీర నారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ సూర్య ధంజయ్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఉపకులపతి టి. కిషన్ కుమార్ రెడ్డి, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. గంగాధర్, డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఉపకులపతి డా. డి. రాజిరెడ్డి, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వి. జ్ఞానప్రకాశ్, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కె. రమేష్ రెడ్డి, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఇన్‌చార్జ్ ఉపకులపతి ప్రొఫెసర్ గోవర్ధన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ లు పాల్గొన్నారు.

# మహిళా బిల్లు ద్రోహి రేవంత్ రెడ్డి

▫ వచ్చే ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం ఖాయం
▫ మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలన్నీ కుటుంబ పార్టీలే
▫ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడంతోపాటు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముమ్మాటికీ మహిళా ద్రోహి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందుతుందని భావించి సంబురాలకు సిద్ధమైన దేశ మహిళల ఆశలపై నీళ్లు చల్లారని అన్నారు. పులి పంజా విసిరేటప్పుడు ఒక అడుగు వెనకకు వేస్తోందని, అంత మాత్రాన ఓడినట్లు కాదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం మహిళా బిల్లు విషయంలో ఒక అడుగు వేశారని, రెట్టించిన ఉత్సాహంతో మరో 10 అడుగులు ముందుకేసి రాబోయే ఎన్నికల్లోపే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగిన 'మహిళా ఆక్రోశ్ పాదయాత్ర'లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ కూటమి నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డిని తిట్టని మహిళ లేదని, మహిళా బిల్లును అడ్డుకుని ఏదో సంబురప డుతున్నారని, రేవంత్ రెడ్డిని శాపనార్థాలు పెడుతున్నారని, ప్రకృతిలో తల్లిని కొలిచి పూజించే సనాతన ధర్మం మనదని, గోమాత, భూమాత సహా దేవుళ్లను సైతం సతీసమేతంగానే పిలుస్తామని, మోదీ ప్రభుత్వం సైతం మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తలిపారు. రాబోయే ఎన్నికల్లోపే మహిళా బిల్లును అమలు చేసి తీరుతామని, మోదీ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. మహిళా బిల్లును అడ్డుకునే పార్టీలన్నీ కుటుంబ వారసత్వ పార్టీలేనని, సోనియాగాంధీ, ఇందిరాగాంధీ, కనిమొళి, డింపుల్ యాదవ్, సుప్రియా సూలే పార్లమెంట్ లో ఉంటే చాలు, సాధారణ మహిళలకు చట్టసభల్లో అడుగుపెట్టే అర్హత లేదని, కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, ఎన్సీపీ పార్టీలు చెబుతున్నాయి. అందుకే మహిళా బిల్లును అడ్డుకున్నాయని తెలిపారు. తెలంగా ణలోనూ మహిళలకు నెలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండా మహిళా బిల్లు ను అడ్డుకున్న రేవంత్ రెడ్డిని గద్దె దించాలని, ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మహిళా బిల్లుకు మద్దతు తెలిపాలని సూచించారు.

## జూబ్లీహిల్స్‌లో పార్కును కాపాడిన హైడ్రా



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** అత్యంత ఖరీదైన ప్రాంతంగా భావించే జూబ్లీహిల్స్‌లోని టీవీ5 కార్యాలయం వెనుక 1600 ల గజాల పార్కు స్థలాన్ని హైడ్రా గురువారం కాపాడింది. అలాగే దుండిగల్, గండిమైసమ్మ మండలం దొమ్మరపోచంపల్లి విలేజ్‌లో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించింది. జూబ్లీహిల్స్‌లో ప్రదీప్ కుమార్ లాహోటి, సుభాష్ కుమార్ లాహోటిలు 11,700ల గజాల మేర రెండు లే ఔట్‌లు వేశారు. మధ్యలో 1600ల గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. ఈ పార్కు స్థలం తమదంటూ అక్కడి స్థానికులు తప్పుడు పత్రాలతో ఆక్రమణకు పాల్పడ్డారు. వారి మీద కేసులు కూడా పెట్టారు. ఇలా కాపాడిన పార్కు మళ్లీ ఆక్రమణలకు గురయ్యే ప్రమాదముందని ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా గురువారం ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

దుండిగల్ - గండిమైసమ్మ మండలంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ - గండిమైసమ్మ మండలం దొమ్మర పోచంపల్లిలోని 120/1, 120/28 సర్వే నంబర్లలో 4.15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. పలుమార్లు ఆక్రమణలు జరిగితే.. ఎప్పటికప్పుడు వాటిని తొలగిస్తూ వచ్చింది ప్రభుత్వం. మళ్లీ ఆక్రమణలకు గురౌతుందని భావించిన మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హైడ్రాకు లేఖ రాశారు. ఆ భూమిని కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ వినతి మేరకు గురువారం ప్రభుత్వ స్థలాన్ని కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

## ప్రభుత్వ దుర్మార్గ విధానాలతో రోడ్డెక్కుతున్న జనం

▫ ఆర్టీసీ సమస్యలు పరిష్కరించకుండా నిర్వీర్యం చేసే కుట్ర
▫ బిఆర్ఎస్ నేత జి .దేవీప్రసాద్ విమర్శలు




**హైదరాబాద్, ఏప్రిల్ 23 (జనంసాక్షి) :** రాష్ట్రప్రభుత్వ దుర్మార్గ విధానాల ఫలితంగా అన్ని వర్గాలు రోడ్ల పైకి వస్తున్నాయని బిఆర్ఎస్ నేత జి .దేవీప్రసాద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు నుంచి సమ్మె ప్రారంభిస్తే వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందని గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆరోపించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కేసీఆర్ హయంలో ఆగస్టు 2023 లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని, నాడు ఎన్నికల కోడ్ రావడంతో నిర్ణయం అపాయింటెడ్ డే రాలేదని తెలిపారు. మొత్తం 32 డిమాండ్ల పై ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటిస్ ఇస్తే ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు పిలువలేదని ఆరోపించారు. ఆర్టీసీ బస్సులకు నైపుణ్యం లేని డ్రైవర్లను తాత్కాలికంగా నియమించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్న తాత్కాలిక డ్రైవర్ నిర్వాహకంతో 38 మంది ప్రయాణికులు గాయపడ్డారని వివరించారు. తాండూరు లో పోలీసులు జారీ చేసిన హెచ్చరిక దుర్మార్గంగా ఉందని , సీఎం జిల్లాలో పోలీసులు ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెస్తున్నారని వెల్లడించారు. సమ్మె పై బీజేపీ గోడ మీద పిల్లి వాటాన్ని ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. ఆర్టీసీ సమ్మె వెనక హరీష్ రావు ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హరీష్ రావు ఆర్టీసీ కార్మికులకే కాదు. సమస్యల్లో ఉన్న వారి ఎవరికైనా మద్దతు ఇస్తారని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులకు పీఆర్‌సీ అమలు చేసింది కేసీఆర్ మాత్రమేనని వెల్లడించారు. కాళేశ్వరం ఘోష్ కమిషన్ నివేదిక పై హై కోర్టు తీర్పు తో ప్రభుత్వానికి కను విప్పు కావాలని సూచించారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ నేపథ్యంలో ఇరిగేషన్ ఇంజినీర్ల పై క్రమశిక్షణ చర్యలకు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏటీఎంలో శవం!

**హైదరాబాద్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** నగరంలోని మాసబ్‌ట్యాంకు ప్రాంతం ఏటీఎంలో వ్యక్తి మృతదేహం కలకలం సృష్టించింది. విజయనగర్ కాలనీలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏటీఎంలో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న మెహదీపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు మరణం సంభవించిందా? ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు.

## నగరంలో పెద్ద ఎత్తు కల్తీ టీపొడి విక్రయం

▫ దాడి చేసి ముఠాను పట్టుకున్న పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో టీ ప్రియుల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాసులు కురిపించుకుంటున్న ఒక ముఠాను పోలీసులు ఆట కట్టించారు. నకిలీ టీ అమ్మతున్న ముఠాను పట్టుకున్నారు. రహస్య సమాచారం మేరకు జరిపిన మెరుపు దాడుల్లో సుమారు 4 టన్నుల కల్తీ టీ పౌడర్, దానికి సంబంధించిన రసాయనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా హోటళ్లు, టీ స్టాళ్లలో వాడి పారేసిన టీ పొడిని సేకరించి, దానికి హానికరమైన రంగులు, కృత్రిమ వాసనలు కలిపి తిరిగి ప్యాక్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కల్తీ పొడిని చూడగానే అసలైన టీ పొడిలాగే కనిపించేలా రసాయనాలు వాడుతున్నారని పోలీసులు తెలిపారు. ఈ దందాపై గత కొన్ని రోజులుగా నిఘా పెట్టిన పోలీసులు, అత్యంత గోప్యంగా ఆపరేషన్ నిర్వహించి కల్తీ కేంద్రాలపై దాడి చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కల్తీ టీ పొడిని తయారు చేసేవారితో పాటు, తక్కువ ధరకు వస్తుందని తెలిసి కూడా దీన్ని కొనుగోలు చేస్తున్న కొంతమంది టీ షాప్ ఓనర్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ కల్తీ టీ పొడిలో కలిపే రంగులు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయని ఆహార భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే 5వేలు జరిమానా

▫ హంగర్గ గ్రామ కూడలిలో ఫ్లెక్సీ ఏర్పాటు

**నిజామాబాద్, ఏప్రిల్23 (జనంసాక్షి) :** తమ గ్రామంలో నాసిరకం ఐస్‌క్రీమ్ అమ్మితే జరిమానా విధిస్తామని గ్రామస్తులు, గ్రామ సర్పంచ్ హెచ్చరించారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా పోతంగల్ హంగర్గ గ్రామానికి వెళ్లే ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ బయటి నుంచి వచ్చే తోపుడు బండ్లలో నాణ్యత లేని, రంగు,రసాయనాలు కలిపిన ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్నారని వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.5 వేల జరిమానా విధిస్తామని అన్నారు. దీంతో పాటు నాసిరకం చిప్స్ ప్యాకెట్ అమ్మవద్దని, జంక్‌ఫుడ్స్ నిషిద్ధమని తెలిపారు

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370